అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 14-06-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 115 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



మాట్లాడుతున్న బి.వి రాఘవులు, వేదికపై తమ్మినేని వీరభద్రం, ఎస్. వీరయ్య, చెరుపల్లి సీతారాములు

JULY రెండో వారంలో
రాష్ట్ర బడ్జెట్
అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న సర్కార్



- మార్చిలో ఓటాన్ అకౌంట్‌ను ప్రతిపాదించిన ప్రభుత్వం
- ఇప్పుడు పూర్తి స్థాయి పద్దుపై కసరత్తులు
- కేంద్ర బడ్జెట్‌పై గంపెడాశలు
- 18 నుంచి శాఖల వారీగా మంత్రులతో డిప్యూటీ సీఎం భేటీలు
- అదే రోజు క్యాబినెట్‌లో రుణమాఫీతోపాటు బడ్జెట్‌పైనా చర్చ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నిర్వహణపై దృష్టి సారించింది. ఆ సమావేశాల్లోనే పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు ప్రారంభించింది. ఎంపీ ఎలక్షన్లు, సంబంధిత నోటిఫికేషన్, కోడ్ కారణంగా రేవంత్ సర్కారు గత మార్చిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రతిపాదించిన సంగతి విదితమే. అయితే నిబంధనల ప్రకారం జులై చివరి నాటికి పూర్తి స్థాయి పద్దును అసెంబ్లీకి సమర్పించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వివిధ శాఖల నుంచి ప్రతిపాదనలను స్వీకరించాలంటూ డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్ని శాఖలకు సమాచారం అందించారు. ఈనెల 18 నుంచి డిప్యూటీ సీఎం... మంత్రులతో విడివిడిగా భేటీ అవుతారు. ఒక్కో రోజు ఒక్కో శాఖపై పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహిస్తారు. మార్చిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆయా శాఖలకు కేటాయించిన నిధులు, వాటిలో ఎంత మేర ఖర్చయింది..? కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు, సహాయాల పరిస్థితిపై ఆయన కూలంకుశంగా చర్చించనున్నారు. ఆ సందర్భంగా సంబంధిత మంత్రులతో సమాలోచనలు చేయనున్నారు. లోక్‌సభ ఎన్నికల కారణంగా కేంద్రం కూడా మార్చిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌నే ప్రవేశపెట్టింది. అందువల్ల ఇప్పుడు ఎన్డీయే సర్కారు కూడా పూర్తి స్థాయి పద్దును పార్లమెంటుకు సమర్పించాల్సి ఉంటుంది. ఆ పద్దులో రాష్ట్రానికి ఇచ్చే గ్రాంట్లు, ఇతర ఆర్థిక సహాయాలను పరిశీలించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ తన పద్దుకు తుది మెరుగులు దిద్దనుంది.

సీఎం రేవంత్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు అనేక హామీలిచ్చిన సంగతి విదితమే. ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత, రైతు భరోసా కోసం గ్రామ సభల ద్వారా మొత్తం 1.28 కోట్ల మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరిఫికేషన్ తర్వాత 1.09 కోట్ల అప్లికేషన్లు మిగిలినట్టు ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో అత్యంత కీలకమైన రైతు భరోసా కోసం రైతులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం పేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు. రైతు భరోసాను అమలు చేయాలంటే బడ్జెట్‌లో సుమారు రూ.15 వేల కోట్లు (ఎకరానికి రూ.7,500 చొప్పున రెండు పంటలకు కలిపి రూ.15 వేలు) కేటాయించాలి. ఇందిరమ్మ ఇండ్లకు కూడా పెద్ద మొత్తంలో నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు గత బీఆర్ఎస్ సర్కారు రూ.7 లక్షల కోట్ల మేర అప్పు చేసిందంటూ ...11లో



సీఎంతో జపాన్ రాయబారి
ములాఖాత్
- తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలపై చర్చ : ఎక్స్ వేదికగా రేవంత్ రెడ్డి ట్వీట్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జపాన్ రాయబారి సుజుకి హిరోషి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యతారంగాలు, ఉపాధి కల్పన తదితర అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది. ఇందుకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. జపాన్ రాయబారి మర్యాదపూర్వకంగా తనను కలిసినట్టు పేర్కొన్నారు.

రాష్ట్రంలో మహిళాశక్తి క్యాంటీన్లు


అధికారులతో సీఎస్ శాంతి కుమారి

రెండేండ్లలో 150 ఏర్పాటు : సీఎస్ శాంతి కుమారి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో 'మహిళా శక్తి - క్యాంటీన్ సర్వీస్'లను ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. రాష్ట్రంలో క్యాంటీన్ సర్వీస్‌ల ఏర్పాటుపై గురువారం సచివాలయంలో సీఎస్ సమీక్షా ...11లో

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు
అమలు చేయాలి
వ్యవసాయ కూలీలకు రూ.12 వేలివ్వాలి

- వానాకాలం నుంచే కౌలురైతులకు రైతుభరోసా ఇవ్వాలి
- ధరణి సమస్యలు పరిష్కరించాలి
- ఫీజు బకాయిలు విడుదల చేయాలి
- జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీ పోస్టులు నింపాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అధ్యక్షతన సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు పార్లమెంట్ ఎన్నికలు, దేశ రాజకీయ పరిణామాలను వివరించారు. అనంతరం రాష్ట్ర కమిటీ పలు ప్రజా సమస్యలపై చర్చించి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ ప్రకారం వ్యవసాయ కూలీలకు, మహిళలకు ఆర్థిక సహాయం చేయాలి. కౌలు రైతులకు ఈ వానాకాలం నుంచే రైతు భరోసా అమలు చేయాలి. పంటల బీమా పథకం రైతాంగానికి ఉపయోగపడే విధంగా బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే భరించి అమలు చేయాలి. ధరణి సమస్యలను పరిష్కరించాలి. రూ.రెండు లక్షల లోపు రుణమాఫీ అమలు చేయాలి. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ధాన్యానికి, ఇతర పంటలకు బోనస్ ఇవ్వాలి. వ్యవసాయ ప్రణాళిక వెంటనే ప్రకటించాలి. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా నిరుద్యోగభృతి ఇవ్వాలి. జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలి. విత్తనాలు, ఎరువులు, రుణసౌకర్యం కల్పించాలి. గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలిచ్చి ఇంటి నిర్మాణానికి ఇందిరమ్మ పథకం కింద ఆర్థిక సహాయం చేయాలి. అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులైన వారందరికీ హక్కుపత్రాలివ్వాలి. ఉద్యోగుల అన్ని రకాల బిల్లులకు సంబంధించిన బకాయిలను విడుదల చేయాలి.'అని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.

కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలు ఆర్థిక సహకారం చేస్తామనీ, మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలో 20 లక్షల మందికిపైగా కౌలురైతులు 30 శాతానికి పైగా వ్యవసాయం చేస్తున్నారు. రైతుల ఆత్మహత్యల్లో సగంమంది కౌలు రైతులే ఉన్నారు. 2011 చట్టం ప్రకారం రుణ అర్హత కార్డులివ్వాలి. ప్రజాపాలనలో 1.30 కోట్ల దరఖాస్తులు రాగా, అందులో 70 వేలు భూమి సమస్యలే ఉన్నాయి. ఈ ధరణి సమస్యలమీద ఇప్పటికే క్షేత్రస్థాయి విచారణ పూర్తయ్యింది. ప్రభుత్వం దగ్గరే పెండింగ్‌లో ఉన్నది. తక్షణమే ప్రభుత్వం విధాన నిర్ణయం చేసి ...11లో

మెగా డీఎస్సీపై తొలిసంతకం
సీఎంగా చంద్రబాబు బాధ్యతల స్వీకరణ


తొలి సంతకం పెడుతున్న ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాయంత్రం 4:41 గంటలకు అమరావతిలోని సచివాలయంలో మొదటిబ్లాక్‌లోని తన చాంబర్‌లో వేదపండితుల ఆశీర్వచనాల మధ్య బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ తదితరులు పాల్గొన్నారు. సీఎం హోదాలో సచివాలయానికి వచ్చిన చంద్రబాబుకు వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు ఘనస్వాగతం పలికారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు 16,347 పోస్టుల భర్తీకి సంబంధించిన మెగా డీఎస్సీ ఫైలుపై సీఎం చంద్రబాబు మొదటి సంతకం చేశారు. రెండోది ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు ఫైలుపై, మూడోది సామాజిక పింఛన్లు రూ.4 వేలకు పెంపు దస్త్రంపై, నాలుగోది అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై, నైపుణ్య గణనపై ఐదో సంతకం చేశారు. అనంతరం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో సీఎం సమావేశమయ్యారు.

బాబును కలిసేందుకు వివాదాస్పద అధికారుల ప్రయత్నం

సీఎం చంద్రబాబును కలిసేందుకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు క్యూ కట్టారు. గత ప్రభుత్వ హయాంలో వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్న ...11లో

అఫిడవిట్లను పరిశీలించాకే విచారణ
పారదర్శకంగా ప్రక్రియ : జస్టిస్ ఘోష్


(ఫైల్)

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యంపై విచారణకు హాజరైన అధికారులతోపాటు ఫిర్యాదుల రూపంలో వచ్చిన అఫిడవిట్ల పరిశీలన తర్వాతే బహిరంగ విచారణ చేపడతామని జ్యుడీషియల్ కమిషన్ చైర్మెన్ జస్టిస్ పీసీ ఘోష్ చెప్పారు. విచారణ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. బీఆర్‌కే భవన్‌లో బహిరంగ విచారణ చేపడతామని ప్రకటించారు. సాంకేతిక నిపుణుల కమిటీ నుంచి రెండు వారాల్లోగా మధ్యంతర నివేదికను కోరినట్టు ...11లో

ఎక్సైజ్ శాఖలో ఏం జరుగుతోంది?
గత కొన్ని రోజులుగా నెలకొన్న పరిణామాలపై సీఎం ఆగ్రహం

- సంబంధిత మంత్రికి తెలియకుండానే అనుమతులిస్తున్నారా?
- నిలిపేసిన సోమ్, టోయిట్ కంపెనీలకు అనుమతులు
- ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని సర్కార్ ఆందోళన
- నేడు ఆబ్కారీశాఖపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కొత్తగా ఎలాంటి లిక్కర్ షాపులకు అనుమతులివ్వ లేదని ఆబ్కారీ శాఖ మంత్రి గత నెలలో ప్రకటించారు. మంత్రి ప్రకటించిన వారం రోజులకే మధ్యప్రదేశ్‌కు చెందిన సోమ్ డిస్టిలరీ, మౌంట్ ఎవరెస్ట్, కర్నాటకకు చెందిన టోయిట్, హైదరాబాద్‌కు చెందిన ఎక్సాటికాతోపాటు మరో కంపెనీకి రాష్ట్రంలో బీర్ల సరఫరాకు అబ్కారీ శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రతి పక్షాలతోపాటు స్వపక్షంలోనూ ...2లో



గ్రేస్ మార్కులు తొలగిస్తాం
నీట్ పరీక్షపై సుప్రీంకు కేంద్రం వెల్లడి
- 23న తిరిగి పరీక్ష, 30న ఫలితాలు

11లో..

ఎన్డీఏలో యూసీసీ మంట
మా ఎజెండాలోనే ఉంది : బీజేపీ
- ఏకపక్షం కాదు...ఏకాభిప్రాయం అవసరం : జేడీయూ



నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి వారం రోజులైనా కాలేదు. అప్పుడే బీజేపీ వైఖరిపై మిత్రపక్షాలు కస్సుబుస్సు లాడుతున్నాయి. ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) తమ ఎజెండాలోనే ఉన్నదని బీజేపీ నేత, కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘువాల్ స్పష్టం చేయగా అలాంటి ఏ చర్య చేపట్టినా ఏకాభిప్రాయంతోనే జరగాలని ఎన్డీఏలో మూడో అతిపెద్ద భాగస్వామ్య పక్షమైన ఐక్య జనతాదళ్ (జేడీయూ) తెగేసి చెప్పింది. తమ పార్టీ యూసీసీకి వ్యతిరేకం కాదని, అయితే అది ఏకాభిప్రాయంతోనే అమలు జరగాలని జేడీయూ జాతీయ కార్యదర్శి జేసీ త్యాగి చెప్పారు.

న్యూఢిల్లీ : యూసీసీ వంటి ముఖ్యమైన విధాన నిర్ణయాలను బీజేపీ ఏకపక్షంగా తీసుకోకూడదని, ఎన్డీఏ సంకీర్ణ భాగస్వాములను విధిగా సంప్రదించాలని కమల దళానికి జేడీయూ స్పష్టమైన సంకేతం పంపిందని త్యాగి ప్రకటన చెబుతోంది. న్యాయ శాఖ సహాయ మంత్రిగా (స్వతంత్ర హోదా) ఇటీవలే నియమితులైన మేఘువాల్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ యూసీసీ ఇప్పటికీ తమ పార్టీ ఎజెండాలోనే ఉన్నదని తెలిపారు. 'అది మా ఎజెండాలోనే ఉంది. మున్ముందు ఏమి జరుగుతుందో చూడండి' అని ...11లో

పశుసంవర్ధక శాఖ ఎండీకి నోటీసులు
ఏసీబీ విచారణ ఆధారంగా కేసు నమోదు.. రూ. 700 కోట్ల గొర్రెల స్కాంపై ఈడీ



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన రూ.700 కోట్ల గొర్రెల పంపిణీ స్కాంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు రంగంలోకి దిగారు. తాజాగా, ఈడీ కూడా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖాధికారులు చేపట్టిన విచారణ ఆధారంగా కేసును నమోదు చేసింది. అంతేగాక, రాష్ట్ర గొర్రెలు, మేకల డెవలప్‌మెంట్ ఫెడరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీకి కూడా నోటీసులు జారీ చేసిన ఈడీ.. ఈ స్కాం వెలుగు చూసినప్పటి వివరాలను సంపూర్ణంగా తమకు అందజేయాలని ఆదేశించింది. దీంతో రాష్ట్రంలో గొర్రెల పంపిణీ కుంభకోణం మరో మలుపు తిరిగినట్టయ్యింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న ఈ కుంభకోణంపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విచారణను వేగవంతం చేసింది.

కొన్ని వందల మంది లబ్దిదారులకు మేలు చేయ తలపెట్టిన ఈ స్కీంలో దళారులతో కుమ్మక్కై, పశు సంవర్ధక శాఖకు చెందిన అధికారులు భారీ మొత్తంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు ఏసీబీ అధికారులు ఇప్పటి వరకు జరిపిన విచారణలో తేలింది. ఇందులో ఇప్పటి వరకు పది మంది నిందితులను అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు.. రూ.700 కోట్లకు పైగా నిధుల గోల్‌మాల్ జరిగినట్టు నిర్ధారణకు వచ్చారు. గొర్రెల కొనుగోళ్ళు, పంపిణీ, లబ్దిదారులకు చేరవేత, గొర్రెలకు అందాల్సిన దాణా మొదలుకొని ఈ స్కీంకు సంబంధించిన పలు అంశాల్లో అవినీతి అక్రమార్కులు తమ చేతి వాటంను ప్రదర్శించినట్టు ఏసీబీ తన విచారణలో తేల్చింది. ఈ నేపథ్యంలోనే తాజాగా పశుసంవర్ధక శాఖ మాజీ డైరెక్టర్ రాంచందర్‌నాయక్, అప్పటి ఈ శాఖ మంత్రి వద్ద ఓఎస్డీగా పని చేసిన కల్యాణ్ కుమార్‌ను కూడా అరెస్ట్ చేసి సుదీర్ఘంగా విచారించింది. అయితే, పలు కీలక ప్రశ్నలకు ఈ ఇద్దరు ...2లో

'మానవాళి'పై ఇజ్రాయిల్ దాడి @250 రోజులు
ఇప్పటివరకు 37,202 మంది మృతి



గాజా : నిరంకుశత్వంతో, అక్రమణే లక్ష్యంగా గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడి నేటితో 250 రోజులకు చేరుకుంది. ఈ దాడిలో మొత్తం 37,202 మంది మరణించారు. వారిలో సగం మంది పిల్లలు (15,694 మంది) 498 మంది ఆరోగ్య కార్యకర్తలు మరియు 150 మంది ...11లో

లాసెట్‌లో 72.66 శాతం ఉత్తీర్ణత
ఫలితాలు విడుదల చేసిన లింబాద్రి



వివరాలు 2లో

ఉద్యోగ భద్రత, కార్మికుల సంక్షేమం సీఐటీయూతోనే సాధ్యం

- కార్మికుల పక్షాన మెరుగైన వేతన ఒప్పందాలు, సదుపాయాలు
- యాజమాన్యానికి తొత్తుగా మారిన హెచ్ఎంఎస్‌ను ఓడించండి
- కార్మికుల మేలు కోరే సీఐటీయూను గెలిపించండి: చుక్క రాములు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉద్యోగ భద్రత, కార్మికుల సంక్షేమం సీఐటీయూతోనే సాధ్యమని, కార్మికుల పక్షాన మెరుగైన వేతన ఒప్పందాలు చేసి సదుపాయాలు కల్పించడం కోసం యాజమాన్యాలపై పోరాడుతున్నదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, వరుణ్ బేవరేజెస్ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని వరుణ్ బేవరేజెస్ పరిశ్రమలో ఈ నెల 15న జరగనున్న గుర్తింపు ఎన్నికల సందర్భంగా గురువారం పోతిరెడ్డిపాడులోని పరిశ్రమ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. యాజమాన్యానికి తొత్తుగా మారిన హెచ్ఎంఎస్ నాయకత్వాన్ని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. గతంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పరిశ్రమలో మంచి వేతన ఒప్పందం చేశామని, అధికారంలో ఉన్న హెచ్ఎంఎస్.. కార్మికుల మేలు కోరే విధంగా ఎందుకు ఒప్పందం చేయలేకపోయిందని ప్రశ్నించారు. యాజమాన్యంతో కలిసిపోయి కార్మికవర్గానికి తీరని ద్రోహం చేసిందన్నారు. పరిశ్రమలో కార్మికులపై కక్ష పెంచుకుని వారిని బెదిరిస్తూ ఇబ్బందులు సృష్టిస్తోందన్నారు. యాజమాన్యం వేధింపులు ఆపాలన్నా, కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండాలన్నా.. సీఐటీయూతోనే సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. ఈ నెల 15న జరిగే ఎన్నికల్లో సీఐటీయూను గెలిపించేందుకు చుక్క గుర్తుపై కార్మికులు పెద్ద ఎత్తున ఓటు వేయాలని కోరారు. పరిశ్రమల్లో కార్మికుల పక్షాన నికరంగా నిలబడి నిజాయితీతో పోరాడుతున్న కార్మిక సంఘం సీఐటీయూ మాత్రమేనన్నారు. అనేక పరిశ్రమల్లో మూడు దశాబ్దాలకు పైగా ఎన్నికల్లో గెలుస్తూ కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు చేయడంతో పాటు సదుపాయాలు కల్పించడంలో సీఐటీయూ ముందుందన్నారు. వరుణ్ బేవరేజెస్ పరిశ్రమలోనూ సీఐటీయూ గెలిస్తే కార్మికుల శ్రమకు తగిన ఫలితం దక్కేలా పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లిఖార్జున్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీ.మల్లేశం, జి.సాయిలు, ఉపాధ్యక్షులు బాగారెడ్డి, యూనియన్ ప్రధాన కార్యదర్శి బాలరాజు, నాయకులు రవిందర్‌రెడ్డి, బీమ్‌రెడ్డి, ప్రేంకుమార్, షఫీ, పవన్‌కుమార్, శివ, సుధాకర్, సురేష్, వివిధ పరిశ్రమల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖలో ఏం జరుగుతోంది?

(మొదటిపేజీ తరువాయి)

తీవ్ర వ్యతిరేకత రావడంతో వాటి అనుమతులను తాత్కాలికంగా హోల్డ్‌లో పెట్టారు. తెలంగాణ కంపెనీలను కాదని కమీషన్ల కోసం ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం డిస్టలరీలకు అనుమతులిస్తున్నారని దుమారం చేలరేగడంతో ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆ శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నట్టు సమాచారం.

గత కొన్ని రోజులుగా అబ్కారీ శాఖలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. స్వయంగా ఆ శాఖ మంత్రికే తెలియకుండా విధాన పరమైన నిర్ణయాలు జరిగిపోతున్నాయనే ప్రచారం నెలకొంది.. కొత్త బ్రాండ్లకు అనుమతులిచ్చే తెలంగాణ రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రభుత్వానికి తెలియకుండానే ఇతర రాష్ట్రాల కంపెనీలను ప్రవేశ పెడుతున్నదా? ఇందులో ఎవరి ప్రమేయముంది? ఎందుకు చేస్తున్నారు? అంటూ ప్రతిపక్షాలతో పాటు అధికార పక్షంలోని ఓ వర్గం నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. అనుమతులు పొందిన సదరు కంపెనీలపై దేశ వ్యాప్తంగా అనేక ఆరోపణలున్నాయనీ, రాష్ట్రాల ఖజానాలకు గండికొడుతూ, ప్రభుత్వ సంస్థల వద్ద రుణాలను తీసుకొని ఎగ్గొడుతూ, కల్తీ మద్యం వ్యాపారం చేశాయని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సదరు కంపెనీలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమైంది. నిబంధనల మేరకే సోమ్ డిస్టిలరీ కంపెనీకి మద్యం సరఫరా చేసేందుకు అనుమతిచ్చామని ఎక్సైజ్ శాఖ మంత్రి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. డిమాండ్, సప్లయ్‌ను బట్టి కొత్త కంపెనీలకు బెవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ అనుమతులను మంజూరు చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. అప్పటికే జరగరాని నష్టం జరిగి పోయింది. మద్యం విషయంలో గత సర్కార్ దారిలోనే కాంగ్రెస్ నడుస్తున్నదనే వాదన ప్రజల్లోకి బలంగా వెళ్లింది.

ఈ నేపథ్యంలో అబ్కారీ శాఖలో జరుగుతున్న పరిణామాలపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. శాఖా పరంగా ఎక్సర్‌సైజ్ చేయకుండా తొందరపడి నిర్ణయాలు ఎందుకు తీసుకున్నారని అక్షింతలు వేయడంతో కొత్త కంపెనీలకు ఇచ్చిన అనుమతులను నిలిపేసారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి నష్ట నివారణ చర్యలకు శ్రీకారం చుట్టారు. వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టేందుకు శుక్రవారం అబ్కారీ శాఖపై సమీక్ష చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. వీటితో పాటు నాటు సారా తయారీ, అక్రమ రవాణాను అరికట్టడం, కొత్త పాలసీ రూపకల్పన, మద్యం అమ్మకాలను మరింతగా పెంచడం తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

భాగ్యనగరంలో భారీ వర్షం

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో వివిధ ప్రాంతాల్లో గురువారం సాయంత్రం నుంచి భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో రహదారులపైకి వరదనీరు చేరింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మరో రెండ్రోజులపాటు ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపిన విషయం తెలిసిందే. భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉండటంతో జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు, విద్యుత్‌శాఖ అధికారులు మరింత ప్రమత్తమయ్యారు. మలక్‌పేట, చాదర్‌ఘాట్, మాదన్నపేట, సైదాబాద్, సంతోష్‌నగర్, మీర్‌పేట్, నాగోల్, ఎల్బీనగర్, చైతన్యపురి, గడ్డి అన్నారం, దిల్‌శుక్‌నగర్, ఉప్పల్, రామంతాపూర్, బోడుప్పల్, హయత్‌నగర్, వనస్థలిపురం తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రహదారులపై వరద నీరు చేరింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద భారీగా ట్రాఫిక్ జాం అయింది. చిలకలగూడ, ప్యాట్నీ, ప్యారడైజ్ ప్రాంతాల్లో వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. సికింద్రాబాద్‌లోని మనోహర్‌థియేటర్ వద్ద ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెంటనే స్పందించిన జీహెచ్ఎంసీ విపత్తు నిర్వహణ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి.

17న రాష్ట్రానికి రానున్న కేంద్రమంత్రి బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బాధ్యతలు స్వీకరించిన తర్వాత బండి సంజయ్‌కుమార్ 17న హైదరాబాద్‌కు రానున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగే సమావేశంలో పాల్గొంటారు. అనంతరం కరీంనగర్ నియోజకవర్గంలో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు.

ఆగస్టు 15 నాటికి 'సీతారామ' నీరు

- ఈలోగా ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేయాలి..
- ఇప్పటి వరకు ఎకరం ఆయకట్టుకూ నీరివ్వలేదు
- గత ప్రభుత్వం తీరుతో నీటిపారుదలకు తీరని నష్టం
- సీతారామ ఎత్తిపోతల పథకాన్ని సందర్శించిన మంత్రులు
- పురోగతిపై మంత్రులు భట్టి, ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి సమీక్ష



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ ములకలపల్లి

గత ప్రభుత్వం తీరుతో నీటిపారుదల శాఖకు తీరని నష్టం వాటిల్లిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మంత్రి మల్లు భట్టివిక్రమార్క, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం, ములకలపల్లి మండలంలోని సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్, కాలువలను గురువారం సందర్శించారు. అనంతరం ములకలపల్లి మండలం వీకే రామవరం పంప్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సమీక్షా సమావేశంలో ముందుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం మంత్రులు మాట్లాడారు.

సీతారామ వ్యయాన్ని పెంచి దుబారా: మల్లు భట్టి విక్రమార్క

వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ.2400 కోట్లతో చేపట్టిన రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టులను ఆ తర్వాత వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా మార్చిందన్నారు. ప్రాజెక్టు వ్యయాన్ని రూ.20వేల కోట్లకు చేర్చి గత ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన ప్రాజెక్టులను తాము అధికారంలోకి రాగానే పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో 2016లో చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటి వరకూ ఒక్క ఎకరాకు నీరివ్వలేదన్నారు. పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు కావాల్సిన నిధులను మంజూరు చేస్తామన్నారు. ఆగస్టు 15 నాటికి దీన్ని పూర్తి చేసి సాగునీరు అందించాలన్నారు. సీతారామ ఎత్తిపోతలను ఎన్నెస్పీతో అనుసంధానం చేసేందుకు కావాల్సిన నిధులను కూడా మంజూరు చేస్తామని, ప్రతిపాదనలు పంపాలని సూచించారు.

గత ప్రభుత్వం తీరుతో ఇరిగేషన్ వ్యవస్థకు తీరని నష్టం: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, ప్రణాళిక లేమి కారణంగా ఇరిగేషన్ సెక్టార్‌కు తీరని నష్టం వాటిల్లిందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. డిసెంబర్ 7న తాను నీటిపారుదలశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అన్ని ప్రాజెక్టులు సందర్శిస్తున్నానని తెలిపారు. గత ప్రభుత్వం ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.94వేల కోట్లు ఖర్చు పెట్టగా, కొత్త ఆయకట్టు 93వేల ఎకరాలు మాత్రమే సేద్యంలోకి వచ్చిందని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు రూ.23వేల కోట్లు ఖర్చు పెడితే ఒక్క ఎకరానికి కూడా కొత్త ఆయకట్టు ఇవ్వలేదన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.9వేల కోట్లు ఖర్చు పెట్టగా, ఒక్క ఎకరాకి నీరు రాలేదన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాజెక్టు ద్వారా కొత్త ఆయకట్టుకు నీరు ఇవ్వలేదని విమర్శించారు. కొత్తగూడెం, పినపాక, భద్రాచలం నియోజకవర్గాలకు వీలైనంత మేరకు ఎక్కువ నీరిస్తామని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరివ్వాలని ఇరిగేషన్ పాలసీగా పెట్టుకుం దన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాల ద్వారా వీలైనంత ఎక్కువగా ఆయక ట్టును పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పర్యావరణ, అటవీ అనుమతుల కారణంగా ఆగిపోయిన లింక్ కెనాల్స్‌ను పూర్తి చేసి ఆగస్టు 15 నాటికి సీతారామ ఎత్తిపోతల ద్వారా 1.20 లక్షల ఎకరాల నాగార్జున సాగర్ స్థిరీకరణకు నీరిచ్చేలా ముందుకు పోతామని హామీ ఇచ్చారు.

ఉమ్మడి జిల్లాలో పది లక్షల ఎకరాలకు నీరే లక్ష్యం: తుమ్మల నాగేశ్వరరావు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది లక్షల ఎకరాలకు సాగునీరివ్వడమే లక్ష్యమని వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. 1997-98లో తాను మంత్రిగా ఉన్నప్పుడు దుమ్ముగూడెం ప్రాజెక్టును చేపట్టామన్నారు. తర్వాత 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. దీనికి రాజీవ్‌సాగర్‌గా నామకరణం చేసిందని తెలిపారు. కావాల్సిన నిధులు విడుదల చేసి పైపులు, మోటార్లు సమకూర్చిందన్నారు. భూ సేకరణ జరగకపోవడంతో తర్వాత వచ్చిన ప్రభుత్వం ఆనాడు సీతారామ ప్రాజెక్టుగా నిర్ణయించి రోళ్లపాడు నుంచి బయ్యారం పెద్ద చెరువుకు నీళ్లు లిఫ్ట్ చేయాలని ఆలోచన చేసిందన్నారు. కానీ రకరకాల సాంకేతిక కారణాలను చూపి గత ప్రభుత్వం సీతారామ పనులను నిర్లక్ష్యం చేసిందన్నారు. హెడ్ వర్క్స్ నుంచి థర్డ్ పంపువరకు నిలిచిపోయిన పనులను పూర్తి చేసి ఎన్నెస్పీ స్థిరీకరణకు నీరివ్వాలన్నారు. జూలూరుపాడు, సత్తుపల్లి, పాలేరు టన్నెల్ పనులను కూడా సకాలంలో పూర్తి చేయాలన్నారు.

గత ప్రభుత్వ అనాలోచిత తీరుతోనే జాప్యం: పొంగులేటి శ్రీనివాసరెడ్డి

గత ప్రభుత్వ అనాలోచిత తీరుతోనే ఇరిగేషన్ పనుల్లో జాప్యం చోటు చేసుకుందని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆనాటి ప్రభుత్వం హెడ్‌వర్క్స్, మొదట్లో ఉన్న రీచ్‌లు కంప్లీట్ చేయకుండా చివరి రీచ్‌లలోనూ అక్కడోటి.. ఇక్కడోటి గొయ్యి.. తవ్వుతూ ప్రణాళిక లేకుండా చేసిందన్నారు. వైఎస్ఆర్ చేపట్టిన రాజీవ్, ఇందిరాసాగర్‌ల పేర్లు మార్చడంతో పాటు వ్యయాన్ని పెంచినా ప్రాజెక్టును పూర్తి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామన్నారు. అశ్వాపురం నుంచి కమలాపురం వరకు సీతారామ కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించాలన్నారు. లూజ్ సాయిల్ వల్ల అక్కడక్కడ పైనుంచి మట్టి కొట్టుకు వచ్చి కాలువల్లో చేరుతోందన్నారు. దీనికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నీటిపారుదలశాఖ అధికారులపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నలుగురు మంత్రులు, ఇద్దరు ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరైన సభలో సరైన ఏర్పాట్లు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారె ఆదినారాయణ, మట్టా రాగమయి, రాందాస్‌నాయక్, భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, కొత్తగూడెం అదనపు కలెక్టర్ వేణుగోపాల్, నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ పులయ్య, ఎంపీడీవో భారతి, ఎంపీవో లక్ష్మణ్‌రావు, అగ్రికల్చర్ ఏవీ కరుణామయి తదితరులు పాల్గొన్నారు.

లాసెట్‌లో 72.66 శాతం ఉత్తీర్ణత

- ఫలితాలు విడుదల చేసిన లింబాద్రి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఈనెల మూడో తేదీన నిర్వహించిన లాసెట్ రాతపరీక్షల ఫలితాలను గురువారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి విడుదల చేశారు. లాసెట్‌కు 50,684 మంది దరఖాస్తు చేయగా, 40,268 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 29,258 (72.66 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 34,453 మంది అబ్బాయిలు దరఖాస్తు చేయగా, 26,875 మంది పరీక్ష రాశారు. వారిలో 20,237 (75.30 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. 16,226 మంది అమ్మాయిలు దరఖాస్తు చేస్తే, 13,389 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 9,017 (67.35 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు దరఖాస్తు చేయగా, నలుగురు పరీక్ష రాశారు. నలుగురూ ఉత్తీర్ణులయ్యారు. 30 లా కాలేజీల్లో 8,180 సీట్లు అందుబాటులో ఉన్నాయని లింబాద్రి వివరించారు. ఇందులో ప్రభుత్వ కాలేజీలు నాలుగు, గురుకులాలు నాలుగు, ప్రయివేటు కాలేజీలు 22 ఉన్నాయని అన్నారు. మూడేండ్ల లా కోర్సుకు సంబంధించి 25 కాలేజీల్లో 4,910 సీట్లు, ఐదేండ్ల లా కోర్సుకు సంబంధించి 22 కాలేజీల్లో 2,280 సీట్లు, పీజీ లా కోర్సుకు సంబంధించి 19 కాలేజీల్లో 990 సీట్లున్నాయని వివరించారు. ఆయా కాలేజీల్లో తనిఖీలు పూర్తయ్యాయనీ, వివరాలను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)కి పంపించామని చెప్పారు. అనుమతి రాగానే లాసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియను చేపడతామని అన్నారు. టీఏఎఫ్ఆర్సీ నిర్ణయించిన ఫీజులనే లా కోర్సుల్లో యాజమాన్య కోటాలో చేరే వారికి వసూలు చేయాలని చెప్పారు. మూడేండ్ల లాసెట్‌లో 97 మార్కులతో హైదరాబాద్‌కు చెందిన పీజీఎం అంబేద్కర్ టాపర్‌గా నిలిచారని అన్నారు. 96 మార్కులతో రంగారెడ్డికి చెందిన ప్రత్యూష్ సరస రెండో ర్యాంకు, 95 మార్కులతో ఖమ్మం జిల్లాకు చెందిన తల్లూరి నరేష్ మూడో ర్యాంకు సాధించారని వివరించారు. ఐదేండ్ల లాసెట్‌లో 87 మార్కులతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన శ్రీరాం బొడ్డు ప్రథమ ర్యాంకు పొందారని చెప్పారు. 87 మార్కులతో కామారెడ్డికి చెందిన పిప్పిరిశెట్టి దినేష్ రెండో ర్యాంకు, 84 మార్కులతో మేడ్చల్ మల్కాజిగిరికి చెందిన ఆర్‌పి విజయనందిని మూడో ర్యాంకు సాధించారని అన్నారు. పీజీలాసెట్‌లో 76 మార్కులతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన పేరి బాల సాయి విష్ణు వర్ధన్ ప్రథమ ర్యాంకు సాధించారని చెప్పారు. 70 మార్కులతో ఏపీకి చెందిన పొట్లూరి అబినీత్ జాసన్ రెండో ర్యాంకు, 67 మార్కులతో హైదరాబాద్‌కు చెందిన నమన్ సిన్హా మూడో ర్యాంకు పొందారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు వి వెంకటరమణ, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మినారాయణ, లాసెట్ కన్వీనర్ బి విజయలక్ష్మి, మాజీ కన్వీనర్ జిబి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాసెట్ ఫలితాల వివరాలు

కోర్సు	దరఖాస్తు	హాజరు	అర్హత	శాతం
మూడేండ్ల లా కోర్సు	36,079	27,993	20,510	73.27
ఐదేండ్ల లా కోర్సు	10,197	8,412	5,478	65.12
పీజీలాసెట్	4,408	3,863	3,270	84.65
మొత్తం	50,684	40,268	29,258	72.66

పశుసంవర్ధక శాఖ ఎండీకీ నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

నిందితులు నేరుగా సమాధానాలివ్వకుండా దాట వేసినట్టు తెలిసింది. వీరిద్దరిని మరోసారి తమ కస్టడీలోకి తీసుకొని విచారించాలని ఏసీబీ అధికారులు యోచిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు కూడా ఈ స్కాంలో ఏసీబీ ఇప్పటి వరకు జరిపిన విచారణను పరిగణలోకి తీసుకొని నిందితులు పెద్ద ఎత్తున మనీలాండరింగ్‌కు పాల్పడినట్టుగా అనుమానిస్తున్నారు. ఈ మేరకు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి, దర్యాప్తునకు రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా ఈ స్కాం ఏ విధంగా వెలుగులోకి వచ్చింది? దానికి సంబంధించిన ప్రాథమిక ఆధారాలు ఏమి లభించాయి? ఈ స్కీంను రూపొందించిన తీరు తెన్నులు, అమలు చేసిన తీరు, అందుకు అనుసరించిన మార్గదర్శకాలు మొదలైన సంపూర్ణ వివరాలను అందజేయాలని గొర్రెలు, మేకలు డెవలప్‌మెంట్ ఫెడరేషన్ కార్పొ రేషన్ ఎండీకి ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. అలాగే, ఈ స్కాం విచారణకు సంబంధించిన సమాచారాన్ని తమకు అందజేయాలని రాష్ట్ర ఏసీబీ అధికారులను కూడా ఈడీ కోరినట్టు తెలిసింది. దీంతో ఈ స్కాం దర్యాప్తు మరో మలుపు తిరగగా.. ఇందులో ఇంకా వెలుగులోకి రాకుండా ఉన్న అధికారులు సిబ్బందితో పాటు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రముఖులలో కలవరం మొదలైనట్టు సమాచారం.

మల్టీజోన్-2లో 776 మందికి జీహెచ్ఎం పదోన్నతులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మల్టీజోన్-2 పరిధిలో స్థానిక సంస్థలకు సంబంధించి 776 మంది స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెడ్మాస్టర్ (జీహెచ్ఎం) పదోన్నతులు లభించాయి. ఈ మేరకు ఆర్జేడీ ఈ విజయలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల ఎనిమిది నుంచి మల్టీజోన్-1 పరిధిలో 22 వరకు, మల్టీజోన్-2 పరిధిలో ఈనెల 30 వరకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు వెంటనే కొత్త పోస్టింగుల్లో చేరాలని ఆదేశించారు. పదోన్నతులు పొందిన వారిని వెంటనే బదిలీ చేయాలని హెచ్ఎం/ఎంఈవోను కోరారు. సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఏకీకృత సర్వీసు నిబంధనల కేసుకు సంబంధించి తుది తీర్పునకు లోబడి ఈ పదోన్నతులను ఇచ్చామని తెలిపారు. మల్టీజోన్-2 పరిధిలో స్థానిక సంస్థలకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్ఎం పదోన్నతులు రావడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

మిగులు విద్యుత్ అందించినందుకు కేసీఆర్‌కు నోటీసులా?

- ప్రతీకార రాజకీయాలకు పరాకాష్ట ఇది.. : సీఎం రేవంత్‌రెడ్డికి డాక్టర్ దాసోజ్ శ్రావణ్ బహిరంగ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యుత్ లోటుతో సతమతమవుతున్న రాష్ట్రాన్ని, మిగులు విద్యుత్తు అందించి వెలుగులు విరజిమ్మే తెలంగాణగా తీర్చిదిద్దినందుకు కేసీఆర్‌కి సంజాయిషీ నోటీసులేంటని బీఆర్ఎస్ నాయకులు దాసోజ్ శ్రావణ్ గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ప్రతీకార రాజకీయాలకు పరాకాష్టగా తమరి పాలన సాగుతున్నదని విమర్శించారు. రైతాంగానికి 24 గంటలు ఉచిత విద్యుత్తు అందించి, వారి జీవితాల్లో వెలుగులు నింపినందుకు, ప్రతి ఇంటికి, ప్రతి పరిశ్రమకు నిరంతర విద్యుత్తు సరఫరా చేసి, అభివృద్ధికి దారితీసినందుకు సంజాయిషీ నోటీసులు పంపారా? అని ప్రశ్నించారు. ప్రతీకార రాజకీయాలను పక్కనపెట్టి, ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. 24 గంటల విద్యుత్తు సరఫరా చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రజల ఆకాంక్షలను, అభివృద్ధిని అడ్డుకునే మీ దుష్ప్రయత్నాలను విరమించుకోవాలని హితవు పలికారు. హామీల అమలు చేతకాని గుంపుమేస్త్రీగా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రతీకార రాజకీయాలకు తెరలేపారని పేర్కొన్నారు. రుణ మాఫీ, రైతు భరోసా, ఉద్యోగాలు, రూ. 4 వేల పెన్షన్, నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాలు, మహిళకు రూ.2500 లాంటి పథకాలు అమలు చెసేందుకు చేతకాక, కేసీఆర్‌ను బద్నాం చెయ్యాలని చూస్తున్నారని ఆరోపించారు.

ఈ 'పరీక్ష' ఎందుకు?

ఇన్నేండ్ల సేవకు ఇచ్చే గౌరవమిదేనా..

- ఆశాలకు ఎగ్జామ్ ఆలోచనను విరమించుకోవాలి
- వేతనాలు పెంచాలి
- తెలంగాణ ఆశాల వర్కర్స్ యూనియన్ డిమాండ్
- రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ధర్నా
- ములుగులో మంత్రి సీతక్కకు వినతి

ప్రభుత్వం అప్పగించిన ప్రతి పనినీ చేస్తున్నాం.. కనీస వేతనాల్లేకున్నా.. ఎన్నో ఏండ్ల నుంచి ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేరువ చేస్తున్నాం.. కరోనా సమయంలో ప్రజల ఆరోగ్య రక్షణకు తమ ప్రాణాలను పణంగా పెట్టాం.. కుటుంబాలను వదిలి వీధుల్లోకొచ్చి సేవ చేశాం.. ఇన్నేండ్ల మా అనుభవానికి 'పరీక్ష' పేరుతో ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా?.. అంటూ ఆశాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్ష రాసి తమ జ్ఞాపకశక్తిని, పనితీరును నిరూపించుకోవాలంటున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆశాలు మళ్లీ రోడ్డెక్కారు. గత ప్రభుత్వం తెచ్చిన ఈ నిర్ణయంపై అప్పట్లోనే పెద్దఎత్తున ఉద్యమించగా.. సర్కార్ వెనక్కి తగ్గింది. అదే నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకురావడంతో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు. సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఆశాలకు ఎగ్జామ్ పెట్టే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశంలో ఉన్న మంత్రి సీతక్కను ఆశాలు కలిసి తమ సమస్యలపై మొరపెట్టుకున్నారు. అందుకు స్పందించిన మంత్రి.. పరీక్ష లేకుండా చూస్తామని, ఆగస్టు వరకు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నవతెలంగాణ- విలేకరులు

నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ దాసరి హరిచందనకు వినతిపత్రం అందజేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. వనపర్తి మర్రికుంట మెయిన్ రోడ్డు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట పెద్దఎత్తున ధర్నా చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా మెడికల్ ఆఫీసర్ డిఎంహెచ్‌వో వెంకటదాసుకి వినతిపత్రం అందజేశారు.



నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్క్ దగ్గర ధర్నా నిర్వహించారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా అనంతరం కలెక్టర్ బిఎల్ సంతోష్‌కి వినతిపత్రం ఇచ్చారు.

రంగారెడ్డిలో ఉద్రిక్తత..

రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట సుమారు నాలుగు గంటల పాటు బైటాయించి.. కలెక్టర్ తమ వద్దకు వచ్చే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించి కూర్చున్నారు. పోలీసులు నిరసనకారులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. కార్మికుల కోరిక మేరకు పోలీసులు అధికారులుతో మాట్లాడి.. ఒక్కో మండలం నుంచి ఇద్దరి చొప్పున తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించేందుకు అనుమతి ఇవ్వడంతో ఆశావర్కర్లు శాంతించారు. అనంతరం అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వికారాబాద్‌లో ధర్నా చేపట్టారు. ఆదిలాబాద్‌లో సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ఎదుట బైటాయించారు. నిర్మల్ కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆసిఫాబాద్, మంచిర్యాల కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా అనంతరం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. సంగారెడ్డిలో కేవల్ కిషన్ భవన్ నుంచి ర్యాలీగా బయల్దేరి కలెక్టరేట్ వరకు చేరుకున్నారు. సిద్దిపేటలో ధర్నా చేశారు.

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టరేట్ల ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. 33 సంవత్సరాల అనుభవం కలిగిన ఆశా వర్కర్లకు ఇప్పుడు ఎగ్జామ్ పెట్టాల్సిన అవసరం ఏముందని నేతలు ప్రశ్నించారు. భద్రాద్రి జిల్లాలో ధర్నా వద్దకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎన్సీడీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వచ్చి కూడిన వినతి పత్రాన్ని స్వీకరించారు.

లోటు బడ్జెట్ వల్లే వేతనాల ఆలస్యం.. : మంత్రి సీతక్క


ములుగు జిల్లా కేంద్రంలో డీఎల్ఆర్ ఫంక్షన్ హల్ నుంచి జాతీయ రహదారిపై భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా చేశారు. మంత్రి సీతక్క కలెక్టర్ సమావేశపు హల్‌లో సమీక్ష సమావేశంలో ఉండగా, మంత్రి రావాలని ఆశాలు పట్టుబట్టారు. డీఎం అండ్ హెచ్ఓ అప్పయ్య ఆశాలతో మాట్లాడి సీతక్క దగ్గరకు తీసుకెళ్లి వినతిపత్రం ఇప్పించారు. మంత్రి స్పందించి.. పరీక్ష లేకుండా చూస్తామని, బడ్జెట్ లోటు వల్ల జీతాలు సమయానికి ఇవ్వలేకపోతున్నామని వెంటనే ఇస్తామని, ఫిక్స్‌డ్ వేతనం, ఇతర అన్ని సమస్యలు మా దృష్టిలో ఉన్నాయని, ఆగస్టు వరకు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. జయశంకర్-భూపాలపల్లి, వరంగల్‌లో ధర్నా చేశారు. భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా, వరంగల్‌లో ఏవో శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు.

సంకీర్ణ రాజ్యంలో సమాఖ్యతత్వం పరిఢవిల్లేనా?

బీజేపీ పాలనలో అంతా కేంద్రీకృత పాలనే

- అన్నింటా వారిదే పెత్తనం
- జీఎస్టీ అమలుతో కుదేలైన రాష్ట్రాలు

రుణ పరిమితిపై ఆంక్షలు
రాష్ట్రాల అభివృద్ధికి అడుగడుగునా మోకాలడ్డు



న్యూఢిల్లీ : కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలో ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన విషయం తెలిసిందే. గత పది సంవత్సరాల కాలంలో పరిపాలన యావత్తూ 'వన్ మ్యాన్ షో' తరహాలో సాగింది. అయితే ఇప్పుడు ఆ వాతావరణం లేదు. తెలుగుదేశం, జేడీయూ సహా పలు పార్టీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి పరిపాలన సాగించాల్సి ఉంటుంది. తెలుగుదేశం, జేడీయూ పార్టీలకు కలిపి 28 మంది సభ్యులు ఉన్నారు. వారు కోరుకుంటే ఏ క్షణమైనా ప్రభుత్వాన్ని అస్థిరపరచవచ్చు.

2014, 2019 ఎన్నికల్లో బీజేపీకి స్పష్టమైన మెజారిటీ వచ్చింది. దీంతో ప్రధాని మోడీ ఆడింది ఆట...పాడింది పాట మాదిరిగా సాగిపోయింది. దీంతో పాటు పలు రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కేంద్ర నిధులపై కట్టుదిట్టమైన నియంత్రణల ద్వారా ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం అనేక ఇబ్బందులు పెట్టింది. ఆయా రాష్ట్రాల్లో గవర్నర్లు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. శాసనసభల్లో ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలపకుండా మోకాలడ్డారు. ప్రజా తీర్పును కాలరాస్తూ బీజేపీ యేతర ప్రభుత్వాలను కూలదోయడానికి కూడా బీజేపీ నాయకత్వం వెనకాడలేదు. దీంతో సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింది. అధికారాలన్నీ ఒకే వ్యక్తి చేతిలో కేంద్రీకృతమయ్యాయి.

ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం పోయి ఎన్డీఏ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోంది. ఈ నేపథ్యంలో దేశంలో ఆర్థిక పరంగా సమాఖ్యతత్వం రూపుదిద్దుకుంటుందా అనే ప్రశ్న తలెత్తుతోంది.

అప్పుడు రాష్ట్రాల చేతిలో అధికారాలు

బండి చక్రాల మాదిరిగా అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు సమాఖ్యతత్వాన్ని ముందుకు తీసుకుపోవాల్సి ఉంటుంది. అదే రాజ్యాంగం నిర్మించిన డబుల్ ఇంజిన్ సర్కార్. 72, 73వ రాజ్యాంగ సవరణల ద్వారా మన దేశం రాజ్యాంగపరంగా మూడు ఇంజిన్ల ప్రభుత్వంగా మారిపోయింది. స్థానిక సంస్థలు గతంలో మూడో ఇంజిన్‌గా పనిచేశాయి. అయితే దురదృష్టవశాత్తూ ఇప్పుడవి నిర్వీర్యమైపోయాయి. గతంలో రాష్ట్రాలకు స్వతంత్రంగా పన్నులు విధించుకునే అధికారం ఉండేది.

రాష్ట్రాలను స్వతంత్రంగా అభివృద్ధి చేసుకునేందుకు, అందుకోసం నిధులు ఖర్చు చేసేందుకు వాటికి స్వేచ్ఛ ఉండేది. వ్యయంలో ఐదింట మూడో వంతు రాష్ట్రాల పరిధిలోనే జరిగేది. కేంద్రం వద్ద రుణ బకాయిలు ఉన్నప్పుడు మినహాయించి ఇతరత్రా రుణాలు తీసుకునేందుకు కూడా రాష్ట్రాలకు పూర్తి అధికారాలు ఉండేవి.

జీఎస్టీ అమలుతో...

జీఎస్టీ అమలుతో అంతా తారుమారై పోయింది. జీఎస్టీ విధానాన్ని నిర్ణయించడంలో, దానిని అమలు చేయడంలో తమకు సమాన అధికారాలు ఉంటాయన్న నమ్మకంతో తమ అమ్మకపు/విలువ ఆధారిత పన్ను అధికారాలను, కొన్ని ఇతర పన్నులకు సంబంధించిన అధికారాలను జీఎస్టీలో కలిపేసేందుకు రాష్ట్రాలు అంగీకరించాయి. అయితే మోడీ ప్రభుత్వం కేంద్ర, బీజేపీ పాలిత రాష్ట్రాల ఉమ్మడి అధికారాలను ఉపయోగించి జీఎస్టీ విధానాన్ని, దాని అమలును కేంద్ర ప్రభుత్వ పన్నుగా మార్చేసింది. కోవిడ్ సమయంలో తమకు ఇస్తానని హామీ ఇచ్చిన జీఎస్టీ పరిహారాన్ని చెల్లించాలంటూ రాష్ట్రాలు ఎన్ని అభ్యర్థనలు చేసినప్పటికీ అవన్నీ కేంద్రం వద్ద చెవిటి వాని ముందు శంఖం ఊదిన చందంగా మారిపోయాయి.

అప్పుకు అడ్డుపడి...

ప్రతిపక్ష పార్టీల రాష్ట్రాలకు అప్పు పుట్టకుండా కేంద్రం అనేక సమస్యలు సృష్టించింది. ముఖ్యంగా కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రుణ పరిమితిని కుదించారు. గతంలో అధికంగా తీసుకున్న అప్పును రికవరీ చేసే పేరుతో తాజా రుణాలకు మోకాలడ్డారు. కోవిడ్ సమయంలో అదనపు రుణాలు పొందేందుకు అనుమతించిన ప్పటికీ సవాలక్ష షరతులు విధించారు. కేంద్రం కబంధ హస్తాల నుండి రాష్ట్రాలు తప్పించుకోకుండా మోడీ ప్రభుత్వం వడ్డీ లేకుండా యాభై సంవత్సరాల మూలధన వ్యయ రుణాలను ఇవ్వడం ప్రారంభించింది. దీంతో రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ అప్పుల కోసం ఎగ బడ్డాయి. ఇన్ని ప్రతికూల పరిస్థితుల మధ్య రాష్ట్ర ఇంజిన్ ఆగిపోయే పరిస్థితికి వచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఇంజిన్‌కు రాష్ట్రాలు ట్రాక్టర్ ట్రాలీ ఇంజిన్‌గా మారిపోయాయి.

గుదిబండగా కేంద్ర పథకాలు

కేంద్ర ప్రభుత్వం స్పాన్సర్ చేసే పథకాలు (సీఎస్ఎస్) కూడా రాష్ట్రాలకు గుదిబండగా మారాయి. రాష్ట్రాల ఖర్చులు, అభివృద్ధిపై అవి ప్రభావం చూపాయి.

సీఎస్ఎస్‌ల పేరు మార్చి అవి కేంద్ర ప్రభుత్వ పథకాలన్న భ్రమ కల్పించే ప్రయత్నం చేశారు. ఈ పథకాలకు నిధుల కేటాయింపులపై కేంద్రానిదే నియంత్రణ. ఆయా పథకాల అమలులో కేంద్రం జోక్యం అధికంగానే ఉంటుంది. సీఎస్ఎస్‌లకు రాష్ట్రాలు అందించాల్సిన వాటాను గణనీయంగా పెంచారు. అదే సమయంలో రాష్ట్ర పథకాల పరిమాణాన్ని కుదించారు. మొత్తంగా పథకాల వ్యయ భారం రాష్ట్రాలపైనే అధికంగా పడింది. మరోవైపు కేంద్ర నిధుల విడుదలను నియంత్రించారు. ఆడిట్ల పేరుతో చిన్న చిన్న లోపాలను భూతద్దంలో వెతికిపట్టి, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు నిధులు విడుదల చేయకుండా ఆపేశారు.

కింకర్తవ్యం?

రాష్ట్రాల అధికారాలను, స్వయం ప్రతిపత్తిని కాపాడాలంటే ఏం చేయాలి?. దీనిపై నిపుణులు ఏమంటున్నారంటే...జీఎస్టీ మండలిలో నిర్ణయాలు తీసుకునే అధికారాలు రాష్ట్రాల చేతిలో కూడా ఉండాలి. కేంద్రానికి ఉన్న ఓటింగ్ అధికారాన్ని 15%కి తగ్గించాలి. దీనివల్ల జీఎస్టీ మండలిలో కేంద్రానికి విశేషాధికారాలు ఉండవు. రాష్ట్ర ప్రభుత్వాలు సంప్రదింపుల ప్రక్రియ ద్వారా ఏకాభిప్రాయం సాధించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా నిలువరించాలి. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సీఎస్ఎస్ పథకాలను రద్దు చేసి, ఆ నిధులను రాష్ట్రాలకు బదిలీ చేయాల్సిన అవసరం ఉంది. దీనివల్ల రాష్ట్రాలకు కేంద్ర నిధులు అందుతాయి. రాష్ట్రాలకు రుణాలు ఇచ్చే పద్ధతికి కేంద్రం స్వస్తి చెప్పాలి. మూలధన వ్యయ రుణ పథకాన్ని కేంద్రం వెంటనే నిలిపివేయాలి.

కేసరపల్లిలో కన్పించని నితీశ్!

గైర్హాజరుపై ఊహాగానాలు

- ఎన్డీఏ బీటలు వారుతోందన్న ఆర్జేడీ
- శాఖల కేటాయింపుపై అసంతృప్తితోనే అన్న కాంగ్రెస్
- ఇతర కార్యక్రమాలు ఉండడం వల్లనే అంటున్న బీజేపీ



న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడి ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన జేడీయూ నేత, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ గైర్హాజరు కావడంపై రాజకీయంగా పలు ఊహాగానాలు చెలరేగుతున్నాయి. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటులో చంద్రబాబుతో కలిసి కీలక పాత్ర పోషించిన నితీష్, ఏపీ ప్రభుత్వ ప్రమాణస్వీకారానికి దూరంగా ఉండిపోయారు. ఆ సమయంలో ఆయన బీహార్ రాజధాని పాట్నాలోనే ఉన్నారు. దీనిపై మిత్రపక్షాలే కాకుండా ప్రతిపక్షాలు కూడా స్పందించాయి.

చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఎన్డీఏకు చెందిన అతిరథ మహారథులు, సినీ ప్రముఖులు, వివిధ రంగాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఎంతో అట్టహాసంగా జరిగిన ఈ వేడుకకు నితీష్ దూరంగా ఉండడం పలు ఊహాగానాలకు ఆస్కారం కలిగిస్తోంది.

భాగస్వామ్య పక్షాల ఐక్యతపై అనుమానాలు కూడా తలెత్తుతున్నాయి. ఇతర కార్యక్రమాలు ఉండడం వల్లనే నితీశ్ విజయవాడ వెళ్లలేకపోయారని బీజేపీ చెబుతోంది. ప్రతిపక్షాలు మాత్రం దీనిని అంతర్గత విభేదాలుగా చూస్తున్నాయి.

ఇది వారి అంతరంగిక వ్యవహారమే అయినప్పటికీ ఎన్డీఏలో పరిస్థితులు సజావుగా లేదన్న విషయం స్పష్టమవుతోందని ఆర్జేడీ ప్రతినిధి ఇజాజ్ అహ్మద్ వ్యాఖ్యానించారు. కూటమిలో బీటలు కన్పిస్తున్నాయని ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రకటించడానికి ముందే ఎన్డీఏ కూటమిలో విభేదాలు ఏర్పడతాయని తమ పార్టీ నేత తేజస్వీ యాదవ్ అంచనా వేశారని గుర్తు చేశారు. కాగా క్యాబినెట్ ఏర్పాటు సమయంలో శాఖల కేటాయింపుల సరిగా జరగలేదన్న అసంతృప్తితోనే నితీష్ విజయవాడ వెళ్లలేదని కాంగ్రెస్ ప్రతినిధి జ్ఞాన్ రంజన్ తెలిపారు. 'శాఖల కేటాయింపులో బీహార్‌ను పట్టించుకోకపోవడంతో అందరి కండ్లూ నితీశ్ పైనే పడ్డాయి. ఇలా జరుగుతుందని మాకు తెలుసు. అయితే ఇంత త్వరగా జరుగుతుందని మాత్రం అనుకోలేదు' అని అన్నారు. ఎన్డీఏ ఎక్కువ కాలం మనుగడ సాగించలేదని ఆయన చెప్పారు.

ప్రతిపక్షాల వాదనను బీజేపీ తోసిపుచ్చింది. 'బీజేపీ వింధ్య పర్వత శ్రేణులకు ఉత్తర ప్రాంతంలోనే బలంగా ఉన్నదని మమ్మల్ని నిందించిన రోజులు పోయాయి. మాకు ఇప్పటికే ఒడిశాలో ప్రభుత్వం ఉంది. దక్షిణాదిన కూడా ఎన్డీఏ మెరుగ్గా కన్పిస్తోంది' అని ఆ పార్టీ జాతీయ ప్రతినిధి గురు ప్రకాష్ చెప్పారు. ఇతర కార్యక్రమాలు ఉండడం వల్లనే చంద్రబాబు ప్రమాణస్వీకారానికి నితీశ్ వెళ్లలేదని అంటూ దీనికి వక్రభాష్యాలు చెప్పవద్దని మీడియాను హెచ్చరించారు.

మోడీ సర్కారుకు పరీక్ష

- దేశంలో శాంతి భద్రతలపై అనుమానాలు
- జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు, అమర్‌నాథ్ యాత్రపై ప్రభావం
- రాజకీయ విశ్లేషకులు, నిపుణుల అంచనాలు



న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రదాడులు కొత్తగా ఏర్పడిన మోడీ ప్రభుత్వానికి సవాల్‌గా పరిణమించాయి. అంతేకాదు, జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు, అమర్‌నాథ్ యాత్రల పైనా ఇవి ప్రభావాన్ని చూపే అవకాశాలున్నాయని విశ్లేషకులు చెప్తున్నారు. ఈనెల 9న ఒక పర్యాటకులు ప్రయాణిస్తున్న ఒక బస్సుపై ఉగ్రవాదులు కాల్పులు జరపటంతో తొమ్మిది మంది మరణించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ఉగ్రదాడుల కలకలం దేశంలోని భద్రతను ప్రశ్నార్థకంగా మార్చిందనీ, కొత్తగా ఏర్పడిన మోడీ సర్కారుకు ఇది అతిపెద్ద సవాలు అని విశ్లేషకులు, నిపుణులు చెప్తున్నారు.

ప్రధాని మోడీ.. ఎన్నికల సమయంలో కాశ్మీర్‌లో ఓటింగ్ శాతాన్ని తన పదవీకాలంలో అత్యంత సంతోషకరమైన విషయంగా అభివర్ణించారు. ఆర్టికల్ 370ని తన ప్రభుత్వం ప్రభావవంతంగా రద్దు చేసినందున ఇక్కడ ఇక ఎన్నికలు రావచ్చనే ఆశలను ఆయన రేకెత్తించారు. సెప్టెంబరు 30వ తేదీ వరకు సుప్రీంకోర్టు గడువు కంటే ముందే అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నదని ఆయన అన్నారు.

జమ్మూలోని రియాసిలో పౌర రవాణా బస్సుపై ఇప్పటివరకు జరిగిన మూడు దాడుల్లో మొదటిది.. జూన్ 9న రాత్రి 7 గంటల సమయంలో, రాష్ట్రపతి భవన్‌లో మోడీ, ఆయన మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలోనే జరిగింది. ఆ వేడుక జరిగినంత కాలం టెలివిజన్ ఛానెల్‌లు ఈ దాడికి సంబంధించిన వార్తను ప్రసారం చేయలేదు. కానీ సోషల్ మీడియాలో, కత్రాకు వెళ్లే యాత్రికులు ఉన్న బస్సుపై ఉగ్రవాదులు కాల్పులు జరుపుతున్నారనే వార్తలు వేగంగా వ్యాపించాయి. డ్రైవర్‌పై కాల్పులు జరగటంతో.. బస్సు కింద ఉన్న లోయలో పడి తొమ్మిది మంది మృతి చెందారు. అయితే, దాడి వెనుక ఉన్నవారు మోడీ ప్రమాణ స్వీకారోత్సవం సమయంలోనే శాంతి భద్రతలపై సవాలు విసిరారని విశ్లేషకులు అంటున్నారు. ఎన్నికల సమయంలో నెలకొని ఉన్న శాంతి తాత్కాలికమనీ, దేశంలో అలజడులు ఎప్పుడైనా, ఏ రూపంలోనైనా చెలరేగచ్చన్న అనుమానాలను కొట్టిపారేయలేమనీ, ఇందుకు రియాసి ఘటనే ప్రత్యక్ష ఉదాహరణ అని చెప్తున్నారు.

2019 నుంచి కాశ్మీర్‌లో భద్రతను పెంచటంతో కావచ్చు, మతపరమైన రూపకల్పన కారణంగా.. ఉగ్రవాదులు తమ దృష్టిని జమ్మూ వైపు మళ్లించినట్టు సమాచారం. 2021 నుంచి ఈ ప్రాంతం, ముఖ్యంగా రెండు సరిహద్దు జిల్లాలైన రాజౌరి, పూంచ్‌లు ఘోరమైన ఉగ్రవాద సంఘటనలను చూశాయి. భద్రతా దళాలకు 2023 ఏడాది ఈ ప్రాంతంలో భయంకరమైనదిగా మిగిలింది. ఆ ఏడాది ఐదు దాడులతో 20 మంది సైనిక సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. స్థానిక గుజార్ జనాభాలో కొందరే మాంతర ఉగ్రవాదికి ఆశ్రయం కల్పించడంలో నిమగ్నమై ఉన్నారనే అనుమానం, పూంచ్‌లో ఆర్మీ సిబ్బంది పౌరులను చిత్రహింసలకు గురిచేయడానికి దారితీసింది.

అనంత్‌నాగ్-రాజౌరీ నియోజకవర్గంలో మే 25న ఎన్నికలు జరగనున్న తరుణంలో తాజాగా మూడు ఉగ్రవాద ఘటనలు చోటుచేసుకున్నాయి. ఏప్రిల్ 22న రాజౌరిలోని కుంట టాప్‌లో ఆర్మీలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి హత్యకు గురయ్యాడు. అదే రోజు, ఉధంపూర్‌లోని బసంత్‌గఢ్ ప్రాంతంలో ఒక గ్రామ రక్షణ గార్డు మరణించాడు. మే 2న, పూంచ్‌లోని సురన్‌కోట్ ప్రాంతంలో భారత వైమానిక దళం కాన్వాయ్‌పై దాడి జరిగింది. ఇందులో ఒక అధికారి మరణించారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

ఉగ్రవాదులు జమ్మూలో మరింత లోతుగా చొచ్చుకుపోయారనీ, వారు తమ ఉనికి కోసం తీవ్రంగా పని చేస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు. కాగా, సాధారణంగా జులైలో ప్రారంభమయ్యే అమర్‌నాథ్ యాత్రకు ఈ దాడులు భద్రతాపరమైన సవాళ్లను విసురుతాయని చెప్తున్నారు. అయితే, ప్రస్తుత పరిస్థితులు సుప్రీం కోర్టు నిర్దేశించిన సెప్టెంబర్ చివరి గడువులోగా జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలపై పునః పరిశీలనకు దారితీస్తాయో, లేదో వేచి చూడాల్సిందేనని విశ్లేషకులు చెప్తున్నారు. అలాగే, ఇది కొత్తగా ఏర్పడిన మోడీ ప్రభుత్వానికి, కాశ్మీర్‌కు చెందిన ముగ్గురు ఎంపీలకు ఒక పరీక్షగా మారిందని అంటున్నారు. రాబోయే పార్లమెంటు సమావేశాల్లో ఇది ప్రధానాంశంగా మారుతుందని వారు చెప్తున్నారు.

ఐఏఎస్సులేరు

దేశవ్యాప్తంగా 1,365 ఖాళీలు

- యూపీఎస్సీ నియామకాలపై కేంద్రం ఆంక్షలు
- సంఖ్య పెంచాలని సిఫారసు చేసినా సైలెంట్

టచ్ ఉన్న రిటైర్డ్ అధికారులతో ఖాళీల భర్తీ



న్యూఢిల్లీ : ఐఏఎస్ అధికారుల నియామకాలను పెంచాలని సిబ్బంది, శిక్షణ మంత్రిత్వ శాఖ తన ఆంతరంగిక నివేదికలో అభిప్రాయపడింది. ఐఏఎస్ అధికారుల నియామకాలను ఏడాదికి 180 నుంచి 210-220కి పెంచాలని సిఫారసు చేసింది. 'ఐఏఎస్ అధికారుల సంఖ్యను పెంచాల్సిన అవసరం చాలా కాలం నుండే ఉంటోంది. ప్రతి సంవత్సరం అదనంగా మరో 30-40 మందిని యూపీఎస్సీ నియమించాలని నివేదిక సిఫారసు చేసింది' అని పేరు చెప్పడానికి ఇష్టపడని ప్రభుత్వ అధికారి ఒకరు 'ది ప్రింట్' పోర్టల్‌కు తెలిపారు. సిబ్బంది-శిక్షణ మంత్రిత్వ శాఖ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపీఏ) సంయుక్తంగా ఈ నివేదికను రూపొందించాయి.

జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో ప్రభుత్వ శాఖల్లో భారీగా ఖాళీలు ఉన్నాయని ఆ అధికారి చెప్పారు. 2014 తర్వాత దేశంలో మరో వందకు పైగా జిల్లాలు ఏర్పడ్డాయి. అయితే అక్కడ సిబ్బంది కొరత ఉంది. ఈ నేపథ్యంలో ఆ ఖాళీలన్నీ భర్తీ చేసే వరకూ పది సంవత్సరాల పాటు ఏడాదికి 30 మంది కొత్త ఐఏఎస్ అధికారులను నియమించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని ప్రభుత్వాధికారి వివరించారు. ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా 1,365 ఐఏఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే ఏటా 180 మంది అధికారులను మాత్రమే యూపీఎస్సీ నియమించాలని ప్రభుత్వం 2012 నుంచి ఆంక్షలు విధించింది. ప్రతి ఏటా నియమించే ఐఏఎస్ అధికారుల సంఖ్యను పెంచే యోచన ఏదీ లేదని గత ప్రభుత్వంలో సిబ్బంది, శిక్షణ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రిగా పనిచేసిన జితేంద్ర సింగ్ 2023లో పార్లమెంటుకు తెలియజేశారు. అధికారుల నియామకాలు పెంచితే నాణ్యతలో రాజీ పడాల్సి వస్తుందని, అధికారుల వృత్తిపరమైన గమనంలో వక్రీకరణలకు దారితీస్తుందని ఆయన తెలిపారు. అయితే ఖాళీల సంఖ్య అధికంగా ఉన్నందున నియామకాలను చేపట్టే విషయంపై ప్రభుత్వం ఆలోచన చేయవచ్చునని ప్రభుత్వాధికారి చెప్పారు. వీటికి అదనంగా డిప్యూటీ సెక్రెటరీ, డైరెక్టర్, జాయింట్ సెక్రెటరీ స్థాయిలో లేటరల్ ఎంట్రీ ద్వారా నియామకాలు జరిపేందుకు రంగం సిద్ధమైందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇలాంటి 51 పోస్టుల భర్తీ కోసం త్వరలోనే ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

2018-2023 మధ్యకాలంలో అఖిల భారత సర్వీసుల్లో (ఏఐఎస్) ఖాళీల భర్తీకి ప్రయత్నాలు జరిగాయి. ఈ కాలంలో సివిల్ సర్వీసెస్ పరీక్షల ద్వారా జరిపిన నియామకాలు 812 నుంచి 1143కు పెరిగాయి. 2021లో 749 మంది అధికారులను మాత్రమే నియమించారు. ఇక ఐపీఎస్ అధికారుల విషయానికి వస్తే 2019లో 150 మందిని నియమించగా 2020 నుంచి ప్రతి ఏటా 200 మంది అధికారులను నియమించారు. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో కూడా అధికారుల నియామకాలు పెరిగాయి.

మళ్లీ వారే..

- మూడోసారి జాతీయ భద్రతా సలహాదారుగా అజిత్ దోవల్
- పీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీగా పీకే మిశ్రా కొనసాగింపు



న్యూఢిల్లీ : కేంద్రంలో మూడోసారి అధికారంలో వచ్చిన మోడీ ప్రభుత్వం తమ కోటరీని ఏర్పాటు చేసుకుంటోంది. ఇప్పటికే కేంద్ర క్యాబినెట్‌లో తమ వారిని భర్తీ చేసుకున్నది. అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, నడ్డాకు ప్రాధాన్యతనిస్తూ.. మోడీ మంత్రిత్వ శాఖలను కేటాయించారు. ఇపుడు అధికారగణం వైపు దృష్టి సారించారు. వారి నియామక గడువు పూర్తవటంతో.. పాతవాళ్లనే కొనసాగించాలని నిర్ణయించారు. జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ ధోవల్‌కు మూడోసారి బాధ్యతలు కట్టబెట్టారు. ప్రధాని సలహాదారులుగా అమిత్‌ఖరే, తరుణ్‌కపూర్‌లు కొనసాగనున్నారు. పీకే మిశ్రా ప్రధానికి ప్రిన్సిపల్ సెక్రెటరీగా కొనసాగనున్నారు. ఆయన పదేండ్ల నుంచి మోడీకి పీఎస్‌గా ఉన్నారు. అజిత్ ధోవల్, పీకే మిశ్రాల పునర్నియామకానికి కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది.

యడియూరప్పపై అరెస్టు వారెంట్ జారీ

పోక్సో చట్టం కింద నమోదైన కేసులో...

బెంగుళూరు : కర్నాటక మాజీ ముఖ్యమంత్రి బిఎస్ యడియూరప్ప కు వ్యతిరేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టు (పోక్సో కోర్టు) గురువారం సాయంత్రం నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. 2012 మార్చి 14న పోక్సో చట్టం కింద నమోదైన కేసులో ఈ అరెస్టు వారెంట్‌ను జారీ చేసింది. 2012 ఫిబ్రవరిలో సహాయం కోరి తన తల్లితో పాటు వచ్చిన 17 ఏండ్ల బాలికపై యడియూరప్ప లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కేసు నమోదయింది. అరెస్టు వారెంట్ జారీ కావడంతో ఈ కేసును విచారిస్తున్న సీఐడీ యడియూరప్ప ను అరెస్టు చేయడానికి సిద్ధంగా ఉంది. యడియూరప్ప కోసం సిఐడి బృందాలు గాలింపు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం యెడూరప్ప బీజేపీ పార్లమెంటరీ బోర్డు, కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యులుగా ఉన్నారు. యడియూరప్ప కార్యాలయం విడుదల చేసిన సమాచారం ప్రకారం ప్రస్తుతం ఆయన న్యూఢిల్లీలో ఉన్నారు. బాధితురాలు వేసిన రిట్ పిటీషన్‌ను విచారిస్తూ యడియూరప్ప ను ఇంకా ఎందుకు అరెస్టు చేయలేదని కర్నాటక హైకోర్టు ఇటీవల ప్రశ్నించింది. దీంతో ఈ నెల 12న విచారణకు హాజరు కావాలని యడియూరప్ప కు సీఐడీ సమన్లు జారీ చేసింది. దీనికి యెడూరప్ప స్పందిస్తూ ప్రస్తుతం తాను న్యూఢిల్లీలో ఉన్నానని, ఈ నెల 17న విచారణకు హాజరవుతానని సమాధానం ఇచ్చారు. దీంతో యెడూరప్పను అరెస్టు చేయడానికి వారెంట్ జారీ చేయాలని కోరుతూ సీఐడీ ఫస్ట్ ట్రాక్ కోర్టును ఆశ్రయించింది. దీనిని అంగీకరిస్తూ గురువారం సాయంత్రం యడియూరప్ప పై కోర్టు నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. కాగా, ముందుగా ఈ కేసులో బాధితురాలి తరుపున ఆమె తల్లి న్యాయపోరాటం ప్రారంభించింది. 2014 మార్చి 14న సదాశివనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ప్రకారం ఒక సహాయం కోసం యెడ్యూరప్ప ఇంటికి వెళ్లగా అక్కడ ఘటన జరిగింది. బాలికను గదిలోకి తీసుకెళ్లిన యడియూరప్ప తలుపులకు తాళం వేసి ఆమెపై వేధింపులకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురించి బయటకు వెల్లడించకుండా ఉండటానికి డబ్బును ఆశగా చూపినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, అనారోగ్య కారణాలతో ఆమె ఈ ఏడాది మేలో మృతి చెందడంతో ప్రస్తుత బాధితురాలి సోదరుడు ఈ న్యాయపోరాటాన్ని కొనసాగిస్తున్నారు. యడియూరప్ప అరెస్టు గురించి హైకోర్టులో రిట్ పిటీషన్ వేసింది కూడా అతనే. మరోవైపు తనపై ఈ కేసు రద్దు చేయాలని యెడ్యూరప్ప కూడా హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటీషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ రెండు పిటీషన్ల విచారణను శుక్రవారం హైకోర్టు చేపట్టనుంది. అలాగే ముందస్తు బెయిల్ కోరుతూ యడియూరప్ప హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని సమాచారం.


(ఫైల్)

సంపాదకీయం

ఇటలీలో జి7 దేశాల మల్లగుల్లాలు!

ఏడు ధనికదేశాల కూటమి(జి7) 50వ వార్షిక సమావేశం గురువారం నాడు ఇటలీలో ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ భేటీకి రికార్డు స్థాయిలో భారత్,బ్రెజిల్‌తో సహా పన్నెండు దేశాల నేతలను అతిథులుగా ఆహ్వానించటం ఒక విశేషం. రష్యా మీద ఆంక్షలను వెయ్యి నుంచి నాలుగువేల వరకు విస్తరించేందుకు. ఇప్పటికే స్తంభింపచేసిన 28 వేల కోట్ల డాలర్ల (280 బిలియన్ డాలర్లు) రష్యా ఆస్తుల మీద వచ్చే రాబడి నుంచి ఉక్రెయిన్‌కు 50 కోట్ల డాలర్ల సాయం అందించాలన్న అమెరికా ప్రతిపాదనలు,చైనా కట్టడి అనే నిరంతర అజెండా ప్రధానంగా ఈ సమావేశం ముందున్నాయి.తన మీద పడే భారాన్ని తప్పించుకొనే అమెరికా ఎత్తుగడ, ఎన్నికల్లో స్వలాభం పొందే జోబైడెన్ మంత్రాంగం ఉంది. ఉక్రెయిన్‌కు సాయంపై ఐరోపా సమాఖ్యలో ఏకాభిప్రాయం వస్తేనే అది వీలుపడుతుంది. అయితే అలాంటి హామీ ఇచ్చే పరిస్థితి లేదన్నది విశ్లేషకుల అంచనా.ఎన్ని ఆంక్షలు విధిస్తే అంతగా అన్నట్లు వాటి ప్రభావం రష్యామీద ఇప్పటివరకు పెద్దగా లేదు. ఈ కారణంగానే మరోసారి గట్టిగా ఊపి చూద్దాం అనే తెగింపుతో పశ్చిమదేశాలు ఉన్నాయి. అంతా మీరే చేస్తున్నారంటూ రష్యా ఆర్థికంగా, ఇతరంగా నిలదొక్కుకోవటానికి కారణం చైనా అని పశ్చిమదేశాలు చిందులు వేస్తున్నాయి. తాము ఇచ్చిన ఆయుధాలతో అన్నెంపున్నెం ఎరగని పిల్లలు, మహిళలను గాజాలో ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్ దుశ్చర్యలు దానికి కనిపించవు.



చైనా అందిస్తున్న యంత్రాలు, చిప్స్ వంటి వాటిని ఆయుధాల తయారీతో సహా వినియోగవస్తువుల తయారీకీ రష్యా వినియోగించవచ్చు. దీన్ని సహించలేక అనేక ఆరోపణలు చేస్తున్నాయి. అవసరానికి మించి అధిక ఉత్పత్తులు చేసి ప్రపంచ మార్కెట్లలో కుమ్మరిస్తున్నదనేది ఒకటి. ఆ సాకుతో చైనా విద్యుత్ వాహనాల దిగుమతులపై పన్ను మొత్తాన్ని 25 నుంచి 100శాతానికి పెంచిన అమెరికా అడుగుజాడల్లో ఐరోపా దేశాలు 38శాతం వరకు పెంచేందుకు నిర్ణయించి ఈ సమావేశానికి వచ్చాయి. అంటే రష్యా, చైనాలతో అమీ తుమీ తేల్చుకొనేందుకు సిద్ధపడుతున్నాయి. ఇల్లలకగానే పండగ కాదన్నట్లు అమెరికా ప్రతిపాదనల మీద ఏకాభిప్రాయం కుదురు తుందనే పరిస్థితి లేదు. రష్యా ఆస్తులు ఐరోపా దేశాల్లో ఉన్నాయి. 'మీరు మమ్మల్ని ఇబ్బందిపెడితే మిమ్మల్ని ఇరికించే అవకాశం మాకూ ఉంది వెనుకా ముందు ఆలోచించుకోండని' రష్యా హెచ్చరిం చింది. గతవారంలో జరిగిన ఐరోపా పార్లమెంటు ఎన్నికల్లో పచ్చిమితవాద శక్తుల బలం పెరుగుదల, దానితో ముడిపడిన సమస్యలను ఈ సమావేశం విస్మరించే అవకాశం లేదు.

గాజాలో ఇజ్రాయిల్ మారణకాండ 250 రోజులుగా కొనసాగుతున్నది, హమాస్ తీవ్రవాదులను పట్టుకొనే పేరుతో ఇజ్రాయిల్ జరుపుతున్న ఈదారుణకాండలో ఇంతవరకు ఎంతమందిని పట్టుకున్నదీ చెప్పలేని స్థితి. మరోవైపు ప్రపంచ వ్యాపితంగా దానికి మద్దతిస్తున్న పశ్చిమదేశాల మీద ఒత్తిడి తీవ్రమవుతున్నది. ఉక్రెయిన్‌లో రష్యా సైనిక చర్య 840వ రోజులో ప్రవేశించింది.రోజు రోజుకూ జెలెన్‌స్కీ సేనలు బలహీనపడటం తప్ప జరుగుతున్నదేమీ లేదు. పశ్చిమ దేశాలు అందించిన ఆధునిక ఆయుధాలు రష్యాను ఇప్పటివరకు ఒక్క అడుగు కూడా వెనక్కునెట్టలేకపోయాయి. తమ మీద జరుపుతున్న వాణిజ్యపోరును పశ్చిమదేశాలు ఎంతకాలం, ఎలా కొనసాగిస్తాయో తగ్గేదేలే మేమూ చూస్తామన్నట్లుగా చైనా ఉంది.తన ఎత్తుగడలను తానూ అమలు చేస్తున్నది.పశ్చిమ దేశాలు కాటువేసేందుకు అవకాశాలు దొరక్క ప్రస్తుతం బుసలు కొట్టే స్థితిలోనే ఉన్నప్పటికీ వాటి కోరల్లో దాగిన విషాన్ని విస్మరించకూడదు.

వివిధ ప్రపంచ పరిణామాల పట్ల డోలాయమానస్థితి, విబేధాలు, అసాధారణ సవాళ్ల నడుమ ఈ కూటమి ఇటలీ మధనంలో ఏమి వెలువడుతుంది అన్నదానిపై ఆసక్తి నెలకొన్నది. తమ కంట్లో నలుసుల్లా, కొరుకుడు పడని ముక్కల్లా ఉన్న చైనా, రష్యా, ఇరాన్ వంటి దేశాలను ఎలా కట్టడి చేయాలి? ప్రపంచాధిపత్యాన్ని ఎలా నిలుపుకోవాలి? కానసాగించాలనే యావతో ఉన్న జి7కు ఆత్రం తప్ప ఎలా ముందుకు పోవాలో తెలియని స్థితి గత జపాన్ సమావేశాల్లో వెల్లడైంది. గాజాలో జరుగుతున్న మారణకాండను నిలిపేసేందుకు ఏ మాత్రం ముందుకు రాని ఈ గుంపు తమ కారణంగానే తలెత్తిన ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరిం చేందుకు చొరవ చూపకపోగా మరింత ఆజ్యం పోసి జనాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నది. కాలిగోళ్లపుడే కాపురం చేసేదీ లేనిదీ తెలుస్తుందన్నట్లుగా ఈ సమావేశాలకు వస్తూ కొన్ని దేశాలు తీసుకున్న నిర్ణయాలు ఘర్షణ, ఉద్రిక్తతలను పెంచేవేవిగా ఉన్నందున ఇటలీ భేటీలో జరిగేదేమిటో ఊహించుకోవచ్చు.

తమ కంట్లో నలుసుల్లా,కొరుకుడు పడని ముక్కల్లా ఉన్న చైనా, రష్యా, ఇరాన్ వంటి దేశాలను ఎలా కట్టడి చేయాలి? ప్రపంచాధిపత్యాన్ని ఎలా నిలుపుకోవాలి? కానసాగించాలనే యావతో ఉన్న జి7కు ఆత్రం తప్ప ఎలా ముందుకు పోవాలో తెలియని స్థితి గత జపాన్ సమావేశాల్లో వెల్లడైంది. గాజాలో జరుగుతున్న మారణకాండను నిలిపేసేందుకు ఏ మాత్రం ముందుకు రాని ఈ గుంపు తమ కారణంగానే తలెత్తిన ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు చొరవ చూపకపోగా మరింత ఆజ్యం పోసి జనాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నది.

ఈ నిరుద్యోగానికి పరిష్కారం ఎలా?




ప్రభాత్ పట్నాయక్

ఆర్థిక శాస్త్రంలో డిమాండుకు కొరత ఉన్న వ్యవస్థకి, సప్లయ్‌కి కొరత ఉన్న వ్యవస్థకి (పెట్టుబడులకు, ముడి సరుకులకు, కార్మికులకు, టెక్నాలజీకి కొరత ఉండడాన్ని సప్లయ్‌కి కొరత ఉన్నట్టు పరిగణిస్తాం) మధ్య తేడాను చూస్తారు. మొదటి తరహా వ్యవస్థలో స్థూల డిమాండు పెరిగితే అందుకు అనుగుణంగా సరుకుల ఉత్పత్తిని పెంచుకోవచ్చు. డిమాండుకు తగినట్టు సరుకుల సరఫరా లేకపోతే వాటి ధరలు పెరుగుతాయి. ఉత్పత్తిని పెంచడం ద్వారా అటువంటి ధరల పెరుగుదలను నివారించవచ్చు. అదే రెండో తరహా వ్యవస్థలో (సప్లయ్‌కి కొరత ఉన్న వ్యవస్థలో) స్థూల డిమాండు గనుక పెరిగితే అది ఉత్పత్తి పెరుగుదలకు దారితీయదు. అప్పటికే ఆ వ్యవస్థలో ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించివున్నందున (అప్పుడు అదనంగా ఉత్పత్తి చేయడం సాధ్యం కాదు) గాని, లేదా ఏదైనా కీలకమైన ముడి సరుకులకో, పరికరాలకో, కార్మికులకో కొరత ఏర్పడినందువలన గాని మార్కెట్‌కు అవసరమైనంత మేరకు ఉత్పత్తి చేయలేని పరిస్థితి ఉంటుంది. అటువంటి స్థితిలో స్థూల డిమాండు మరింత పెరిగితే అది ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. యుద్ధ సమయాల్లో మినహాయిస్తే సాధారణంగా పెట్టుబడిదారీ వ్యవస్థ ఎప్పుడూ డిమాండుకు కొరత ఉన్న వ్యవస్థగానే ఉంటుంది. అదే సోషలిస్టు వ్యవస్థలో (గతంలోని సోవియట్ యూనియన్ లేదా తూర్పు యూరప్ దేశాల వ్యవస్థలలో) సప్లయ్‌కి కొరత ఉండేది. డిమాండుకు కొరత ఉన్న వ్యవస్థలో గనుక స్థూల డిమాండ్ పెరిగితే దానితోబాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి.

ప్రస్తుతం మన దేశంలో నిరుద్యోగం ఒక తీవ్ర సామాజిక సమస్యగా ఉంది. దాని తీవ్రత తాజా ఎన్నికలలో బీజేపీ బలం తగ్గడానికి దోహదం చేసింది. అందుచేత నిరుద్యోగ సమస్యను అత్యవసరంగా పరిష్కరించవలసిన అగత్యం ముందుకొచ్చింది. ఈ పరిస్థితిలో ఆర్థిక వ్యవస్థల్లో పైన తెలిపిన తేడాను దృష్టిలో ఉంచుకోవడం అవసరం.

మన దేశంలో ప్రభుత్వ సర్వీసులతో సహా సేవా రంగంలో చాలా గణనీయంగా ఉపాధి కల్పనను కావాలనే తగ్గించారు. ఇక్కడ పెట్టుబడికి కొరత అన్న సమస్య ఏదీ లేదు. అదే విధంగా మనకి ఇప్పుడు పెట్టుబడికి గాని, కార్మికులకు గాని, ఏ ఇతర ఇన్‌పుట్‌లకు గాని కొరత లేదు. ఆహారధాన్యాల నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. పేదలకు ఆహార ధాన్యాలను ఉచితంగా పంపిణీ చేయడాన్ని తొలుత ఎకసెక్కం చేసిన మోడీ ప్రభుత్వం కూడా ఉన్న ఆహార ధాన్యాల నిల్వలను కుటుంబానికి 5 కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేసి ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ప్రయ త్నించింది. ఇప్పుడు తగ్గిన నిల్వలను పెంచుకోడానికి అంతర్జాతీయ మార్కెట్ నుండి గోధుమలను కొనుగోలు చేయ డానికి మన దేశం ప్రయత్నిస్తోంది. దీనికి కారణం ఉన్న నిల్వలను సక్రమంగా వినియోగించలేక దుర్వినియోగం చేయడమే. అంతేకాని దేశంలో ఇప్పుడు ఆహారధాన్యాల కొరత ఏమీ లేదు. అందుచేత ప్రస్తుతం మన దేశంలో నెలకొన్న తీవ్ర నిరుద్యోగానికి కారణం డిమాండుకు తీవ్ర కొరత ఉన్న వ్యవస్థే. దీనిని పరిష్కరించడానికి వెంటనే స్థూల డిమాండును పెంచాలి. దానికోసం ప్రభుత్వ వ్యయాన్ని బాగా పెంచాలి.

ఇప్పుడు చాలా ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీలుగా భర్తీ కాకుండా పడివున్నాయి. విద్యా రంగంలో సిబ్బంది కొరత తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. దాని ఫలితంగా విద్యా ప్రమాణాలు దెబ్బ తినిపోతున్నాయి. చివరికి సైన్యంలో సైతం మామూలు స్థాయిలో ఖాళీలను నింపడం లేదు. దానికి తోడు అగ్నివీర్ వంటి పథకాలను ప్రవేశపెట్టడం నిరుద్యోగ తీవ్రతను పెంచింది. ఉపాధి కల్పనలో తక్కిన యజమానులకన్నా ముందుండి దారి చూపవలసిన ప్రభుత్వం నిరుద్యోగాన్ని పెంచడంలో ముందుంది. ద్రవ్యపరంగా నియంత్రణలు అమలులో ఉండడమే దీనికి కారణం. ఈ అంశాన్ని మరింత లోతుగా పరిశీలిద్దాం.



ఇంతకు ముందు మనం డిమాండుకు కొరత ఉన్న ఆర్థిక వ్యవస్థకి, సప్లయ్‌కి కొరత ఉన్న ఆర్థిక వ్యవస్థకి మధ్య ఉండే తేడాను గురించి చర్చించాం. ఏదైనా ఒక సర్వ స్వతంత్ర దేశపు ఆర్థిక వ్యవస్థలో సప్లయ్‌కి సంబంధించిన కొరత ఉండే అవకాశం లేదు. ఇక ఒక సర్వ స్వతంత్ర దేశం మీద ద్రవ్యపరమైన నియంత్రణలు మామూలుగా ఉండే అవకాశం లేదు. ఏవైనా ద్రవ్య పరమైన నియంత్రణలు ఉంటే అవి అంతర్జాతీయ పెట్టుబడి మన ప్రభుత్వం మీద విధించినవై వుండాలి, అందుకు ఆ అంతర్జాతీయ పెట్టుబడికి స్థానిక మిత్రులైన దేశీయ కార్పొరేట్-ద్రవ్య పెట్టుబడి ముఠా తోడై వుండాలి. అంటే ద్రవ్య నియంత్రణతో మన దేశం తన స్వయం నిర్ణయాధికారాన్ని కొంతమేరకు కోల్పోయినట్టు భావించాలి. అంతే తప్ప స్వతహాగా మన ప్రభుత్వం ఏవో పరిమితుల మధ్య ఉన్నట్టు కాదు.

నిజానికి డిమాండుకు కొరత ఉన్న వ్యవస్థలో ఆ డిమాండును పెంచడానికి అవసరమైన అదనపు వ్యయాన్ని ప్రభుత్వం చేయాలంటే అందుకు ఆటంకం ఏమీ ఉండదు. 90 సంవత్సరాల క్రితమే కాలెక్కీ-కీన్స్ సైద్ధాంతికంగా అర్థశాస్త్రంలో తెచ్చిన పెనుమార్పులు

ఇప్పుడు చాలా ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీలుగా భర్తీ కాకుండా పడివున్నాయి. విద్యా రంగంలో సిబ్బంది కొరత తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. దాని ఫలితంగా విద్యా ప్రమాణాలు దెబ్బ తినిపోతున్నాయి. చివరికి సైన్యంలో సైతం మామూలు స్థాయిలో ఖాళీలను నింపడం లేదు. దానికి తోడు అగ్నివీర్ వంటి పథకాలను ప్రవేశపెట్టడం నిరుద్యోగ తీవ్రతను పెంచింది. ఉపాధి కల్పనలో తక్కిన యజమానులకన్నా ముందుండి దారి చూపవలసిన ప్రభుత్వం నిరుద్యోగాన్ని పెంచడంలో ముందుంది. ద్రవ్యపరంగా నియంత్రణలు అమలులో ఉండడమే దీనికి కారణం.

ఆటంకాలు వుంటాయనే వాదాన్ని తిప్పికొట్టాయి. అప్పుడు తిరస్కరించబడ్డ వాదనలనే ఇప్పుడు మళ్ళీ ముందుకు తీసుకొస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వ వ్యయం మీద పరిమితులు బడా కార్పొరేట్లు విధించినవే తప్ప స్వతహాగా ఉన్నవి కానే కావు. అందుచేత అంతర్జాతీయ, దేశీయ బడా పెట్టుబడి దురాశా పూరితమైన నిబంధనల ఉచ్చు నుండి బయటపడి, నిరుద్యోగాన్ని పరిష్కరించేందుకు తన దృఢ నిశ్చయాన్ని ప్రభుత్వం ప్రదర్శించాల్సి వుంది.

ప్రభుత్వం తన వ్యయాన్ని పెంచడానికి ద్రవ్యలోటును పెంచి ఖర్చు చేయాల్సి వుంటుంది. దానివలన ఉపాధి కల్పన పెరుగుతుంది. ఇలా ద్రవ్యలోటు పెరిగితే దాని ఫలితంగా ప్రయివేటు పెట్టుబడులు తగ్గుతాయన్న వాదనలు పస లేనివి. నిజానికి ద్రవ్యలోటు పెరిగితే దానివలన కలిగే నష్టం ఏమిటంటే అది సంపదలో అసమానతలు పెరగడానికి దారితీస్తుంది. ఇదెలాగ జరుగుతుందో చూద్దాం. ఉదాహరణకు ప్రభుత్వం రూ.100 మేరకు తన వ్యయాన్ని పెంచిందనుకుందాం. అందుకోసం అప్పు చేసింది అనుకుందాం (ద్రవ్య లోటు పెంచడం అంటే అప్పు చేసి ఖర్చు చేయడమనే అర్థం). అలా ఖర్చు చేసిన రూ.100 చివరికి పెట్టుబడిదారుల దగ్గరకే చేరుతాయి (ముందు కార్మికులకు అందినా, ఆ సొమ్మును వారు ఖర్చు చేస్తారు గనుక అంతిమంగా ఆ సొమ్ము పెట్టుబడిదారుల దగ్గరకే చేరుతుంది). ప్రభుత్వం ఆ పెట్టుబడిదారుల నుండే అప్పు తీసుకుంటుంది.

దీనిని ఇంకా బాగా అర్థం చేసుకోవాలంటే మనం ఆర్థిక వ్యవస్థని మూడు విడివిడి భాగాలుగా విడదీసి చూడాలి. మొదటిది: ప్రభుత్వం. రెండోది:శ్రామిక ప్రజలు, మూడోది : పెట్టుబడిదారులు. ఈ మూడు భాగాల దగ్గర ఏర్పడే లోటు అంతా కలిపితే ఎప్పుడూ సున్నాగానే ఉంటుంది (లోటు అంటే అప్పు చేసి ఖర్చు చేయడం. ఒకడు అప్పు చేయాలంటే దానిని ఇచ్చేవాడు మరొకడు ఉండాలి కదా. ఇద్దరిదీ కలిపితే నికర లోటు సున్నా అవుతుంది కదా). శ్రామిక ప్రజలు ఎంత సంపాదిస్తారో అంతా ఖర్చు చేసేస్తారు. అందుచేత వారివద్ద లోటు ఏమీ ఉండదు (వాళ్లలో వాళ్లు ఒకరికొకరు అప్పులిచ్చుకోవాలే తప్ప పెట్టుబడిదారులు పేదలకు అప్పులివ్వరు). అందుచేత ప్రభుత్వం అప్పు చేసి ఖర్చు చేయాలంటే అంతిమంగా అది పెట్టుబడిదారుల నుండే మిగులు నుండే చేయాలి. ప్రభుత్వం బ్యాంకుల నుండి మొదట రూ.100 అప్పు తెచ్చి ఖర్చు చేస్తుంది. ఆ ఖర్చు అంతిమంగా పెట్టుబడిదారుల దగ్గరకు చేరుతుంది. అప్పుడు ఆ పెట్టుబడిదారుల నుండి ప్రభుత్వం రూ.100 అప్పు తెచ్చి బ్యాంకుల అప్పు తీరుస్తుంది. ఈ క్రమంలో పెట్టుబడిదారుల దగ్గర రూ.100 మిగులు పోగుబడుతుంది. దీనివలన పెట్టుబడిదారులు అదనంగా కష్టపడేదేమీ లేదు సరికదా, వారికి మిగులు చేరుతుంది. ప్రభుత్వం చేసే అదనపు వ్యయం వలన ఈ పెట్టుబడిదారుల దగ్గర అమ్ముడుపోకుండా మిగిలిపోయిన సరుకులు చెల్లుబాటు అవుతాయి. దానితోబాటు అదనంగా సంపద పోగు బడుతుంది. ఇది సంపద అసమానతలకు దారి తీస్తుంది. ఈ విధంగా సంపదలో అసమానతలు పెరిగిపోకుండా ఉండాలంటే, పెట్టుబడిదారుల దగ్గర పోగుబడిన అదనపు సంపదను పన్ను రూపంలో ప్రభుత్వం తిరిగి తీసుకోవాలి. అలా తీసుకున్నందువలన పెట్టుబడిదారులకు అంతవరకూ ఉన్న సంపద ఏమీ తగ్గిపోదు. కేవలం అదనంగా పోగుబడినది మాత్రమే పన్ను రూపంలో వెనక్కి పోతుంది.

అంటే ప్రభుత్వ వ్యయాన్ని పెంచి నిరుద్యోగాన్ని తగ్గించడం ద్వారా అంతరకూ పెట్టుబడిదారుల దగ్గర పోగుబడిన సంపద ఏమీ తగ్గిపోదు. అందుచేత అంతర్జాతీయ, దేశీయ బడా కార్పొరేట్లు ఎటువంటి ఆటంకాలు కల్పించినా, వాటన్నింటినీ అధిగమించే ధైర్యాన్ని ప్రభుత్వం ప్రదర్శించగలిగితే నిరుద్యోగాన్ని పరిష్కరించవచ్చు. ముందు ప్రభుత్వ విద్యాలయాల్లో, యూనివర్సిటీల్లో ఉన్న బోధన, బోధనేతర పోస్టులనన్నింటినీ భర్తీ చేయాలి. అదే విధంగా వైద్య రంగంలో కూడా భర్తీ చేయాలి. ఆ తర్వాత ఈ రంగాల్లో అదనపు పోస్టులను మంజూరు చేయాలి. అప్పుడు పతనమౌతున్న మన విద్యా, వైద్య ప్రమాణాలను నిలబెట్టగలుగుతాం. వాటితోబాటు ఇప్పుడు ఉనికిలో ఉన్న ఉపాధి హామీ పథకాన్ని విస్తరించాలి. దానికి విధించిన పరిమితులను ఎత్తివేయాలి. గ్రామాల్లో ఎంతమంది పని కావాలని అడిగితే అంతమందికీ పనులు కల్పించాలి. ఆ పథకాన్ని పట్టణ ప్రాంతాలకూ విస్తరించాలి. ఆ పథకం కింద చెల్లించే వేతనాలను కూడా సహేతుకంగా, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెంచాలి.

ఈ మూడూ చేస్తే దాని ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక రకాల వినిమయ సరుకులకు డిమాండ్ బాగా పెరుగుతుంది. ఇప్పుడున్న ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తి స్థాయి మేరకు వినియోగించగలుగుతాం. అంతేకాక అదనపు సామర్థ్యాన్ని కూడా నెలకొల్పవలసిన పరిస్థితి వస్తుంది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో అభి వృద్ధికి ఇది దారి తీస్తుంది (ఆ పరిశ్రమలకు అవసరమైన రుణ సదుపాయాలను కూడా కల్పించాల్సి వుంటుంది). అంటే, ప్రభుత్వం తన వ్యయం ద్వారా కల్పించే అదనపు ఉపాధి వలన ప్రయివేటు రంగంలో కూడా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

ప్రభుత్వం చేసే ఈ అదనపు వ్యయానికి కావలసిన ఆర్థిక వనరులను సమీకరించడానికి పెట్టుబడిదారుల మీద, తక్కిన బడా సంపన్నుల మీద అదనపు పన్నులు విధించాలి. వారి ఆదాయాలమీద, వారి దగ్గర వున్న సంపద మీద పన్నులు విధించాలి. ముఖ్యంగా వారి స్థిరాస్తుల మీద, వారి నగదు నిల్వల మీద (షేర్ల రూపంలో ఉన్నవాటితో

ఇప్పుడున్న పరిస్థితుల్లో నిరుద్యోగాన్ని పరిష్కరించడానికి ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం ఒక్కటే తక్షణ పరిష్కారం. ఆ అదనపు ప్రభుత్వ వ్యయానికి కావలసిన వనరులను సమీకరించడానికి సంపద పన్ను, వారసత్వ పన్ను విధించడమే సముచిత మార్గం. దీనివలన ఒకే దెబ్బకు అనేక పిట్టల్ని కొట్టవచ్చు. ఒకటి: ఉద్యోగాలు పెరుగుతాయి, రెండు: సంపద అసమానతలు పెరిగిపోకుండా అదుపులో ఉంటాయి. తద్వారా ప్రజాస్వామ్యం బలపడుతుంది, మూడు: విద్యా, వైద్య ప్రమాణాలు మన దేశంలో మెరుగుపడతాయి.

సహా) అదనపు పన్నులు వేయాలి. దానివలన వారు పెట్టే పెట్టుబడులు ఏమీ తగ్గిపోవు. సంపదమీద పన్ను సమర్ధ వంతంగా వసూలు కావాలంటే వారసత్వ పన్ను కూడా అదే సమయంలో విధించాలి. మన దేశంలో ఇప్పుడు సంపద పన్ను కాని, వారసత్వ పన్ను కాని అమలు చేయడంలేదు. నయా ఉదారవాద శకంలో కొద్దిమంది దగ్గర విపరీతంగా సంపద పోగుబడుతున్నప్పుడు, అసమానతలు విపరీతంగా పెరుగుతున్నప్పుడు ఈ మాదిరి పన్నులు అసలే లేక పోవడం దిగ్భ్రాంతికరం. అదే సమయంలో ఈ రెండు రకాల పన్నులనూ ఇప్పటి నుంచైనా అమలు చేస్తే ప్రభుత్వం దగ్గర పెద్ద మోతాదులో ఆర్థిక వనరులు సమకూరే అవకాశాలు మెండుగా ఉన్నాయని స్పష్టంగా కనపడుతోంది.

ఇప్పుడున్న పరిస్థితుల్లో నిరుద్యోగాన్ని పరిష్కరించడానికి ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం ఒక్కటే తక్షణ పరిష్కారం. ఆ అదనపు ప్రభుత్వ వ్యయానికి కావలసిన వనరులను సమీకరించడానికి సంపద పన్ను, వారసత్వ పన్ను విధించడమే సముచిత మార్గం. దీనివలన ఒకే దెబ్బకు అనేక పిట్టల్ని కొట్టవచ్చు. ఒకటి: ఉద్యోగాలు పెరుగు తాయి, రెండు: సంపద అసమానతలు పెరిగిపోకుండా అదుపులో ఉంటాయి. తద్వారా ప్రజాస్వామ్యం బలపడుతుంది, మూడు: విద్యా, వైద్య ప్రమాణాలు మన దేశంలో మెరుగుపడతాయి.

(స్వేచ్ఛానుసరణ)

న్యాయం అన్యాయం
పాలయినప్పుడు
రచ్చకెక్కి ఏడ్చే ఏడుపు పాట
ఎవరు కాదంటారు

చెట్టు మీది పిట్ట గూడు
చెదిరిపోయే భయమవుతుంది
గూటిలోని గువ్వ పిల్ల గుండె
పగులుతుంది

పిడుగు లాంటి వార్త
దేశాన్ని వాణికిస్తుంది
రెపరెపలాడే
జాతి జెండా కోసం
చావు నోట్లో తలపెట్టి వీరుడు
మరణిస్తాడు
అగ్ని వర్షం చల్లారి బూడిద
మిగులుతుంది

ఒక్క గుండె మనుషులు

గాయం మానిపోయినా
మరక మాత్రం గుండెల్లో
పొడుస్తూనే ఉంటుంది
ఎన్ని ఓదార్పులు
ఒక్కటై వచ్చినా
వాలికి పోయిన
కలలు చేతికందవు

దేవదూత లాంటి
రాయబారి అడుగులు
ముందుకు కదులుతాయి
ఒక కంటి దీపం ఆరిపోతుంది
ఒక ఇల్లు అనాధగా
మిగిలిపోతుంది
నగరం శిధిలమయ్యి
శ్మశానమవుతుంది
అప్పుడు కుదురుతుంది సంధి


ఫిరంగి వెంటబెట్టుకొని అస్త్ర
శస్త్రాలు ధరించి
నీ బలం నిరూపించుకోవడానికి
యుద్ధ భేరి మోగిస్తావు గానీ
నెత్తురు చప్పరించు రాక్షస గీతం
ఏ హృదయం మెచ్చుకుంటుంది
కంట్లో పొడిచి కనుగుడ్లు ఐదు
వేళ్ళతో పెకిలించే
ఉన్మాద రచనకు
అభిమానులు ఉంటారా

కళ్ళముందు పేగు బంధాలు
మొగ్గలోనే రాలుతుంటే
నిలబడిన చోటే సమాధి చేసే
వేయికాళ్ళ విధ్వంసానికి
ఒక్క గుండె మనుషులు
ఎలా స్వాగతం పలుకుతారు

కాళ్ళు నరికి పరుగులు
ఎత్తుకు పోయి
చేతులు విరిచి మెతుకు కలలు
మాయంజేసి భూమి మీది
స్వర్గం నరకమవుతుంటే
యుద్ధం ఎవరికి నచ్చుతుంది.

- గజ్జెల రామకృష్ణ
8977412795

నరేంద్రమోడీకి పరమాత్ముడు రాసిన లేఖ!



డాక్టర్ దేవరాజు మహారాజు

తనకు తన తల్లితో బయలాజికల్‌గా సంబంధం లేదని, లాజిక్ లేకుండా తనను ఆ పరమాత్ముడే నేరుగా ఈ భూమి మీదికి పంపాడనీ భారతదేశ ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించుకున్న నేపథ్యంలో - ప్రముఖ జర్నలిస్ట్ రవీష్ కుమార్ ప్రెసెంటేషన్‌కు అనుసరణగా తెలుగు పాఠకుల కోసం 'నరేంద్ర మోడీకి పరమాత్ముడు రాసిన లేఖ'-ను పొందుపరుస్తున్నాను.

DEAR NARENDRA,

THIS IS ME, GOD, THE PARAMATMA WHO YOU CLAIMED HAD SENT YOU - అంటూ ఇంగ్లీషులో ప్రారంభమైన ఉత్తరంలోని ప్రారంభ వాక్యాల సారాంశం ఇలా ఉంటుంది-

ప్రియమైన నరేంద్ర

నేను భగవంతుణ్ణి! నిన్ను ఎవరు భూమి మీదికి నేరుగా పంపించాడని చెప్పుకుని తిరుగుతున్నావో ఆ నేను - పరమాత్మను!!

అసలు నీ మీడియానే నాకు నచ్చలేదు-నేను ఎవరికీ అధికారిక పత్రం ఇవ్వను.వాళ్లు మూల మూలాలకు వెళ్లి నేను పంపించానని చెప్పుకుని తిరగడానికి ఈ పరమాత్ముడు అలా ఎవ్వరినీ పంపించడు. పరమాత్ముడి స్థాయి వేరే ఉంటుంది నరేంద్రా? నువ్వు అర్థం చేసుకోలేవు. ఆయన మృత్యులోకానికి సుదూరంలో ఉంటాడు. ఆయన చదివేవి కేవలం శ్లోకాలు. నీలాగా జనానికి శోకాన్ని పంచడు. మోసాలు చేయడు

ప్యారే నరేంద్ర! ఆగేకి బాత్ హిందీమె కహనా చాహతా హూ- హిందీలో ఎందుకంటే నీకు చదువు లేదని ఇంగ్లీష రాదని నాకు తెలుసుకదా? నేను నిన్ను నేరుగా భూమి మీదికి పంపలేదు. అన్ని జీవుల్లాగే నువ్వూ పుట్టావు. కానీ మనిషిగా పుట్టిన విషయం మరిచిపొయ్యావు. నువ్వు నా పేరుని వాడుకుని నాకు ద్రోహం చేశావు. నన్ను అప్రతిష్టపాలు చేశావు.

జంబూద్వీపానికి ఒక నియమం ఉంది. ఇక్కడికి వచ్చిన వారు వెళ్లిపోక తప్పదు. కుర్చీలు కూడా మారుతూ ఉంటాయి. కుర్చీలో కూర్చునే నియమాలూ, పద్ధతులు కూడా మారుతూ ఉంటాయి. ప్రపంచంలోని అన్ని శక్తులూ నాలో నిబిడీకృతమయ్యే ఉన్నాయి. కానీ, వేరు వేరు భూభాగాల్లోని మానవులు వారి వారి శక్తులను సంకలన పరుచుకుని, రాజ్యాంగ మనేది రూపొందించుకున్నారు. దాన్ని మించిన శక్తి వారికి మరొకటి లేదు. ఒకవేళ భగవంతుడే అంటే నేనే - భూమికి దిగి వచ్చినా అక్కడి ప్రజాస్వామ్య విలువల్ని కాపాడుతూ రాజ్యాంగబద్ధంగా పనిచేయాల్సిందే! ఎందుకంటే, అక్కడ రాజ్యాంగమే ప్రధాన అంగం. అదే విధి, విధానం! ప్రజాస్వామ్య దేశాలలో దేవుడూ, విధి వంటివి ముఖ్యం కాదు.రాజ్యాంగమే ముఖ్యం! విధి విధానాలన్నీ రాజ్యాంగబద్ధంగా నడవాల్సిందే. వారి పరమాత్మ ఎవరన్నది ఈ ఎన్నికల్లో దేశ ప్రజలు ఎలుగెత్తిచెప్పారు. రాజ్యాంగమే వారి పరమాత్మ, దాని ఆత్మే వారి నాగరికత!

నాకు కన్యాకుమారి చాలా ఇష్టం! కానీ, నువ్వు కాశీలో ఉండాల్సిన సమయంలో కాశీలో లేవు. భారత దేశంలోని అసంఖ్యాక ప్రజలు వారి వారి ఇల్లూ ముంగిలి, సంసారాలు వదిలేసి కాశీకి వచ్చారు. కానీ, నువ్వేం చేశావ్? కాశీలో లేకుండా కన్యాకుమారికి వెళ్ళిపోయావు.కాశీ ప్రజలు నీకు ఎందుకు తక్కువ ఓట్లిచ్చారో ఆలోచించావా? ఈ పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక వేషధారణలో తిరగొచ్చు. కానీ, ఆ కాశీ విశ్వేశ్వరుడి ఆదేశం ఎప్పుడైనా పాటించావా? విశ్వాస పాత్రులైన వారు మరి, ఆదేశాలు తప్పక పాటించాలి కదా? అది అందరి కర్తవ్యం. ఇతర పార్టీలను చీల్చగూడదు. వారి ఇండ్లు కూల్చగూడదు. ప్రతిపక్ష



నాయకులను జైల్లో వేయగూడదు. భిన్నమైన ఆలోచనా ధోరణి గల వారిని చంపించ గూడదు - అని కదా ఆ దేవుడి ఆదేశం? పాటించావా మరీ? ఆ... - ఒకవేళ నిన్ను పాలించమని ప్రజలు నీకు ఆత్యధికంగా సీట్లిస్తే వెళ్లు-హాయిగా పరిపాలన చెయ్. ప్రజా సంక్షేమం చూడు - అంతే!!

ఆ స్వామి, ఆ విశ్వేశ్వరుడు మూడు లోకాలు పాలించడం లేదా? ఒక లోకానికి మరో లోకానికీ మధ్య ద్వేషం పెంచుతున్నాడా? కులమతాలను, లింగ భేదాలకూ అతీతంగా ఆ భగవంతుడు అందరినీ సమంగా ప్రేమించడం నువ్వు చూడలేదా? ఏం నీకు కండ్లు మూసుకుపొయ్యాయా? ఎవరి పట్లా కక్ష చూపడుకదా? ఏవైనా పొరపాట్లు జరిగితే అవి మానవ మాత్రుల అహంకారం వల్ల జరిగేవే, దేవుడి వల్ల కాదు- దేవుడన్న వాడికి మయావ్యామోహాలు ఉండవు. దేవుడి పుత్రుణ్ణని చెప్పుకునే నువ్వు ఆ మాయామోహాలు దాటుకుని ఎందుకు రాలేదూ? తుచ్ఛ మానవుడిలా ప్రవర్తిస్తూ అందరి కన్నా ఉన్నతమైన వాడిననే భ్రమలో బతుకుతున్నావు.

ఘోరంగా విఫలమై ఓడిపోయినా, నైతిక బాధ్యత వహిస్తున్నావా? లేదే? ఇంకా ఎందుకు విర్రవీగుతున్నావ్? ఇంకా నీకు అధికారం మీద, కుర్చీ మీద వ్యామోహమే పోలేదు. నువ్వు దేవుడి పుత్రుణ్ణని ఎలా ప్రకటించుకున్నావ్? కొంచెమైనా సిగ్గుపడాలి కదా? నిజాయితీ, నిబద్ధత గల సామాన్య పౌరులు దేశంలో ఎంతోమంది ఉన్నారు. నీతి, నిజాయితీల విషయంలో ఎంతటి అధమస్థాయిలో ఉన్నావో ఇకనైనా నువ్వు ఆలోచించుకో.

చెప్పు, నరేంద్రా! చెప్పు - నువ్వు కన్యాకుమారి వెళ్లావు. ఆధ్యాత్మికతకు ఉండే మహోన్నతమైన స్థానాన్ని, హుందాతనాన్ని నువ్వు నవ్వుల పాలు చేశావ్. గేలి చేశావ్. చులకన చేశావ్. పరమాత్ములమైన మేము ఇలాంటి తప్పిదాలు చేయము. సత్య మార్గాన్ని, న్యాయ మార్గాన్ని అనుసరించు. న్యాయాన్ని అభినయంతో జతపరచకు నరేంద్రా. అది ఘోరమైన తప్పిదం. అవి రెండూ వేరు వేరు. అభినయమంటే నటన- నటనతో ప్రజలకు న్యాయాన్ని అందించలేవు. నువ్వే కాదు, నీ గ్రూపులో చేరే కుట్రదారులు, వెన్నుపోటుదారులు ఎవరూ ప్రజలకు నటనతో న్యాయాన్ని అందించలేరు.

ఇంతెందుకూ? కాశీలో గంగను చూసినప్పుడల్లా గొప్పభావుకుడివై పోయినట్లు నటిస్తావ్. గొప్ప శ్రద్ధా భక్తులున్నట్లు - నువ్వు ఏర్పాటు చేసుకున్న ఇంటర్వ్యూలలో చెపుతుంటావు. ఎప్పుడైనా ఆ గంగమ్మ తల్లి రోదనను వినిపించుకున్నావా? గంగానదిని ప్రక్షాళన చేస్తున్నామని, శుద్ధి చేస్తున్నామని ప్రకటిస్తావే తప్ప-చేశావా? కాలుష్యపు కోరల నుంచి ఆ తల్లిని విడిపించావా? శుభ్రపడి శుద్ధి కావాలని గంగ తపించి పోతూ ఉంది. కాశీ ఘాట్‌ను ఒక 'మాల్' లాగా చేసి పెట్టావ్ నరేంద్రా - గ్రహించుకో-

చెప్పు, నరేంద్రా! చెప్పు - నువ్వు కన్యాకుమారి వెళ్లావు. ఆధ్యాత్మికతకు ఉండే మహోన్నతమైన స్థానాన్ని, హుందాతనాన్ని నువ్వు నవ్వుల పాలు చేశావ్. గేలి చేశావ్. చులకన చేశావ్. పరమాత్ములమైన మేము ఇలాంటి తప్పిదాలు చేయము. సత్య మార్గాన్ని, న్యాయ మార్గాన్ని అనుసరించు. న్యాయాన్ని అభినయంతో జతపరచకు నరేంద్రా. అది ఘోరమైన తప్పిదం. అవి రెండూ వేరు వేరు. అభినయమంటే నటన- నటనతో ప్రజలకు న్యాయాన్ని అందించలేవు. నువ్వే కాదు, నీ గ్రూపులో చేరే కుట్రదారులు, వెన్నుపోటు దారులు ఎవరూ ప్రజలకు నటనతో న్యాయాన్ని అందించలేరు.

చివరగా మరొక మాట! నాలాగా కనిపించాలని వేషాలెయ్యకు. దేశ ప్రజలకు అబద్ధాలు చెప్పకు. ఇతరుల బాధలు తెలుసుకో. వాటిని తగ్గించడానికి నీ అధికారాన్ని ఉపయోగించు. అంతేకానీ, అధికారం ఉందికదా అని దుర్వినియోగం చెయ్యకు. అప్పుడు నేనే నీకు తగిన బుద్ధి చెప్పాల్సి ఉంటుంది. ఒక్కసారి ఆ జెఎన్‌యూ విద్యార్థి ఉమర్ ఖాలిద్‌ను గుర్తు చేసుకో. ఆ అబ్బాయి చేసిన అపరాధమేమిటీ? మూడేండ్ల నుండి జైల్లో మగ్గుతున్నాడు. బెయిల్ కూడా దొరకకుండా చేశావ్. ఎంతో భవిష్యత్తు గల యువకుడు. ఎంతో వేదనను, యాతనను అనుభవిస్తున్నాడు. ఇలా దేశంలో ఎంతో మంది....

సూచన ప్రాయంగా నేను కొన్ని విషయాల్నే ప్రస్తావించాను నరేంద్రా - వీటిలోంచి నువ్వు ఎక్కువ విషయాలు గ్రహించు - బుద్ధిగా మసలుకో-

- ఇట్లు, నీ పరమాత్మ.

- సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త (మెల్బోర్న్ నుంచి)

అత్యాచారం కేసులో 20 ఏండ్ల జైలు శిక్ష

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

మండలంలోని చిమ్మపూడి గ్రామానికి చెందిన కంపాటి కార్తీక్(20)కి మైనర్ బాలికను అత్యాచారం చేసిన కేసులో 20 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు రూ.55 వేల జరిమాన విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి గురువారం తీర్పు చెప్పారు. ఫిర్యాది కథనం ప్రకారం మా కూతురు సాయంత్రం ఇంటి ముందు బజార్‌లో ఆడుకొనుచుండగా నిందితుడు మాయ మాటలు చెప్పి ఆటోలో తీసుకొని పోయి అత్యాచారం చేశాడని రఘునాధపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు నిందితునిపై కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. అట్టి కేసును విచారించిన న్యాయాధికారి నిందితుడిపై నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.శంకర్ వాదించగా, కోర్టు కానిస్టేబుల్ జి.రవి కిషోర్, కోర్ట్ లైజనింగ్ అధికారులు కె.శ్రీనివాసరావు, మోహన్ రావు, హెూంగార్డు అయూబ్‌లు సహకరించారు.

పారిశుధ్యం, తాగునీటి ఇబ్బందులు రాకుండా దృష్టి సారించాలి

- మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్
- కౌన్సిల్ సాధారణ సమావేశం

నవతెలంగాణ-సత్తుపల్లి

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పట్టణంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా, పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా మున్సిపల్ సిబ్బంది ప్రత్యేకించి దృష్టి సారించాలని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మున్సిపల్ కౌన్సిల్ 41వ సాధారణ సమావేశం ఛైర్మెన్ మహేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పారిశుధ్య సమస్యలు, నీటి సరఫరా పంపిణీ కార్యక్రమాలను అధిగమించడంతోపాటు విద్యుత్ విభాగానికి సంబంధించి వీధిలైట్లు, తాగునీటి సరఫరాకు ఏర్పాటు చేసిన బోర్లు విషయంలో ఎలాంటి సమస్యలు రాకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని చైర్మన్ మహేశ్ మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. దీంతో పాటు పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉన్న క్రమంలో వాటి నివారణకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలో చైర్మన్ మహేశ్ కౌన్సిల్ లో చర్చించారు. పైన తెలిపిన సమస్యలపై ఎప్పటికప్పుడు ఆయా వార్డులకు చెందిన గౌరవ సభ్యులు సూచనలు అందించాలని మహేశ్ కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మెన్ తోట సుజలరాణి, కమిషనర్ మంద రవిబాబు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్షణికావేశంలో భార్య గొంతు కోసిన భర్త

నవతెలంగాణ-సత్తుపల్లి



క్షణికావేశంలో ఓ భర్త భార్య గొంతు కోసిన ఘటన సత్తుపల్లిలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లిలోని వెంకటేశ్వర టాకీస్ రోడ్డులో నివాసముంటున్న సురేశ్ అనే వ్యక్తి కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య ప్రమీల గొంతు కోసి పరారయ్యాడు. దీంతో స్థానికులు ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి తరలించి చికిత్స అందించారు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

న్యాయ సేవా సంస్థలో నియామకాలు పూర్తి

నవతెలంగాణ-ఖమ్మం లీగల్



ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంలో వివిధ పోస్టుల కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ నిమిత్తం నిర్వహించిన పరీక్షలు పూర్తయ్యాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ అధ్యక్షతన మొదటి అదనపు జిల్లా జడ్జ్ కె ఉమాదేవి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జ్ కెవి చంద్రశేఖర్ రావులతో కూడిన కమిటీ అభ్యర్థులకి నిపుణత్వ పరీక్షలు నిర్వహించి తదనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రక్రియ ఆసాంతం పారదర్శకంగా నిర్వహించిన జిల్లా న్యాయమూర్తి జి.రాజగోపాల్ ఏ రోజుకి ఆ రోజే ఫలితాలు ప్రకటించి నియామక ఉత్తర్వులు అభ్యర్థులకు జారీ చేశారు. ఆఫీస్ క్లర్క్ గా జి రాజ్ కుమార్, డేటా ఎంట్రీ ఆపరేటర్ గా కె పద్మజ, ఆఫీస్ ప్యూన్ గా సిహెచ్ రమేష్ లకు నియామక పత్రాలు అందజేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని 12 గేదెలు మృతి

నవతెలంగాణ-తిరుమలయపాలెం

మండల పరిధిలోని దమ్మాయిగూడెం గ్రామ సమీపం వద్ద రోడ్డు దాటుతున్న గేదెలను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన 12 గేదలు అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



రామిశెట్టి లక్ష్మీసరోజినికి సండ్ర నివాళి

నవతెలంగాణ-సత్తుపల్లి

సీనియర్ పాత్రికేయుడు రామిశెట్టి లక్ష్మణరావు మాతృమూర్తి లక్ష్మీ సరోజిని గత సోమవారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. ఈ నేపథ్యంలో విషయం తెలిసిన సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం వారి గృహానికి వెళ్లి లక్ష్మీ సరోజిని చిత్ర పటానికి పూలుజల్లి నివాళులర్పించారు. వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థించారు. మృతురాలి భర్త రామిశెట్టి సుబ్బారావు, కుమారులు లక్ష్మణరావు, శ్రీనివాసరావు, రమేశ్‌లను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్లు అద్దంకి అనిల్‌కుమార్, మల్లూరు అంకమరాజు పాల్గొన్నారు.

వ్యవసాయ బావిలో పడి యువ రైతు మృతి

నవతెలంగాణ-ముదిగొండ



ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి యువ రైతు దుర్మరణం చెందిన ఘటన మండలపరిధిలో చిరుమర్రి గ్రామంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం చిరుమర్రి గ్రామానికి చెందిన గాలి హనుమంతరావు(38) వ్యవసాయ పనుల నిమిత్తం తన కుమారుడుతో తన పొలానికి వెళ్లాడు. చేలో పనులు చేసుకుంటూ ఉండగా దాహం కావడంతో పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి మంచినీళ్ల కోసం దిగారు. నీళ్లు తాగుతుండగా హనుమంతరావుకు ఫిట్స్ రావటంతో తన కుమారుడు వయసు చిన్నది కావటంతో తండ్రి చెయ్యి పట్టుకొని ఆపలేకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలోకి జారి మృతి చెందాడు. మృతుడు హనుమంతరావుకు భార్య, కుమారుడుతోపాటు, కుమార్తె ఉన్నది. గ్రామంలో మృతుడు హనుమంతరావు అందరితో కలివిడిగా ఉంటూ అకాల దుర్మరణం చెందటంతో భార్య, పిల్లలు శోకంతో విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నవతెలంగాణ ఖమ్మం

5

సమగ్ర తెలుగు దినపత్రిక

శుక్రవారం | జూన్ 14, 2024 | www.navatelangana.com

గోవిందాపురం ఎల్ గ్రామంలో వైద్య శిబిరం

నవతెలంగాణ- బోనకల్



మండల పరిధిలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో గురువారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటి సర్వే నిర్వహించి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిడిఎంఓ డాక్టర్ కావ్య మాట్లాడుతూ వర్షా కాలంలో నీరు, ఆహారం కలుషితం అయ్యే ప్రమాదం ఉంటుందని, నీటిని కాచి చల్లార్చితాగాలని ప్రజలను కోరారు. ఎప్పటికపుడు ఆహారం సిద్ధం చేసుకొని తినాలని సూచించారు. ఈ సీజన్‌లో మాంసాహారం, బయట తిను బండారాలకు దూరంగా ఉండాలన్నారు. ఇంటి వద్ద తయారు చేసిన ఆహారం, కూరగాయలు శుభ్రమైన ఉప్పు నీటితో కడిగిన తర్వాత ఉపయోగించాలని సూచించారు. 115 గృహాల నందు నిర్వహించిన సర్వేలో డయేరియా కేసులు ఏమి నమోదు కాలేదన్నారు. ప్రజలందరూ ఆరోగ్య సిబ్బంది ఇచ్చే సూచనలు పాటించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ పెద్దినేని శ్రీనివాసరావు, హెల్త్ సూపర్వైజర్ మంద దానయ్య, ఏఎన్ఎం నవనీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పేరు చెప్పి మట్టి దందా..!

గుబ్బగుర్తిలో చెరువులో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు



జిల్లాకు చెందిన ఓ మంత్రి పేరు చెప్పి కొంతమంది అక్రమార్కులు యథేచ్ఛగా తమ అక్రమ మట్టి దందాని కొనసాగిస్తున్నారు. మా వెనక మహిళ పారిశ్రామిక వేత్త ఉంది. ఆమెకు మంత్రి గారు చాలా దగ్గర, ఆమె పొలానికే మేము మట్టి తోలేది. ఎక్కువ శాతం అందుకే తోలుకుంటున్నాం అంటూ విస్తృతంగా ప్రచారం చేస్తూ తమ అక్రమ వ్యాపారాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. ఫలితంగా మంత్రిగారి పేరు చెప్పడంతో అక్రమాన్ని అడ్డుకునేందుకు అధికారులు సైతం సాహసించడంలేదనేది స్థానికులు చర్చించుకుంటున్నారు. దీంతో అడ్డుకునే వారు లేకపోవడంతో ఇంకా తమకు ఎదురేముందిలే అనే ఉద్దేశ్యంతో మట్టి మాఫియా రెచ్చిపోతోంది.

- రెచ్చిపోతున్న మాఫియా
- చోద్యం చూస్తున్న ఇరిగేషన్ శాఖాధికారులు
- సహజత్వం కోల్పోతున్న చెరువు

నవతెలంగాణ-కొణిజర్ల

రైతుల భూముల్లో భూసారం పెంచేందుకు చెరువుల్లో నల్లమట్టిని తోలుకునేందుకు ప్రభుత్వ అనుమతి ఉంది. నిబంధనల ప్రకారం అది కూడా పరిమితికి లోబడి కేవలం నల్లమట్టిని మాత్రమే తోలుకోవాలి. ఎక్కడపడితే అక్కడ ఇష్టాను సారంగా తవ్వకాలు జరపకూడదు. మట్టి మాఫియాకు మాత్రం ఈ నిబంధనలేవి వర్తించవు. అంతా తమ ఇష్టానుసారమే. చెరువుల్లో ఎక్కడపడితే అక్కడ ఎంత లోతు పడితే అంత లోతు ఇష్టం వచ్చినట్లు తవ్వుతూ చెరువులను నామరూపాలు లేకుండా చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. లక్షల రూపాయల ప్రజాదనాన్ని వేతనంగా పొందుతూ అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులు కనీసం ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం అధికారుల పనితీరు, చిత్తశుద్ధికి నిదర్శనం. మండల పరిధిలోని గుబ్బగుర్తి పెద్ద చెరువులో రైతుల పేరుతో గత కొద్ది రోజులుగా యథేచ్ఛగా మట్టి అక్రమ వ్యాపారం కొనసాగుతోంది. కొంతమంది అధికారుల నుంచి అనుమతి పొంది కేవలం నల్ల మట్టిని మాత్రమే రైతుల పొలాలకు తోలుతున్నారు. గుబ్బగుర్తి గ్రామానికి చెందిన అధికార పార్టీ గ్రామస్థాయి కార్యకర్త ఒకరు మంత్రి పేరు చెప్పి ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా ప్రతిరోజు వందలాది ట్రిప్పుల మొరంను బయటకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రామచంద్రపురం గ్రామ సమీపంలో ఓ రైస్ మిల్లుకు చెందిన పారిశ్రామికవేత్త తన పొలానికి రహదారి నిర్మాణం కోసం గత నాలుగైదు రోజులుగా వందలాది ట్రాక్టర్లతో రోడ్డు నిర్మాణానికి మట్టిని తరలిస్తున్నారు. దీంతోపాటు గ్రామంలో ఖాళీ ప్రదేశాల్లో వందలాది ట్రిప్పుల మొరం తోలుతున్నారు. ఒక్క ట్రిప్ మట్టిని ఐదు నుంచి ఏడు వందల రూపాయలకు విక్రయిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. అక్రమాన్ని అడ్డుకోవాల్సిన అధికారులు ఆవైపు కన్నెత్తి కూడా చూడడం లేదని విమర్శలున్నాయి. మంత్రి పేరు విస్తృతంగా ప్రచారం జరగడంతో ఆ వైపు చూసేందుకు అధికారుల సైతం జంకుతున్నారు. మంత్రి చెబితే చట్టం చట్టబండలు అవుతుందా అంటూ రైతులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ వ్యవహారంపై వివరణ కోరేందుకు ప్రయత్నిస్తే అధికారులు తమకేమీ తెలియదు అంటూ సమాధానం ఇస్తున్నారు. ఈ మట్టి మాఫియా దందా వెనక ఓ మహిళ పారిశ్రామిక వేత్త ఉన్నట్లు సమాచారం. అ మహిళ పారిశ్రామిక వేత్తకు మంత్రి అండదండలు ఉన్నాయని మట్టి మాఫియా వ్యాపారులు చెబుతున్నట్లు వినికిడి. అందుకే బహిరంగంగా ఇష్టం వచ్చినట్లుగా మట్టి దందా జరుపుతున్నామని అధికారులు ఎవరైనా వస్తే తనకు ఫోన్ చేయాలని అ మహిళ పారిశ్రామిక వేత్త మట్టి మాఫియాకు సూచించినట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

తనికెళ్ల చెరువు నుంచి వెంచర్ లోకి..

తనికెళ్లలో ఉన్న చెరువు నుంచి మట్టి మాఫియా విజయ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించిన పెట్రోల్ బంక్ పక్కన ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ వెంచర్ లోకి వందలాది మట్టిని ట్రాక్టర్ ల ద్వారా తరలిస్తున్న అధికారులు ఎవరూ స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత వారం రోజుల క్రితం నవతెలంగాణ పత్రికలో వార్త రాగానే ఐదురోజులు మట్టి తోలకాలు ఆపి మళ్ళీ బుధవారం నుంచి విచ్చలవిడిగా వెంచర్ లోకి మట్టిని తోలడం విశేషం. మట్టి మాఫియా మండలంలో ఉన్న అన్ని చెరువులను రైతుల పేరుతో మట్టిని అమ్ముకుంటూ సొమ్ముచేసుకుంటున్నా అధికారులు నిమ్మకునిరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమన్నారు.

నీట్ ర్యాంకర్ బొంతు భగత్‌కు సీపీఐ(ఎం) అభినందనలు

- ప్రజా వైద్యునిగా పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-వైరాటౌన్



జాతీయ మెడికల్ ప్రవేశ పరీక్ష (నీట్)లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 720 మార్కులకు 595 మార్కులు సాధించి వైద్య విద్యను అభ్యసించబోతున్న జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, మాజీ ఎంపీపీ బొంతు సమతల తనయుడు బొంతు భగత్‌ను సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు శాలువా కప్పి, పూల బోకే ఇచ్చి ఘనంగా అభినందించారు. గురువారం సీపీఐ(ఎం) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నీట్ ర్యాంకర్ బొంతు భగత్ కు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరీలో బొంతు భగత్ ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయం అన్నారు. తల్లిదండ్రుల స్ఫూర్తితో వైద్య విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు ఆశయాల సాధనకు ప్రజా వైద్యునిగా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, వైరా పట్టణం, రూరల్, కొణిజర్ల మండలాల కార్యదర్శులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు, పట్టణ నాయకులు చింతనిప్పు చలపతిరావు, బోడపట్ల రవీందర్, మల్లెంపాటి రామారావు, హరి వెంకటేశ్వరరావు, కొంగర సుధాకర్, గుడిమెట్ల రజిత, అనుమోలు రామారావు, రాచబంటి బత్తీరన్న, గుడిమెట్ల మోహన్ రావు, గుమ్మా నర్సింహారావు, సంక్రాంతి నరసయ్య, బెజవాడ వీరభద్రం, సంక్రాంతి పురుషోత్తం, పారుపల్లి చంద్రశేఖర్ బాబు, షేక్ జమాల్ సాహెబ్, తోట కృష్ణవేణి, మాడపాటి రామారావు, షేక్ నాగుల్ పాషా, చిత్తారు మురళి, తదితరులు పాల్గొన్నారు.



పిడుగుపాటుకు వ్యక్తి మృతి

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని మోటమర్రి గ్రామంలో పిడుగు పడి ఓ వ్యక్తి గురువారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టి మోదు విష్ణు (40) కల్లుగీయటానికి తాడిచెట్టు దగ్గరకు వెళ్లాడు. అదే సమయంలో తాడిచెట్టు సమీపంలో పిడుగు పడటంతో ఆ ప్రభావంతో విష్ణు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పిడుగుపాటుతో విష్ణు మృతి చెందటంతో భార్య రోదన పలువురిని కంటతడి పెట్టించింది.



నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్లూరు

పట్టణ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు షేక్ తురాబ్ అలీ-జుబేద కుమార్తె వివాహ వేడుకల్లో గురువారం నూతన వధూవరులను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు పసుమర్తి చందర్‌రావు, లక్కినేని కృష్ణ, పెద్దబేని శ్రీనివాసరావు, బొప్పన శ్రీనాథ్, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్సిడీపై ఎరువులు, విత్తనాలిచ్చి రైతులను ఆదుకోవాలి

నవతెలంగాణ-కల్లూరు



ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సబ్సిడీపై రైతాంగానికి ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కల్లూరు మండల కమిటీ కార్యదర్శి కే.పుల్లారావు మాట్లాడుతూ..ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 20 రోజులు కావస్తున్నది. రైతాంగానికి సకాలంలో అన్ని రకాల ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు సబ్సిడీపై ఇవ్వాలని, మినీ ట్రాక్టర్స్ ఇతర వ్యవసాయ పనిముట్లు ఎస్సీ, ఎస్టీ చిన్న కారు రైతులకు ఉచితంగా ఇవ్వాలని, మిగిలిన రైతులకు 50 శాతం సబ్సిడీతో ఇవ్వాలని, రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత సంవత్సరం 2023లో పంట నష్టపోయిన రైతంగానికి ఎకరానికి పదివేల రూపాయలు నష్టపరిహారం ఇస్తానని కేంద్ర ప్రభుత్వం వాగ్దానం చేసింది. వెంటనే రైతంగానికి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ నాయకులు ఆవుకు వెంకన్న, మండల నాయకులు జె.మాల్యాద్రి, జె.పరిమళ, ఏ.సరోజిని, కల్లూరు టౌన్ కార్యదర్శి ఎస్.మంగన్న తదితరులు పాల్గొన్నారు.

పలు బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని తాళ్లరు వెంకటాపురం గ్రామానికి చెందిన స్వామి భక్తిని యేసు ఇటీవల మృతి చెందగా గురువారం ప్రార్థన కూటములు నిర్వహించగా జిల్లా పరిషత్ చైర్మెన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య యేసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వెన్నవల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు వద్ద పోయిన తిరుపతిరావు తండ్రి గోపులు ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన బాజిని నాగులు ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యుల పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కట్ట అజయ్ కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాలేపు రామారావు, ఎంపీటీసీ సుబ్బారావు, పోచారం సొసైటీ అధ్యక్షుడు నర్వనేని పైద్ద అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎంను కలిసిన ఉద్యోగ సంఘాల నాయకులు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు గురువారం ఖమ్మం క్యాంప్ కార్యాలయంలో వారి పెయింటింగ్ ఫోటో మెమెంటోను ఉద్యోగ సంఘాల నాయకులు బహుకరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో ఉద్యోగ సంఘం జిల్లా నాయకులు, హెల్త్ సూపర్వైజర్ జమ్మి జైపాల్, డీఆర్డిఏ సేర్ప్ ఐకేపీ ఉద్యోగ సంగ జిల్లా అధ్యక్షులు, అండ్ పే బ్యాక్ టూ సొసైటీ వ్యవస్థాపకులు జంగం లక్ష్మణ్‌రావు, ఖమ్మం అదనపు డీఆర్‌డీఓ ఎండీ.నూరుద్దీన్, ఎస్టీఫ్ టీచర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ సైదులు, టీఎన్‌జీఓ జెడ్పీ ఉద్యోగ సంఘం డీఆర్‌డీఏ ఐడీఓసీ అధ్యక్షులు ఎం. రాజేష్, రిషి గ్లోబల్ ఇనిస్టిట్యూట్ మేనేజర్ వరికుటి మోహన్, సీనియర్ రిపోర్టర్ ఉశ్శోజీ రమేష్, వేంపల్లి విష్ణు, ఎస్‌కే. నాగుల్ మీరా, నవీన్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

గేటుకారేపల్లి వాసికి లాసెట్‌లో స్టేట్ 3వ ర్యాంక్

- ఇరిగేషన్ ఏఈగా చేస్తూనే లాసెట్

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లి మండలం గేటుకారేపల్లికి చెందిన తాళ్లూరి నరేష్ లాసెట్‌లో స్టేట్ 3వ ర్యాంక్ సాధించాడు. గురువారం విడుదలైన తెలంగాణ లా సెట్ ఫలితాలలో తాళ్లూరి నరేష్ తన సత్తాచాటాడు. ఇరిగేషన్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా నేలకొండపల్లి మండలంలో పని చేస్తున్న తాళ్లూరి నరేష్ న్యాయవాది వృత్తి పై ఉన్న మమకారంతో లాసెట్ రాశాడు. క్రితం సారి కూడా లాసెట్‌లో స్టేట్ 2వ ర్యాంకు సాధించిన ఆయన చేస్తున్న ఏఈ వృత్తి కి సెలవు పెట్టి కోర్సులో చేరాల్సి ఉండటం, కుటుంబ పరిస్థితుల మూలంగా ఈయన లా కోర్సులో ప్రవేశం పొందలేదు. వ్యవసాయ కుటుంబానికి నరేష్ మొదటి నుంచి చదువులలో చురుకుగా ఉండేవాడు. ఖమ్మంలోని ఓ ప్రయివేటు ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వెంటనే ఇరిగేషన్ శాఖలో ఏఈగా ఉద్యోగం సాధించాడు. ఈ సారి కూడా లాసెట్‌లో 3వ ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటారు. ఈసందర్భంగా తాళ్లూరి నరేష్ మాట్లాడుతూ చిన్నతనం నుండి లా చేయాలని ఉండేదని తెలిపారు. దానిలో భాగంగానే లా ప్రవేశ పరీక్షను రాశానన్నారు. పరిస్థితులు అనుకూలిస్తే ఈ సారి లా కోర్సు చేస్తానని తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో నడపబడుచున్న కృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల చైర్పర్సన్ నిష్టాశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత పాఠశాలలో బయాలజీ టీచర్, బీ జెడ్సీ లేదా ఎమ్మెస్సీ బీఈడీ, ప్రీ ప్రైమరీ అన్ని సబ్జెక్టులు ఏదైనా డిగ్రీ, బీఈడీ, ప్రైమరీ టీచర్ అన్ని సబ్జెక్టులు ఏదైనా డిగ్రీ, బీఈడీ, ప్రైమరీ కంప్యూటర్ టీచర్ ఏదేని డిగ్రీలో కంప్యూటర్ ఒక సబ్జెక్టుగా కలిగి ఉండాలని, దరఖాస్తులను మెయిల్ ద్వారా పంపాలని kpmhskmm@gmail.com చివరి తేదీ ఈనెల 17వ తేదీ వరకు మాత్రమే అని, మరిన్ని వివరాలకు 9440525093 ను సంప్రదించాలని కోరారు.

గాలి వాన బీభత్సం

- లేచిపోయిన రేకులు, పలు ఇండ్లు ధ్వంసం
- ఆదుకోవాలంటున్న బాధితులు

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలో గురువారం సాయంత్రం వచ్చిన ఈదురు గాలులు, వర్షానికి ఇళ్ల పై కప్పులు లేచిపోయి, చెట్లు నేలకొరిగాయి. 57వ డివిజన్‌లోని రెహమత్‌నగర్‌లో పలు ఇండ్లపై రేకులు గాలికి కొట్టుకుపోయాయి. బండారి రాఘవ, ఓర్సు మైసమ్మ, పలువురి ఇంటిపై కప్పులు గాలికి లేచిపోయాయి. ఇంటి పైకప్పు రేకులు మీద పడటంతో మైసమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. అంతేకాకుండా ఇంట్లోని వస్తువులు ధ్వంసమయ్యాయి. బాధితులు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కబ్జాల్లోని స్థలాలన్నీ పేదలకు పంచుతాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిని అర్హులైన నిరుపేదలకు పంచుతామని రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండా, వరంగల్ క్రాస్ రోడ్డు తదితర గ్రామాల్లో గురువారం నిర్వహించిన ప్రజలచెంతకే మీ శీనన్న కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి స్థలం సమస్య ఎవరికి రానీయకుండా చూస్తానన్నారు. అతి త్వరలోనే పాలేరు నియోజకవర్గంలో ఇండ్ల నిర్మాణం కార్యక్రమాన్ని చేపడతామన్నరు. మీ ఇంటి పెద్ద కొడుకుగా అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పేదోడి కష్టం తీర్చే ప్రభుత్వం రావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నారన్నారు. ప్రజల ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కాంగ్రెస్ పాలన సాగుతోందన్నారు. అనంతరం ప్రజల సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, బండి జగదీష్, కళ్లెం వెంకటరెడ్డి, సురేష్, కేతినేని వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్స్‌కు పరీక్షల నిర్వహణను విరమించుకోవాలి

- ప్రతినెల రెండవ తేదీలోపు పారితోషికాలను చెల్లించాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-ఖమ్మం



ఆశ వర్కర్స్‌కు పరీక్షలు నిర్వహించాలని ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణం వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మవిష్ణువర్ధన్, కళ్యాణం వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు పరీక్షలు నిర్వహించాలని, ఆలోచించడం సరైనది కాదు అని, గత 15, 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆశలకు కొత్తగా పరీక్షలు నిర్వహించడం అనే ఆలోచన ఏ రకంగానూ ఆమోదయోగ్యం కాదని, ఇలాంటి ఆలోచనలు విటమిన్చుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి నెల రెండవ తేదీన వస్తున్న పారితోషకాలు కూడా ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత 10, 12 తేదీలైన పారితోషకాలు చెల్లించడం లేదని, అదేవిధంగా ఆశాలు ఎదుర్కొంటున్న ఫిక్స్ వేతనం, వివిధ పనుల పెండింగ్ బిల్లుల సమస్యను ఈ ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పారితోషకాలని అన్ని పనులకు అమలు చేయాల్సిన అవసరం ఉందని, ఇప్పటికీ బకాయి ఉన్న వివిధ రకాల పనుల బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సబ్ సెంటర్‌లలో ఆశాలకు డ్యూటీలు వెయ్యకూడదని తదితర డిమాండ్లతో జిల్లా కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పీ.రమ్య, పీ.మోహన్‌రావు, యూనియన్ జిల్లా కార్యదర్శి బీ.అమల, నాయకులు పీ.రమణ, రాణి, కమల, సమాదానం, సరోజిని, విజయ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు తెరిచిన రోజే..! పాఠ్య పుస్తకాలిచ్చాం...!!

- ఇలా ఇవ్వడం రాష్ట్ర చరిత్రలోనే ప్రథమం
- ఎమ్మెల్యే రాగమయి దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి



పాఠశాలలు తెరిచిన రోజే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం దుస్తులు అందించడమనేది రాష్ట్ర చరిత్రలోనే ప్రప్రథమమని, ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ధన్యవాదాలు తెలియజేశారు. గురువారం స్థానిక పాతసెంటరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్ ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతతో కూడిన విద్యను ఇంగ్లీష్ మీడియంతో సహా ప్రభుత్వం అందిస్తోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయివేట్ పాఠశాలల్లో చేర్పించి తమ సంపాదనను వృథా చేసుకోవద్దన్నారు. విద్యకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. విద్యార్థులు కష్టపడి ఇష్టంతో మంచిగా చదువుకొని తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చడంతో పాటు తాము చదువుకున్న పాఠశాలలకు మంచిపేరు తెచ్చిపెట్టాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులను కోరారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం దుస్తులు పంపిణీ చేశారు. గత విద్యా సంవత్సరం పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎమ్మెల్యే రాగమయి దయానంద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, మొహమ్మద్ కమల్‌పాషా, పింగిలి సామేలు, గాదె చెన్నరావు, మొరిశెట్టి సాంబశివరావు, ఎంఈవో బి. రాములు, మున్సిపల్ వైస్ చైర్మెన్ తోట సుజలరాణి, కౌన్సిలర్ మందపాటి పద్మజ్యోతి, మహిళా కాంగ్రెస్ కన్వీనర్ రజియా, హెచ్‌ఎంలు శైలకుమారి, చిత్తలూరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎక్కువ ధరలకు ఎరువులను అమ్మితే కఠిన చర్యలు

- జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల

నవతెలంగాణ-కూసుమంచి



ఎమ్మార్పీ ధరలకంటే ఎక్కువ ధరలకు ఎరువులుగాని, విత్తనాలు గాని అమ్మితే ఆ డీలర్‌పై కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారిని విజయనిర్మల హెచ్చరించారు. గురువారం మండలంలోని కూసుమంచి, నాయకన్‌గూడెం గ్రామాలలోని ఎరువుల, విత్తన దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రతి డీలరు పీఓఎస్ మిషన్ ద్వారా మాత్రమే ఎరువుల అమ్మకాలను చేయాలని, లైసెన్సు, స్టాక్ బోర్డు, ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. స్టాక్ బోర్డును రైతులందరికీ అర్థమయ్యేలా తెలుగులో ప్రదర్శించాలని తెలిపారు. అదేవిధంగా ప్రతిరోజు విత్తన అమ్మకాలను రైతు వారీగా రిజిస్టర్‌లో పొందుపరచాలని సూచించారు. ఏ డీలర్ అయినా ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే వారిపై సంబంధిత చట్టాల ప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తన డీలర్లు అందరూ ఇన్వాయిస్, సోర్స్ సర్టిఫికేట్, ఫామ్ సీ, జీవోటీ టెస్ట్ రిపోర్ట్ లను తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. డీలర్లు అందరూ విత్తన చట్టం, ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్, ఇన్సెక్టిసైడ్స్ ఆక్ట్ మొదలైన వాటికి లోబడి వ్యాపారం చేయాలని ఎవరైనా నియమాలను అతిక్రమించినట్లయితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు విజయచంద్ర, మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి పాల్గొన్నారు.



పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ

నవతెలంగాణ-మధిర

తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మొట్ట మొదటి సారిగా ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభమైన మొదటి రోజే పిల్లలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వూట్ల రాధాకృష్ణ, ఏపీపీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు సుధాకర్, మల్లెల శ్రీను, కళావతి, భూలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

నవతెలంగాణ-మధిర



పట్టణంలో గురువారం భారీ ఉరుములు మెరుపులతో ఈదురు గాలులతో వర్షం కురవడంతో సిపిఎస్ ప్రభుత్వ పాఠశాల రోడ్డు నందు పలు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలు ట్రాన్స్‌ఫార్మర్ల మీదకు పడడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. తక్షణమే సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల స్పందించి ఈ విషయంపై తగు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నేత్ర దానం

నవతెలంగాణ-వైరాటౌన్



మున్సిపాలిటీ పరిధిలోని పాత బస్టాండ్ పెట్రోల్ బంకు సమీపంలో అనారోగ్యంతో మరణించిన కొదుమూరి అప్పారావు నేత్రాలను గురువారం కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ ముళ్ళపాటి సీత రాములు, చింతలపూడి వెంకటేశ్వరావు, కట్టా క్రిష్టార్జునరావు, వనమా విశ్వేశ్వరావు, అప్పాం సురేష్, కొదుమురి అప్పారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డ్రిప్ ఇరిగేషన్ షాపును ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-ముదిగొండ



ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి క్రాస్ రోడ్డు వద్ద న్యూకిసాన్ డ్రిప్ ఇరిగేషన్ షాపును ఎంపీపీ సామినేని హరిప్రసాద్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన పైపులను యాజమాన్యం ప్రజలకు అందించాలని కోరారు. ఈ షాపులో ప్రజలకు కావలసిన మల్చింగ్, నర్సరీ ట్రేలు, కోకోపిట్, ఇంటికి అవసరమైన పైపులు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో చిరుమర్రి ఎంపీటీసీ సభ్యురాలు కోలేటి అరుణ ఉపేందర్, జైన్ కంపెనీ రాష్ట్ర టెక్నికల్ ఆఫీసర్ సామినేని భవా నిప్రసాద్, జిల్లా మేనేజర్ మొహిన్ పాషా, ఏరియా మేనేజర్ వెంకటఅప్పలరాజు, ఫీల్డ్ ఆఫీసర్ సతీష్ పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడితోనే పిల్లలకు బంగారు భవిష్యత్తు

- ఎంపీపీ బోడ మంగీలాల్ నాయక్

నవతెలంగాణ-తిరుమలయపాలెం



ప్రభుత్వ బడితోనే పిల్లలకు బంగారు భవిష్యత్తు ఏర్పడుతుందని ఎంపీపీ బోడ మంగీలాల్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని బచ్చోడుతండా గ్రామంలోనీ మండల ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నిర్వహించిన బడీబాట కార్యక్రమంలో ఎంపీపీ బోడ మంగీలాల్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ బోడ మంగీలాల్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక దశలోనే ఇంగ్లీష్ మీడియంలో బోధనలు అమలు చేస్తుందనీ, ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ సంస్థల వలే సకల వసతులు, సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తున్నదనీ, రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులకు అన్ని రంగాల్లో అవకాశాలు వస్తాయని, పాఠశాలలో సకల వసతుల సౌకర్యాల కోసం ప్రత్యేక నిధులు కెటాయించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శేషాద్రి, ఎంఈఓ రామాచారి, ఎంపీటీసీ సభ్యులు పాపనాయక్, యువజన కాంగ్రెస్ నాయకులు గుగులోత్ సురేష్ నాయక్, కిషన్, దేవేందర్, దేవ్ సీంగ్, రవీ, పాఠశాల ప్రధానోపాద్యాయులు రజిని, వీరభద్రం, పాఠశాల సిబ్బందులు, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



నీట్ పరీక్షా లీకేజీపై సమగ్ర విచారణ చేయాలి

- డాక్టర్స్ మెడికల్ అకాడమీ ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-ఖమ్మం

నీట్ పరీక్షా లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వ సమగ్ర విచారణ జరిపి బాధ్యులుపై కఠిన చర్యలు తీసుకొని మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం దోషులపై చర్యలకు అలసత్వం ప్రదర్శించ వద్దని డిమాండ్ చేస్తూ గురువారం ఖమ్మం నగరం ఎన్టీఆర్ సర్కిల్లో వద్ద డాక్టర్స్ మెడికల్ అకాడమీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ 1563 మంది గ్రేస్ మార్కుల విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహణను స్వాగతిస్తూ బాణాసంచ కాల్చి హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాన్ని స్వాగతిస్తూ సుప్రీంకోర్టు సమర్థించడంతోపాటు గ్రేస్ మార్కులు పొందిన 1563 మంది విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహిస్తూ, వారి స్కోర్ కార్డు రద్దు చేయాలని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్ర కోట 15 శాతం రద్దుచేసి లోకల్ ఏరియా షరతులను మార్పులు చేయాలని, మరోసారి నిర్వహించే నీట్ పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

- కూసుమంచి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.విజయచంద్ర

నవతెలంగాణ-నేలకొండపల్లి



ఎరువులు, విత్తనాలను ఎమ్మార్పీ ధరలకు మించి అధిక ధరలకు విక్రయిస్తే విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కూసుమంచి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.విజయచంద్ర హెచ్చరించారు. గురువారం నేలకొండపల్లి మండలంలోని మంగాపురం తండ నేలకొండపల్లి గ్రామంలోని విత్తన దుకాణాలను, ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులందరూ విత్తన చట్టానికి లోబడి వ్యాపారం చేయాలని సూచించారు. రైతులకు ఇచ్చే బిల్లు మీద వారి పూర్తి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. లాట్ నెంబర్లను సరి చూడాలని, రైతు వారీగా విత్తన విక్రయాలను రిజిస్టర్‌లో పొందుపరచాలన్నారు. రిజిస్టర్‌లను ప్రతిరోజు తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతిరోజు విత్తనాలు అమ్మిన రిపోర్టును సమర్పించాలని, రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, స్టాక్ బోర్డు ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి డీ.అరుణకుమారి ఉన్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లిలోని పురాతన పెద్దమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు 8వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఆలయంలో మామిడి తోరణాల అలంకరణ, ధ్వజారోహణ, 15వ తేదిన అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు, దీక్షాధారణ, హెూమాలు, కమిటీచే అన్నదాన కార్యక్రమం, పెద్దమ్మ తల్లి గ్రామసేవ (ఊరేగింపు) ఉంటుందని తెలిపారు. ఉత్సవాల చివరి రోజు 16వ తేదిన గ్రామస్తులచే బోనాల సమర్పణతో ఉత్సవాలు ముగుస్తాయని వారు పేర్కొన్నారు. గ్రామస్తులు, భక్తులు ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం, ఎన్జీవోలు, ధనవంతులు అండగా ఉండాలి

- గరిడేపల్లి సత్యనారాయణ

నవతెలంగాణ-ఖమ్మం



దేశంలో అభివృద్ధి జరగాలి అన్న, పేదరికం పోవాలి అన్న ప్రభుత్వం, ఎన్జీవోలు, ధనవంతులు పేదలకు అండగా నిలవాలని న్యూ లక్ష్య స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు గరిడేపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం న్యూ లక్ష్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఖమ్మంలో బట్టలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశంలో సంపద ఉంది కానీ పంపిణి సరిగా జరగటం లేదన్నారు. ఈ దేశంలో ధనికులు మరింత ధనికులు అవుతున్నారని, పేదల మరింత పేదలవుతున్నారని తెలిపారు. దేశంలో ఇంకా 30 నుంచి 40 శాతం మంది ప్రజలు పేదరికంలోనే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేదరిక నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధి పనిచేయాలన్నారు. ఇదే సందర్భంగా ఎన్జీవోలు కూడా తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు.. తినడానికి తిండి, ఉండటానికి ఇల్లు, కట్టుకోవడానికి బట్ట, విద్య, వైద్యం, ఉపాధి ఇవి దేశంలోని ప్రజలు అందరికీ అందడం ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఇందు కోసం ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉండాలని, పాలకులు అవినీతి బంధుప్రీతి, ఆశ్రితపక్షపాతం, రాగద్వేషాలకు బ్యూరోక్రాటిక్ విధానాలకు అతీతంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవి, లక్ష్మి, శ్రీనివాస్, అనిరుద్ తదితరులు పాల్గొన్నారు.



బాబా ఆలయానికి మైక్ సెట్ వితరణ

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లిలోని సాయిబాబా ఆలయానికి ప్రముఖ వ్యాపారి బృందావన్ బేకరి యాజమాని చిరునోముల మాధవ్ మైక్ సెట్, మౌత్ ఇతర సామాగ్రిని వితరణ చేశారు. గురువారం ఆలయంలో బాబా అభిషేకాలు, ప్రత్యేక పూజలు అనంతరం రూ. 5వేల విలువైన మైక్ సెట్‌ను ఆలయ అర్చకులు నాగసాయి శర్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయ కమిటీ ఆలయంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మైక్ సెట్ బహుకరించిన చిరునోముల మాధవ్‌ను అభినందించారు.

పాఠశాలలో ప్రశాంత వాతావరణంతో ఫలితాలు

- గాంధీనగర్ హైస్కూల్‌లో సరస్వతి తల్లి విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-కారేపల్లి



పాఠశాలలో ప్రశాంత వాతావరణం కల్పనతో మంచి ఫలితాలు రాబట్టవచ్చని ఎంఈవో జయరాజ్ అన్నారు. గురువారం కారేపల్లి మండలం గాంధీనగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సరస్వతి తల్లి విగ్రహన్ని ఎంఈవో అవిష్కరించారు. ఈవిగ్రహాన్ని హెచ్‌ఎం శారద-వెంకటేశ్వర్లు దంపతులు కుమారుడు, కుమార్తె రాహుల్, సుష్మల సహకారంతో ఏర్పాటు చేశారు. విగ్రహ అవిష్కరణ అనంతరం ఎంఈవో మాట్లాడుతూ గాంధీనగర్ పాఠశాలలో పకృతి వనంను తలపించేలా ఉందన్నారు. 10వ తరగతి ఫలితాలలో కూడా గాంధీనగర్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమంగా రాణించారని కొనియాడారు. అనంతరం పదోతరగతిలో 9.8 జీపీఏ సాధించిన విద్యార్థి జీ.వినయ్‌కుమార్‌ను ఎంఈవో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉసిరికాయలపల్లి ఆశ్రమ పాఠశాల, మాణిక్యారం హైస్కూల్ హెచ్‌ఎంలు బీ.నామా నాయక్, కిషన్, ఉపాధ్యాయులు వేణు, మాధవరావు, పద్మ, జ్యోతి, ప్రేమ్‌సాగర్, రమేష్, వీరభద్రం, విజయ, శ్రీవాణి, వీవో జయసుధ తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్‌లో నెలకొన్న గందరగోళం

- సామాన్య ప్రజల లాగానే పాల్గొన్న కలెక్టర్
- స్థానిక అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

నవతెలంగాణ-అశ్వాపురం

మంత్రుల పర్యటనలో భాగంగా ప్రోటోకాల్లో గందరగోళం నెలకొన్నట్టు తెలుస్తోంది. కుమ్మరిగూడెం పరిధిలోని సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను పర్యవేక్షించడానికి వచ్చిన మంత్రులు కలెక్టర్‌ను కలుపుకొని పోవడంలో విఫలమయ్యారు అనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కలెక్టర్ ప్రియాంక అలా మంత్రులు వస్తున్న సమయం కంటే ముందుగానే సీతమ్మ సాగర్ యు పాయింట్ వద్దకు చేరుకోగా అటు ఉన్నత అధికారులు గానీ మంత్రులు గాని కలెక్టర్‌ను కలుపుకొని పోవడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో ప్రథమ భాగాన కలెక్టర్ ప్రాతినిధ్యం వహించాల్సి ఉన్నప్పటికీ వచ్చిన నలుగురు మంత్రులు ఏ ఒక్కరూ కలెక్టర్ ఊసు తీసుకురాకపోవడం గమనార్హం. అయితే కలెక్టర్ స్థానిక ప్రజలు నాయకుల మధ్యలోనే తిరగడంతో పాటు ఆమెను ఎవరూ గుర్తించకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది అన్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రోటోకాల్ పాటించకపోవడంతో స్థానిక రెవెన్యూ అధికారులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. నలుగురు మంత్రులు రాకతో స్థానికంగా సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించాల్సినప్పటికీ హడావుడిగా కార్యక్రమాన్ని చేపట్టి ఓ పక్కన ఉన్నత అధికారులతో పాటు మీడియాకు సైతం ఇబ్బందులు తలెత్తేట్టుగా కార్యక్రమాన్ని చేపట్టారని పలువురు అంటున్నారు. ఇకపై ఇటువంటి చర్యలు జరగకుండా సమన్వయంతో కార్యక్రమాలను చేపట్టాలని ప్రజల సైతం కోరుతున్నారు.

వ్యవసాయ విద్యార్థులు క్షేత్ర సందర్శన

నవతెలంగాణ-అశ్వారావుపేట

వ్యవసాయ కళాశాల రెండవ సంవత్సర విద్యార్థులు గురువారం అశ్వారావుపేటలో గల పామ్ ఆయిల్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీని క్షేత్ర సందర్శన చేసారు. కంపెనీ ఇన్‌చార్జి నాగరాజు ఈ సంస్థ ప్రాముఖ్యతని, సంస్థాగతంగా నిర్మాణాన్ని, పని చేసే విధానాలను వివరించారు. సంస్థలోని సంఘటిత శక్తి రైతును లాభాల బాట పట్టిస్తోందని ఆయన అభిప్రాయ పడ్డారు. వ్యవసాయ పద్ధతులు నుండి క్రయవిక్రయాలు వరకు ఈ సంస్థ తమ వాటా దారులకు ఎలాంటి సేవలు అందిస్తుంది అనే విషయాన్ని వివరించారు. ఒక సాధారణ సన్నకారు లేక చిన్నకారు రైతు ఈ సంస్థ లో చేరడం వల్ల ఎంతగానో అభివృద్ధి చెంది గలరని ఆయన అభిప్రాయ పడ్డారు. వ్యవసాయ ఆర్థిక శాస్త్రం సహాయ ఆచార్య డాక్టర్ కృష్ణ తేజ, వ్యవసాయ విస్తరణ సహాయ ఆచార్యులు డాక్టర్ శ్రావణ్ కుమార్ ఈ సందర్శనను సమన్వయ పరిచారు.

ఉన్నత విద్యా ప్రమాణాలతో ప్రభుత్వ విద్య

నవతెలంగాణ-చంద్రుగొండ

ప్రభుత్వం పాఠశాలల్లో ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యార్థులకు విద్యను అందించేందుకు అనేక మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం కార్యాచరణ చేసిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు ఆరిఫ్ హుస్సేన్ అన్నారు. గురువారం సీతయ్య గూడెం మండల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆరిఫ్ హుస్సేన్, మాజీ సర్పంచ్ భద్రయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ పెద్దలు శివ, కాసిన రాంబాబు, నాగరాజు, వాసు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

నవతెలంగాణ-చర్ల



స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో జరిగే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని పలువురు ప్రముఖులు కోరారు. భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంకులో రక్త నిలువలు లేక చాలామంది గర్భిణీ, తలసేమియా, సికెల్ సెల్ అనీమియా, వివిధ అత్యవసర పరిస్థితులు ఉన్నవారు ఇబ్బంది పడుతున్నదున దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ప్రపంచ రక్త దాతలు దినోత్సవం సందర్భంగా చర్ల గ్రామంలో పోలీసు శాఖ-చర్ల, మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ , మీకోసం మేమున్నాం టీం, చర్ల యూత్ ఆధ్వర్యంలో గర్భిణీలు, తల సేమియా సికిల్ సెల్ అనీమియా వ్యాధులతో బాధపడుతున్న వారికోసం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో యువత, విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానంలో పాల్గొని మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నామని నిర్వాహకులు కోరారు. రక్తదానం చేయాలనుకునే వారు మీకోసం మేమున్న టీం చైర్మెన్ నీలి ప్రకాష్ సెల్ నెంబర్ :9618170754, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళి 7075822801 సంప్రదించగలరని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తాటి

నవతెలంగాణ-అశ్వారావుపేట



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఒక వ్యక్తి చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి ఆంధ్రప్రదేశ్, ఏలూరు జిల్లా వేలేరుపాడు మండల, జగన్నాథ పురంకు చెందిన ఆరే శ్రీనివాసరావు (52) ద్విచక్ర వాహనంపై మంగళవారం రాత్రి జంగారెడ్డి గూడెం సమీపంలోని చల్లావారి గూడెం ఆర్ అండ్ ఆర్ కాలనీ నుండి స్వగ్రామం వెళుతున్నాడు. అశ్వారావుపేట మండలం వినాయకపురం నారాయ ణపురం మార్గంలో మూల మలుపు వద్ద ప్రమాదానికి గురై కింద పడిపడి తీవ్రంగా గాయపడ్డాడు. కొద్ది సేపటి తర్వాత ఆ మార్గంలో వెళుతున్న ప్రయాణికులు శ్రీనివాసరావును గుర్తించి చిట్టితల్లి అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై శ్రీరాముల శ్రీను సంఘటన వివరాలు సేకరించి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తాటి : ఆరె శ్రీనివాసరావు మృతి సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు వెలేరుపాడు చేరుకుని శ్రీనివాసరావు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసారు. అంత్యక్రియల్లో పాల్గొని స్వయంగా పాడె మోసి స్నేహాన్ని చాటుకున్నారు.

పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసిన డీఎస్పీ

అశ్వాపురం : మండలంలోని కుమ్మరిగూడెం గోదావరి నదిపై నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ పనులను పర్యవేక్షించేందుకు వస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మరో ముగ్గురు మంత్రులు రాకతో పటిష్టమైన బందోబస్తును మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి ఏర్పాటు చేశారు. కార్యక్రమం ప్రారంభం నుండి లాండ్ ఆర్డర్‌కు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కార్యక్రమం పూర్తయ్యేంతవరకు పటిష్టమైన చర్యలను చేపట్టారు. అన్ని వర్గాల వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బందోబస్తును నిర్వహించారు. సీతమ్మ సాగర్ ఈ పాయింట్ వద్ద నెలకొన్న మీడియా పాయింట్లులో ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు వహించారు. యు పాయింట్ వద్ద ప్రమాదకరంగా పరిస్థితులు ఉండటంతో పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఎవరికీ ఎటువంటి ప్రమాదాలు కలగకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమం ముగిసేంతవరకు సమన్వయంతో వ్యవహరిస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు.

రాధక్క మరణం విప్లవ ఉద్యమానికి తీరని లోటు

టేకులపల్లి : అనారోగ్యంతో మృతి చెందిన రాధాక్క మరణం విప్లవ ఉద్యమానికి తీరని లోటని మండల న్యూ డెమోక్రసీ నాయకులు తెలిపారు. గురువారం రాధక్క చిత్రపటానికి పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన టేకులపల్లిలో జోహార్లు తెలిపారు. ఈ సందర్భంగా భానుచందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హర్ష మాట్లాడారు. కామ్రేడ్ రాధక్క చంద్ర పుల్లారెడ్డి జీవిత సహచరిగానే కాకుండా ప్రత్యక్షంగా ప్రతిఘటన పోరాటంలో పాల్గొన్నారని, గోదావరి లోయ పోరాట ప్రాంతమైన ఇల్లెందు, బూర్గంపాడు, భద్రాచలం, వరంగల్, ములుగు ప్రాంతాలలో సాయుధ దళాలకు ఆమె నాయకత్వం వహించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర కార్యదర్శి నోముల బానుచందర్, అఖిల భారత రైతు కూలీ సంఘం మండల కార్యదర్శి భూక్యా నర్సింగ్, ఐఎఫ్టియు నాయకులు మంచ, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు నోముల కళావతి, పీవైఎల్ మండల కార్యదర్శి తోటకూరి సతీష్ పాల్గొన్నారు.

గ్రామస్తులకు ఇచ్చిన హామీ నెరవేర్చిన ఎస్సై

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



ఇటీవల జరిగిన ఎంపీ ఎలక్షన్‌ల సమయంలో మండల పరిధిలోని పెద్ద వెంకటాపురం గ్రామం ప్రజలు ముక్తకంఠంతో ఎన్నికల్లో పాల్గొనమని బైఠాయించిన విషయం తెలిసిందే. ఎన్నికలు సజావుగా సాగేందుకు గాను పోలీస్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై ఈ.రతీష్ పెద్ద వెంకటాపురం గ్రామ ప్రజల వద్దకు వెళ్ళి గ్రామ పంచాయతీ సమస్యలు పరిష్కరించడానికి పోలీస్ శాఖ తరుపున తమ వంతు కృషి చేస్తామని నచ్చజెప్పారు. దాంతో ప్రజలు ఎంపీ ఎన్నికల్లో స్వచ్ఛందంగా వచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇచ్చిన హామీ మేరకు గురువారం మండల కేంద్ర నుంచి పెద్ద వెంకటాపురం గ్రామం వెళ్లే మార్గంలో గుంతల ప్రదేశాలలో గ్రావెల్ పోయించారు. దాంతో గ్రామ ప్రజలు ఇచ్చిన హామీ నెరవేర్చుకున్న ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వజ్జ నర్సింహారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఉపాధిని దెబ్బతీస్తే ఉద్యమిస్తాం

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బ్రహ్మచారి
- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా
- వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు వినతి
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ



నవతెలంగాణ-పాల్వంచ

ఆశా వర్కర్లకు ఎగ్జామ్ పెట్టి, వారి ఉపాధిని దెబ్బతీసే విధానాన్ని రద్దు చేయకపోతే ఉద్యమిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బ్రహ్మాచారి అన్నారు. ఆశాలకు నష్టం కలిగించే ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఎన్నికల సందర్భంగా గత ప్రభుత్వం, ఆ తరువాత ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదురుగా భారీ ధర్నా, వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాకు జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఆశా కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట రెండు గంటల పాటు భారీ నినాదాలతో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ అధ్యక్షతన జరిగిన ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి మాట్లాడారు. 33 సంవత్సరాల అనుభవం కలిగిన ఆశా వర్కర్లకు ఇప్పుడు ఎగ్జామ్ పెట్టవలసిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వమే ఎగ్జామ్ పెట్టాలనే ఆలోచన చేస్తే సీఐటీయూ పోరాటం ఫలితంగా తన ఆలోచనను విరమించుకుందని గుర్తు చేశారు. గత ప్రభుత్వ ఆలోచనలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని భావించడం సరియైన పద్ధతి కాదని సీఐటీయూ పేర్కొన్నది. కార్మిక సమస్యల విషయంలో కేసీఆర్ వదిలిన చెప్పుల్లోనే రేవంత్ రెడ్డి కాళ్ళుపెట్టి నడుస్తున్నాడని, ఈ విధానాలు మార్చుకోకపోతే ప్రభుత్వం పోరాటాల తీవ్రతను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ముందు ఆశా వర్కర్లకు రూ.18 వేల జీతం ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిందని, ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు సబ్ సెంటర్ డ్యూటీలో రద్దు చేయాలన్నారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి నెల రెండవ తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. ధర్నా వద్దకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎన్సీడీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వచ్చి డిమాండ్లతో కూడిన వింత పత్రాన్ని స్వీకరించారు. ఎగ్జామ్ నిర్వహణ పట్ల ఆశా వర్కర్లలో వ్యక్తమవుతున్న వ్యతిరేకతను రాష్ట్ర స్థాయి అధికారులకు, ప్రభుత్వానికి తెలియజేస్తామని తెలిపారు. వేతనాలు సక్రమంగా చెల్లించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.పద్మ మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి ధనలక్ష్మి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కే.సత్య, దొడ్డ రవికుమార్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు సుశీల, హేమ, విజయలక్ష్మి, మాధవి, సుగుణ, రుక్మిణి జయ, చిన్నక్క, శిరోమణి, సబిత, భాగ్యవతి, రుప్పిని తదితరులు పాల్గొన్నారు.



ఇంటికి దారి కావాలని నిరసన

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



మండల పరిధిలోని యర్రగుంట గ్రామంలో వడ్లకుంట హుస్సేన్ ఇంటికి దారి లేకుండా కొంత మంది చేశారని, వెంటనే సీసీ రోడ్ నిర్మాణం చేపట్టాలని రజక సంఘం మండల అధ్యక్షురాలు సాలికొల్ల శివకుమారి ఆధ్యర్యంలో మండల ప్రధాన సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. భారీ ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహశీల్దార్ జగదీష్ ప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. రజక సంఘానికి మద్దతగా జిల్లా అధ్యక్షులు ముదిగొండ రాంబాబు, కార్యదర్శి చిటికెన ముసలయ్య మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుస్సేన్ గత 20 సంవత్సరాల నుండి నివాసం ఉంటూ పంచాయతీకి చెల్లించవలసిన పన్నులు చేకిస్తున్నాడని, ఇదే క్రమంలో హుస్సేన్ ఇంటి వరకు సిమెంట్ రోడ్డు మంజూరు కాగా మధ్యలోనే రోడ్డు నిర్మాణం పనులు అపిచేసినారని, కొంత మంది కావాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గతంలో పంచాయతీ వారు 12 అడుగులు రోడ్డు వుందని చెప్పి, ఇప్పుడు కనీసం రోడ్డు గురించి నిరసన వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదని, ఇప్పటికీ అయినా ఉన్నత అధికారులు స్పందించి హుస్సేన్ ఇంటికి దారి చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈలప్రోలు వీర రాఘవులు, వెంకటేశ్వర్లు, భిక్షం, రాంబాబు, రమేష్, సీత, అరుణ, చంద్రం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మనుగడ కోసమే మావోయిస్టుల దుశ్చర్య

- భయబ్రాంతులకు గురవుతున్న ఆదివాసీ ప్రజలు

నవతెలంగాణ-కొత్తగూడెం



తెలంగాణ-చత్తీస్గడ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన పూసుగుప్ప అటవీ ప్రాంతంలో నివసించే ఆదివాసీలు తాము అడవులలోనికి వెళ్ళాలంటే మావోయిస్టులు పెట్టిన మందుపాతరల వలన ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, పోలీసులు అటవీ ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేయగా బూబీ ట్రాప్స్ బయటపడ్డాయి. మావోయిస్టులు గుంతలు త్రవ్వి ఏర్పాటు చేసిన 58 బూబీ ట్రాప్స్ నుంచి 3350 పదునైన కడ్డీలను తొలగించి పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటివి వారి మనుగడ కోసమే మావోయిస్టులు దుశ్చర్యలకు పాల్పడుతున్నారని, దుశ్చర్యల వలన ఆదివాసీ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని జిల్లా పోలీసులలు తెలిపారు. గురువారం ప్రకటన విడుదల చేశారు. ఆదివాసీలకు మంచి చేస్తున్నామని మాయమాటలు చెబుతూ వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా నిషేధిత మావోయిస్టు పార్టీ నాయకులు ప్రవర్తిస్తున్నారని తెలిపారు. తెలంగాణ-ఛత్తీస్గడ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నివసించే అమాయకపు ఆదీవాసీ ప్రజలు మావోయిస్టుల దుశ్చర్యల వలన నిత్యం బిక్కు బిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివాసీలు, జంతువులు సంచరించే ప్రాంతాలలో వారు అమర్చిన ఐఇడిలు, బూబీ ట్రాప్స్ వలన ఇప్పటికే చాలామంది ప్రాణాలను కోల్పోవడం, తీవ్రంగా గాయాల పాలవ్వడం జరుగుతుందని తెలిపారు. కావునా సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎదురు కాల్పులు జరిగినప్పుడు నిజనిర్ధారణ పేరుతో హడావిడి చేసే ప్రజా సంఘాలు ఆదివాసీల పట్ల జరిగే అన్యాయాల విషయంలో ఎందుకు ప్రశ్నించడం లేదని తెలిపారు. ఆదివాసిల కోసమే మా పోరాటం అంటూ నీతులు వల్లించే మావోయిస్టు నాయకులు సరిహద్దు ప్రాంతాల్ని తమ ఆదీనంలోకి తీసుకుని, ఆ అటవీ ప్రాంతాన్ని ఒక కోటలాగా తయారుచేసుకుని, నీచమైన పనులకు తెగబడుతున్నారన్నారు. తాము ఉన్న ప్రాంతాలను శత్రు దుర్భేద్యం పేరుతో, పోలీసుల నుండి రక్షణ అని చెప్తూ "జల్ జమీన్ జంగల్" తమవే అనుకుని జీవనం సాగించే అమాయక ఆదివాసీ గిరిజన ప్రజలను నివారించడానికి బూబి ట్రాప్స్, ఐఇడిలులను అమర్చుకొని ఆదివాసిల ప్రాంతాల్లో వారికే రక్షణ కరువయ్యేట్లు చేస్తున్నారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పాడుతూ మావోయిస్టులు వారికి నచ్చిన విధంగా రాజ్యాలు సృష్టించుకొని అమాయకుల ప్రాణాలు తీస్తున్నారు. వ్యవసాయ రీత్యా, అటవీ ఉత్పత్తుల సేకరణలో భాగంగా సంచరించే ఆదివాసీలకు మావోయిస్టులు తీవ్ర నష్టం కలిగేలా చేస్తున్నారు.

విద్యా, వైద్యం, రవాణా వంటి సౌకర్యాలను ఆదివాసీలకు అందకుండా మావోయిస్టులు అడ్డుపడుతున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజలకు జరిగే నష్టానికి పూర్తి బాధ్యత మావోయిస్టు పార్టీ వహించాలని సూచించారు. తెలంగాణ-ఛత్తీస్గడ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నది. కావునా ప్రభుత్వానికి సహకరించాల్సిందిగా ప్రజలకు పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది.

పేట వేదికగా ఆయిల్‌ఫామ్ పరిశోదన, శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే జారెకు ఆయిల్‌ఫామ్ గ్రోవర్స్ సొసైటీ రైతుల వినతి

నవతెలంగాణ-దమ్మపేట



తెలంగాణలో అశ్వారావుపేట వేదికగా ఆయిల్ ఫామ్ పరిశోధన, బోధన, రైతులకు శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతూ ఆయిల్‌ఫామ్ గ్రోవర్స్ సొసైటీ రైతులు అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వినతిపత్రం అందించారు. గురువారం మండలంలోని గండుగులపల్లిలో ఎమ్మెల్యే జారెను కలుసుకున్న రైతు నాయకులు మాట్లాడారు. మన రాష్ట్రంలో పామాయిల్ పంట అన్ని జిల్లాల్లో వేగంగా విస్తరిస్తుందని అన్నారు. భిన్న వాతావరణం అనేకరకాల నేలలు భూగర్భ, ఇతర సాగునీటి లభ్యత ఉన్న మన రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగులో భవిష్యత్తులో రైతులకు పరిశ్రమలకు ఇబ్బందులు తలెత్తకుండా అత్యధిక ఏరియా సాగులో ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మీ నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు అనుబంధంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కళాశాలకు 400 ఎకరాల భూమి, నీటి లభ్యత, పామాయిల్‌కు అనుకూల నేల నర్సరీలు పరిశ్రమలు అన్నీ వనరులు పుష్కలంగా అందు బాటులో ఉన్నాయన్నారు. రైతులకు సాగులో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, నాణ్యతలేని మొక్కలు పెరుగుతున్న తెగుళ్ళు, పురుగులు, సాగులో రైతుకు సపోర్టుగా నిలిచే అనుభవం కలిగిన సిబ్బంది కొరత ఈ పంటలో అత్యంత కీలకమైన గెలలు కోతకు నైపుణ్యం కలిగిన కూలీల కొరత ఇలా అనేక సమస్యలు పరిష్కారానికి ఇది దోహదపడుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పామాయిల్ దిగుమతులపై దిగుమతి పన్ను పూర్తిగా తగ్గించడంతో గెలల ధర 50 శాతానికి పైగా పడిపోయిందని మీరు జోక్యం చేసుకొని కేంద్ర ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపడానికి రాష్ట్రప్రభుత్వం తోను, ఆయిల్‌ఫెడ్ అధికారులతోను సంప్రదించాలని కోరారు. వీటితో పాటు ఆయిల్ ఫామ్ సాగు ప్రోత్సాహక సబ్సిడీ క్రమంగా నాలుగు సంవత్సరాల పాటు రైతులకు అందాల్సి ఉందని, కాని అందడం లేదని, కావున తమరు పరిశీలించి అందరికి సబ్సిడీ అందేలా చూడాలని కోరారు. పామాయిల్ తోటల్లో తెల్ల దోమ తీవ్రంగా నష్టపరుస్తున్నందున పై అధికారులతో రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి వీటి నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, పామాయిల్ పరిశ్రమలో క్రూడ్ ఫామ్ ఆయిల్ గింజలలో రైతుకు ఇస్తున్న వాటాతో పాటు ఇతర ఉత్పత్తులలో కూడా రైతుకు న్యాయబద్ధమైన వాటా దక్కేలా చూడాలని కోరారు. ఆయిల్‌ఫెడ్ రైతు భాగస్వామ్య సంస్థ అయినందున ఇందులో ఉత్పత్తి అయ్యే ఆయిల్ లో 75% వాటా కలిగిన రైతులతో గత కొన్ని సంవత్సరాలుగా సమావేశాలు ఏర్పాటు చేయడం లేదని మీ సమక్షంలో ఈ సమావేశాలు ఏర్పాటు చేసే విధంగా చూడాలని మనవి చేసుకున్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతు నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, మహేశ్వరెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పకడ్బందీగా విధులు నిర్వహించాలి

- రివ్యూ మీటింగ్‌లో మున్సిపల్ చైర్మెన్ డీవీ

నవతెలంగాణ-ఇల్లందు



రానున్న వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్యం, ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులు సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహించాలని మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం అధికారులు, సిబ్బందితో రివ్యూ మీటింగ్ నిర్వహించారు.

శానిటేషన్ : పట్టణంలో పారిశుధ్య వ్యవస్థ పటిష్టంగా ఉండాలి. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. దోమలు రాకుండా ఫాగింగ్ చేపట్టాలన్నారు. చెత్తను బయట ఎక్కడ వేయకుండా చూడాలన్నారు.

టౌన్ ప్లానింగ్ సెక్షన్ : టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారులు పట్టణంలో ఎక్కడ ఇంక్రోజ్మెంట్ జరిగిన వెంటనే వారి పైన చర్యలు తీసుకునే విధంగా ఉండాలని తెలిపారు. పర్మిషన్ లేని కట్టడాలకు వెంటనే నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఇల్లందు పట్టణ రహదారి ఇరువైపులా ఏక్కడ ఎంక్రోజ్మెంట్ జరిగినా వెంటనే తొలగించాలన్నారు.

ఇంజనీరింగ్ సెక్షన్ : నిర్మాణంలో ఉన్న కట్టడాలను వెంటనే పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అసంతృప్తిగా ఉన్న మిషన్ భగీరథ పనులు పూర్తి చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, డీఈ నవీన్, మేనేజర్ అంకు షావలి, ఏఓ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్, ఏఈ శంకర్, టీపీఓ సతీష్, సానిటరీ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణ, జూనియర్ అసిస్టెంట్లు జవాన్లు పాల్గొన్నారు.

ముంచానికే పరిమితమైన ఇంటి పెద్దదిక్కు

- వైద్యం కోసం సాయం చేయాలని కుటుంబ సభ్యులు వేడుకోలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద దళిత కుటుంబం...కిరాయి ఆటో తోలుకుంటూ అన్నీ తానై కుటుంబ పోషణ చూసే పెద్ద దిక్కు కాళ్ల చేతులు సచ్చుపడిపోయాయి. కాలే కడుపుతో అప్పులు చేసి వైద్యం అందించినప్పటికీ జబ్బు నయం కాలేదు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు వైద్యం కోసం సాయం చేయండి అంటూ ప్రతి ఒక్కరినీ వేడుకుంటున్నారు. మండలంలోని చిన్న బండి రేవు గ్రామానికి చెందిన పొడుతూరి రవి కిరాయి ఆటోతో పాటు కూలీ నాలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. రవికి భార్య సత్యవతి తోపాటు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెద్ద కూతురు ఇంటర్ సెకండియర్ చదువుతుండగా చిన్న కూతురు ప్రస్తుతం పదవ తరగతి చదువుతోంది. కిరాయి ఆటో నడుపుకుంటూ జీవనం సాగించే రవి గత ఏడాది క్రితం షుగర్ లెవెల్స్ బాగా పెరగడంతో భద్రాచలంలోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో స్తోమ తకు మించి అప్పులు చేసి కుటుంబ సభ్యులు వైద్యం అందించారు. కాగా గత నెల రోజుల క్రితం రవి రెండు కాళు ,, చేతులు పూర్తిగా సచ్చుపడిపోవడంతో ఖమ్మంలోని మమత వైద్యశాలలో సుమారు రూ.20 వేలు ఖర్చు చేసి వైద్యం అందించారు. వైద్యం అందించేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక ఇంటి వద్ద ఉంచుతూ నాటు వైద్యం అందజేస్తున్నారు.

మంచానికి పరిమితం అయిన రవి

కిరాయి ఆటో నడుపుకుంటూ జీవనం సాగించే రవి తోటి డ్రైవర్లకు ఏ కష్టం వచ్చినా వారి ఆపదలో తాను సైతం అంటూ ముందు వరుసలో ఉండేవాడు. కాళ్ళు, చేతులు సచ్చుబడిపోయి మంచానికే పరిమితమైన రవి కుటుంబ పరిస్థితి కనీసం పోషణ గడవని స్థితి. రవికి వచ్చిన కష్టం చూసిన ప్రతి ఒక్కరూ అయ్యో అంటూ బాధపడుతున్నారు.

వైద్యం కోసం సాయం చేయండి అంటున్న కుటుంబ సభ్యులు

ఆటో నడుపుకుంటూ కుటుంబ పోషణ చూసే నా భర్త రెండు కాళ్ల చేతులు సచ్చుపడిపోయాయని, వైద్యం కోసం ప్రతి ఒక్కరూ సాయం చేయాలని రవి భార్య సత్యవతి వేడుకుంటుంది. నా భర్త ఆరోగ్య పరిస్థితి బాగా లేనప్పటి నుండి నా ఇద్దరు ఆడపిల్లలకి కడుపునిండా అన్నం పెట్టలేకపోతు న్నానని నా బిడ్డలకి వచ్చిన కష్టం ఎవరికి రాకూడదని దయా హృదయం కలిగిన దాతలు మా కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని సత్యవతి చేతులు ఎత్తి వేడుకుంటుంది.

అనారోగ్య నివారణకు వ్యక్తిగత శుభ్రత ప్రధానం

- డాక్టర్ దీపక్ రెడ్డి

నవతెలంగాణ-అశ్వారావుపేట



అనారోగ్యాలు నివారణకు వ్యక్తిగత శుభ్రత ప్రధానం అని వినాయక పురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ క్రిష్ణ దీపక్ రెడ్డి అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దబ్బతోగులో గురువారం డాక్టర్ పర్యవేక్షణలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 32 మందికి సాధారణ, తరుణ చిరు వ్యాధులకు చికిత్స, మందులు అందజేశారు. అనంతరం ఆయన ప్రజలకు ఆరోగ్య సమాచారం అందజేశారు. రానున్నది వర్షాకాలం అయినందున వ్యాదుల కాలంగా పరిగణించాలని, కావునా ప్రజలు వ్యక్తి గత పరిశుభ్రత, పరిశరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. దోమలు పెరగకుండా చేయడానికి ఇంటి పరిసరాలలో నీటి నిల్వలను లేకుండా చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది సావిత్రి, రవి, ఆశా కార్యకర్త బుల్లెమ్మ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ రోడ్డులో వీధిలైట్లు పునరుద్ధరించండి

- ఏరియా ఇంజనీర్ ఎం.నర్సిరెడ్డికి వినతి

నవతెలంగాణ-మణుగూరు

కూనవరం రైల్వే గేట్ నుండి మణుగూరు రైల్వే స్టేషన్ వరకు వీధిలైట్లు పునరుద్ధరించాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం ఏరియా ఇంజనీర్ ఎం.నర్సిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి యస్.డి నాసర్ పాషా మాట్లాడుతూ రైల్వే స్టేషన్ రోడ్డులో వీధిలైట్లు వెలగకపోవటంతో రైలు ప్రణికులతోపాటు ఇదే రోడ్‌లో రాత్రి వేళల్లో ప్రయాణించే సింగరేణి పునరావాస, న్యూ పద్మగూడెం, రాయన్న పేట గిరిజనులు రాత్రి వేళలో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా నాయకులు ఏ.మంగీలాల్ పాల్గొన్నారు.

నలుగురిపై బైండోవర్ కేసు

దుమ్ముగూడెం : నాటు సారాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులపై గురువారం ఎక్సైజ్ పోలీసులు బైండోవర్ కేసు నమోదు చేశారు. మండలంలోని రేగుంట, చిన్ననల్లబల్లి, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన నలుగురు నాటుసారా విక్రయదారులను తహసీల్దార్ పి.చంద్రశేఖర్ ఎదుట ఎక్సైజ్ ఎస్సై సాయిరాం బైండోవర్ చేశారు. ఎక్సైజ్ సీఐ రహీమున్నీసా బేగం ఆదేశాల మేరకు ఎక్సైజ్ సిబ్బంది గతంలో నాటుసారా విక్రయించిన ఘటనలో కేసులు నమోదు కావడంతో వారిని బైండోవర్ చేసినట్టు ఎస్సై సాయిరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అలీ సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసార పట్టి వేత : మండలంలోని లచ్చి గూడెం గ్రామంలో బుధవారం రాత్రి నాటు సారా తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 20 లీటర్ల నాటు సారాయి, ద్విచక్ర వాహనం స్వాధీనపరుచుకున్నట్టు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

అశ్వారావుపేట వారాంతపు సంత వేలం

- నిర్ణయ ధర కంటే రూ.51,100లు అదనంగా రాబడి

అశ్వారావుపేట : నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట మేజర్ పంచాయతీలో ప్రతీ బుధవారం నిర్వహించే వారాంతపు సంత వేలంను గురువారం స్థానిక పంచాయతీ కార్యాల యంలో మండల పంచాయతీ అధికారి సీతారామరాజు ఆధ్వర్యంలో ఈఓ గజవల్లి హరిక్రిష్ణ అధ్యక్షతన నిర్వహించారు. నిర్ణయ ధర రూ.50 వేలు కంటే రూ.51 వేయి 100లు అదనంగా అనగా రూ.1 లక్షా 11 వందలు ధర పలికింది. వారాంతపు సంత నిర్ణయ ధర రూ.38,000లు కాగా, రూ.82 వేల 5,00లు, సంత ప్రాంగణంలోని 2 గదులుకు నిర్ణాయక ధర రూ.12 వేలు కాగా రూ.18 వేలు 6 వందలు పలికింది. ఈ వేలం 14 మంది దరఖాస్తు చేసుకోగా సంతను పమిడి లక్ష్మణరావు కైవసం చేసుకోగా, 2 గదులను తోట నాగేశ్వరరావు కైవసం చేసుకున్నారు. పంచాయతీ క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

వలస ఆదివాసీలకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

ములకలపల్లి : ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం నుంచి వలస వచ్చి 30 ఏండ్లుగా ఇక్కడే స్థిర నివాసం ఉంటున్న ఆదివాసీలకు ఎస్టీ సర్టిఫికేట్ ఇవ్వాలని ఆదివాసీలు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం రాచన్నగూడెంలో ఆదివాసీల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సమావేశంలో 22 గ్రామాలనుంచి ముఖ్య నాయకులు హాజరై వారు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. తమపై ప్రభుత్వం వివక్ష చూపుతుందని, దీనిమూలంగా రెండోవ తరగతి పౌరులుగా అవమానం చవిచూస్తున్నామని అవేదన వ్యక్తం చేశారు. గత 30 ఏళ్లుగా పోడు సాగుచేస్తుంటే ప్రభుత్వం తమకు హక్కు పత్రాలు ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తుందన్నారు. తమ గ్రామాలకు నేటికీ ఎలాంటి గుర్తింపు లేకుండా నిత్యం సమస్యలతో సతమతం అవుతున్నామన్నారు. ఆదివాసీలు ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మడకం రవి, వెట్టి ముఖేష్, సాయం మంగు, మడవి ఎడమ, సోయం లక్ష్మణ్, నందులాల్, చందు, రమేష్ పాల్గొన్నారు.

అయోధ్యను పరామర్శించిన సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాష

మణుగూరు : సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద ఉండగా గురువారం జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్ పాషా, జిల్లా జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, పూర్ణ చందర్ రావు, సాయిలు అయోధ్య ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీరితోపాటు, స్థానిక నాయకులు మండల కార్యదర్శి జంగం మోహన్ రావు, పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్ జిల్లా సమితి సభ్యులు ఎస్కే సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

మోగిన బడిగంట

- విద్యా వనరుల కేంద్రానికి తిరిగి వస్తున్న పాఠ్య పుస్తకాలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



బడి గంట మోగింది...తల్లిదండ్రులు వారి పిల్లలను పాఠశాలలకు పంపించేందుకు పద..పద...అంటూ వారిని ముస్తాబు చేసి ప్రభుత్వ బడులకు పంపిస్తున్నారు. ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వం బడిబాట పేరుతో బడి ఈడు వచ్చిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని గ్రామాలలో అవగాహన కల్పిస్తున్నారు. ముందుచూపుతో అందించిన తెలుగు పాఠ్యపుస్తకాలలో ముందుమాటలో ప్రచురించిన మొదటి పేజీలో తప్పులు చోటు చేసుకోవడంతో పాఠశాలకు చేరిన తెలుగు పాఠ్యపుస్తకాలు తిరిగి విద్యా వనరుల కేంద్రానికి చేరుకున్నాయి. 2024-2025 విద్యా సంవత్సరం గురువారం ప్రారంభం అయింది. వేసవి సెలవులతో సుమారు రెండు నెలల పాటు ఆటపాటలతో గడిపిన విద్యార్థులు బడిబాట పట్టారు. మండల వ్యాప్తంగా 120 ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలలతో పాటు కళాశాలలో ఉన్నాయి. వీటిలో ఎంపీపీఎస్ పాఠశాలలు 64, యూపీఎస్ 11, జడ్‌పీహెచ్ఎస్ 03, కేజీబీవీ, బీసీ గురుకులం, ప్రభుత్వ జూనియర్ కళా శాల, ఏకలవ్య పాఠశాలలు ఒక్కొక్కటి ఉన్నాయి. వీటితోపాటు ఏజీహెచ్ ఎస్ 08, ఏపీఎస్ 04, జీపీఎస్ 17, సీఎస్ఐ పాఠశాలలు మొత్తం ఆరు కాగా వీటి లో ప్రగులపల్లి, కే దంతనం పాఠశాలలు ఎన్రోల్మెంట్ లేకపోవడంతో మూత పడ్డాయి. వీటితోపాటు ప్రయివేట్ పాఠశాలలు 2 కాగా ఒకేషనల్ జూనియర్ కళాశాల ఒకటి ఉంది. మొత్తం 120 ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలలతో పాటు, జూనియర్ కళాశాలలో 7072 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో బాలికలు 3908 కాగా బాలురు 3164 మంది ఉన్నారు.

తిరిగి వస్తున్న తెలుగు పాఠ్యపుస్తకాలు : ఒకటి నుండి పదవ తరగతి వరకు ప్రభుత్వం అందజేసిన ఉచిత పాఠ్య పుస్తకాలలో మొదటి పేజీలో ముద్రించిన ముందుమాటలో పాఠ్యపుస్తకాల రూపకల్పన కోసం సలహాలు, సూచనలు ఇచ్చిన అనే వరుసలో గత ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర రావు పేరుతో పాటు, ఆ నాటి రాష్ట్ర మంత్రులు విద్యాశాఖ కార్యదర్శి సంచాలకుల పేర్లు ముద్రించి రావడంతో గుర్తించిన రాష్ట్ర విద్యాశాఖ విద్యార్థులకు అందజేసిన తెలుగు పాఠ్యపుస్తకాలను తిరిగి అందజేయాలని విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేయడంతో విద్యార్థులకు అందజేసిన పాఠ్యపుస్తకాలను ఉపాధ్యాయులు తిరిగి విద్య వనరుల కేంద్రంలో అందజేస్తున్నారు.

పర్ణశాల హుండీ ఆదాయం రూ.17,19,292

నవతెలంగాణ-దుమ్ముగూడెం



భద్రాచల రామాలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ ఈవో రమాదేవి పర్యవేక్షణలో లెక్కించిన హుండీ ఆదాయం రూ.17 లక్షల 19 వేల 292తో పాటు మలేషియాకు చెందిన మూడు కరెన్సీ నోట్లు వచ్చినట్టు ఈవో తెలిపారు. 147 రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించినట్టు ఆమె తెలిపారు. హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓ భవాని రామకృష్ణ, సూపరిండెంట్‌లు కత్తి శ్రీను, నిరంజన్ కుమార్, పర్ణశాల ఆలయ ప్రత్యేక అధికారి అనిల్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



న్యాయవాదులు నిత్య విద్యార్థులు

నవతెలంగాణ-కొత్తగూడెం

న్యాయవాదులు ప్రతిరోజు విద్యార్థి అని జీవితకాలం చట్టాలను చదివి అర్థం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. తెలంగాణ జూనియర్ న్యాయవాదుల ఫోరం అభ్యర్థన మేరకు కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ నూతన చట్టాలపై అవగాహనా శిబిరం న్యాయవాదుల కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేశారు. జూలై 1 నుండి అమలు కానున్న భారతీయ నాగరిక సంహిత 2023లోని కొన్ని ముఖ్యమైన సెక్షన్ల గురించి న్యాయవాదులకు లక్కినేని సత్యనారాయణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటివ్ పోసాని రాధాకృష్ణమూర్తి, గ్రంథాలయ కార్యదర్శి సాధిక్ పాషా, సీనియర్ న్యాయవాదులు గాజుల రామమూర్తి, వివి.సుధాకర్ రావు, జి.రామచంద్ర రెడ్డి, అత్తులూరి మనోరమ, ఆడపాల మహాలక్ష్మి, పాతూరి విటల్, మారపాక రమేష్, దొడ్డ సమంత్, రవితేజ శంకు బాపన అనుదీప్, యాస యుగంధర్, పాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హెలికాప్టర్ దిగారు
సీతమ్మ సాగర్‌కు వచ్చారు

మీడియాతో ఒక్క ముక్క కూడా మాట్లాడని మంత్రులు

నవతెలంగాణ-అశ్వాపురం



మండలంలో గురువారం చేపట్టిన రాష్ట్ర మంత్రుల పర్యటనలో భాగంగా అమ్మగారిపల్లి పంచాయతీలోని కుమ్మరిగూడెం గ్రామంలోని గోదావరి నదిపై నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ ప్రాజెక్టును ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాసరెడ్డి హెలికాప్టర్ దిగారు...సీతమ్మ సాగర్ ఈ పాయింట్ దగ్గరికి వచ్చారు. మీడియాతో ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. అప్పటికే ఎల్ అండ్ టీ గెస్ట్ హౌస్‌లో ఉన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వారితో కలిసి సుమారు పది నిమిషాల పాటు వ్యూ పాయింట్లో సీతమ్మ సాగర్ నిర్మాణ బ్యారేజ్ పనులను తిలకించారు. అనంతరం అక్కడి నుంచి వెంటనే రోడ్డు మార్గం ద్వారా మండలంలోని బీజీ కొత్తూరు సమీపంలో గల పంప్ హౌస్‌కు చేరుకున్నారు. అక్కడ ఓ 10 నిమిషాల పాటు మోటార్లకు సంబంధించిన సబ్ స్టేషన్ నుండి విద్యుత్ కనెక్షన్‌ను ఆన్ చేసి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, మహబూబాద్ ఎంపీ బలరాం నాయక్, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్, భద్రాచలం ఆర్డీవో దామోదర్, తహశీల్దార్ స్వర్ణలత, ఎంపీడీవో వరప్రసాద్, డీసీసీ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ కృపాకర్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డీఈ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ లీడర్లు బట్ట విజయ్ గాంధీ, పోలబోయిన శ్రీవాణి, చందా సంతోష్, గాదే కేశవరెడ్డి, ఎంపీపీ ముత్తినేని సుజాత పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలను ఆదరిద్దాం

- బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి
- ఈ యేడు 92 శాతం ఉత్తీర్ణత
- వంద శాతం పుస్తకాలు, బట్టల పంపిణీ
- రూ.2 కోట్లతో అదనపు గదుల నిర్మాణాలు, మౌళిక వసతులు
- నవతెలంగాణతో ఎంఈఓ పిల్లి శ్రీనివాస్



ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలు (ఫైల్)



ఎంఈఓ పిల్లి శ్రీనివాస్

నవతెలంగాణ-ఇల్లందు

వేసవి సెలవులు ముగిశాయి. ప్రభుత్వ పాఠశాలలు బుధవారం నుండి ప్రారంభమయ్యాయి. ప్రతి యేటా విద్యాసంవత్సరం ప్రారంభంలో బడిబాట, విద్యాపక్షోత్సవాలంటూ ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. దశాబ్దాలుగా ప్రయివేటు పాఠశాలల సంఖ్య పెరుగుతూ వస్తోంది. అదే స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు పతనమౌతున్నాయి. మాజీ సీఎం కేసీఆర్ కలలుకన్న కేజి టు పీజీ విద్య కలగానే మిగలింది. ప్రభుత్వ విద్య పటిష్టపరచడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదు. దీంతో పాఠశాలలో మౌళిక వసతులు మృగ్యం. విద్యపై ఎన్ని కమీషన్లు వేసినా, విద్యాహక్కు చట్టం వచ్చినా పరిస్థితుల్లో మార్పు కానరావడంలేదు. అందరూ చదవాలి అందరూ ఎదగాలి అన్నమాట నినాదంగానే మిగిలిపోయింది. ఈ నాటికి పూర్తి స్థాయి ఎంఈఓలు లేకపోవడంతో తమకు కేటాయించిన పాఠశాల చూసుకుంటూ మండలం, పట్టణంలోని పాఠశాలలు పర్యవేక్షించడం భారంగా ఉంది. దీంతో పాఠశాల నిర్వహణపై పంతుళ్ళ అశ్రద్ధ, ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాల లేమి, తిష్టవేసిన సమస్యలతో ప్రతియేటా సమస్యల స్వాగతాలేపలుకుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి కొత్త ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం అమ్మ ఒడి పేరుతో ప్రభుత్వ అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ప్రారంభించింది. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో మౌళిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టినా నామమాత్రమేగా ఉంది. అయినప్పటికీ బడులను బలోపేతం చేయాలనే పట్టుదలతో ప్రభుత్వం ఉంది. దీంతో విద్యాశాఖ అధికారులు, అమ్మ ఆదర్శ కమిటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో కొంత కదలిక వస్తోంది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి పిల్లి శ్రీనివాస్ నవతెలంగాణతో ముఖాముఖి వారి మాటల్లోనే...

మండలంలో పాఠశాలలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య ఎంత ?

ఇల్లందు మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ఆశ్రమ, టీపీఆర్ఎస్, ఎయిడెడ్ పాఠశాలలు మొత్తం 115వరకు ఉన్నాయి. ఉపాధ్యాయల సంఖ్య 269. ఖాళీలు 51 ఉన్నాయి. విద్యార్థులు సుమారు 6 వేల మంది ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి తల్లిదండ్రులు వెనకడుగు వేస్తున్నారు కారణం ?

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించడం తల్లిదండ్రులు నామోషిగా భావిస్తున్నట్టు తెలిసింది. నాణ్యమైన విద్య, మౌళిక వసతులు లేవని అనుకుంటున్నారు. దీనికితోడు ఫీజులు కట్టనవస రంలేదని ప్రయివేటు పాఠశాలల యాజమన్యాలు కొందరు పిల్లలను చేర్పించుకుంటున్నట్టు తెలిసింది. ఇంగ్లీషు మీడియం కావాలని కోరుకుంటున్నారు. దీంతో ఇంగ్లీషు మీడియంవైపు చూస్తున్నారు. ప్రభుత్వం ఇంగ్లీషు మీడియం పాఠశాలు సైతం ప్రవేశపెట్టింది. అన్ని పాఠశాలల్లో ప్రస్తుతం ఇంగ్లీషు, తెలుగు మీడియం కొనసాగుతోంది.

ఈయేడు పదిలో రిజల్ట్స్ ఎలా ఉన్నాయి ? నాణ్యమైన విద్యకు మీరు ఇచ్చే బరోసా ఏమిటి..?

మండలంలో 51 ఖాళీలు తప్ప పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు ఉన్నారు. మిగతావి భర్తీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కోట్ల రూపాయలతో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించింది. కొందరు తల్లిదండ్రులు ప్రయివేటు పాఠశాలల్లో వేలాది ఫీజుల రూపంలో చెల్లిస్తు పదిలో పాస్ మార్కులు తెచ్చుకుంటున్నారు. ప్రయివేటులో వంద శాతం రిజల్ట్స్ సాధిచడంలేదు. మండలంలో 92 శాతం ఉత్తీర్ణత సాధించాం. పైస ఖర్చులేకుండా కడు పేద విద్యార్థులు ఎందరో 9.8 జీపీఏ సాధించారు. మండలంలో విద్యాశాఖ తన సత్తా చాటింది. 9.2 జీపీఏ, 9.3, 8.5 జీపీఏలు సాధించిన విద్యార్థులు అనేక మంది ఉన్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, ఉపాధ్యాయుల నిరంతర శ్రమ వల్లే ఉత్తీర్ణత సాధ్యమైంది. ఇంతకంటే భరోసా ఎం కావాలి.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులెలా ఉన్నాయి ?

గత ప్రభుత్వ హయాంలో మనఊరు మన బడి ద్వారా 30, ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం ద్వారా 51 పాఠశాలకు మౌళిక వసతులు కల్పిస్తున్నాం. అదనపు తరగతి గదులు, మంచినీటి సౌకర్యం ఉంది. మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేశాం. గ్రామాల్లో అక్కడక్కడ సమస్య ఉంది. ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో అధిగమిస్తున్నాం. పాఠశాలల్లో 85 శాతం ఉపాధ్యాయులు ఉన్నారు. త్వరలో ఖాళీలు భర్తీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తరగతిగదులు, బెంచీలు, ఫ్యాన్లు, లైబ్రరీలు, విశాలమైన ఆటస్థలాలు, పచ్చని చెట్లతో పాఠశాలల వాతావరణం అహ్లాదకరంగా ఉంది.

విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు ఏమిటీ..?

ఉచితంగా పాఠ్య పుస్తకాలు, ఉపకార వేతనాలు, యేడాదికి రెండు జతల బట్టలు అందిస్తున్నాం. సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నాం. వారానికి 3 గుడ్లు, ఆకు కాయగూరలు, పప్పులు వండిస్తున్నాం. 11గంటలకు రాగి జావ అందిస్తు న్నాం. బస్‌పాస్‌లు ఇప్పిస్తున్నాం. బస్‌సౌకర్యం లేని గ్రామాల నుండి ప్రభత్వ పాఠశాలకు వస్తే ఆటో చార్జీలు ప్రభుత్వం చెల్లిస్తోంది.

పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో వచ్చాయా ?

వంద శాతం పాఠ్యపుస్తకాలు వచ్చాయి. మూడు వేల మంది విద్యార్థులకు సుమారు 3,100 పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం సరఫరా చేసింది. జత దుస్తులు కూడా పంపిణీ చేశాం. మండలంలో ప్రభుత్వ పాఠశాలలన్నింటికీ సరఫరా చేయడం కూడా పూర్తయ్యింది.

బడిబాట కార్యక్రమం ఎలా జరుగుతోంది ?

అమ్మ ఒడి పథకం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులందరూ టీంలుగా ఏర్పాటయ్యారు. గ్రామాలు, తండాలు, మున్సిపాలిటీలోని వార్డుల్లో ఇంటింటికీ సర్వే నిర్వహిస్తున్నారు. బడిబయట ఉన్న విద్యార్థులతో పాటుగా ఐదు ప్లెస్ విద్యార్థుల పేర్లు నమోదు చేస్తున్నారు. ఉపాధ్యాయులతో కలిసి గ్రామాల్లో తిరిగాను. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తల్లిదండ్రులను కలిశాము. పాఠశాల్లో వసతులు, ప్రభుత్వం కల్పించే సదుపాయాలు, రిజల్ట్స్ గురించి విరంగా చెబుతున్నాం. మంచి స్పందన వస్తోంది. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి తల్లిదండ్రులు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యయులు, తల్లిదండ్రుల ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం. పూర్వ వైభవం తెస్తాం.

సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఆదివాసీ గిరిజన గ్రామాలలో అక్కడక్కడ వర్షాలు పడుతున్న తరుణంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి గిరిజనులకు వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మారుమూల అటవీ ప్రాంతాలలో నివసిస్తున్న ఆదివాసి గిరిజన కుటుంబాలకు వైద్య సిబ్బంది, వైద్యాధికారులు తాము పనిచేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో స్థానికంగా ఉంటూ 24 గంటలు గిరిజనులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, సబ్ సెంటర్ పరిధిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు గిరిజన ప్రజలకు తరుణ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ సమయపాలన పాటించాలని తెలిపారు. ఎలాంటి జ్వర మైన రక్త పూతలు స్వీకరించి మలేరియా ఉన్నట్లయితే పూర్తి చికిత్స అందించి మిగతా వ్యాధుల కోసం టీ హబ్ కి రక్త నమూనాలు పంపించి రిపోర్టులు వచ్చాక పూర్తి చికిత్స అందే విధంగా గిరిజన ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని అన్నారు. గ్రామ పంచాయతీలో, మండల హెడ్ క్వార్టర్‌లలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది లైన్ డిపార్ట్మెంట్‌తో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి గిరిజన ప్రజల ఆరోగ్య స్థితిగతుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.



ఎల్ఎస్ఎన్ ఓబి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-టేకులపల్లి


కోయగూడెం ఓపెన్‌లో ఎల్ఎస్ఎన్ ఓబీలో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు, హెల్పర్స్, ఆపరేటర్లు, బ్లాస్టింగ్, వివిధ సెక్షన్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు యాజమాన్యాన్ని గురువారం డిమాండ్ చేశారు. పదో తారీకు లోపు వేతనాలు ఇవ్వాలని, 8 గంటల పనిని అమలు చేయాలని, పిఎఫ్, సేఫ్టీ ఇంకా వివిధ సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికులు సంతకాల సేకరణ నిర్వహించినట్టు తెలిపారు.

ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ మాట్లాడారు. గతంలో ఆందోళన నిర్వహించి సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించామన్నారు. ఆ ఆందోళన ఫలితంగా 12 గంటల పని స్థానంలో టైర్ సెక్షన్ వివిధ విభాగాల కార్మికులకు ఎనిమిది గంటల పని వర్తింప చేస్తున్నారని, మిగతా సమస్యలు అలానే అపరిష్కరణంగా ఉన్నాయన్నారు. తదితర డిమాండ్‌లు పరిష్కరించాలన్నారు. లేకపోతే ఐఎఫ్టియు ఆధ్వర్యంలో దశలవారి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఎన్ కార్మికులు వీరన్న, లక్ష్మయ్య, శ్రీను, చారి, రాందాస్, నవీన్ అనిల్, సాగర్, ఆరిఫ్, కిసాన్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వాచకం వాపస్ చేయమన్న అధికారులు

- వెనక్కి తీసుకునే పనిలో ఎంఆర్‌సీ సిబ్బంది
- మాజీ సీఎం పేరు నమోదు అవడమే కారణం

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఈ ఏడాది విద్యా సంవత్సరం విద్యార్థులకు పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాల్లో తెలుగు వాచకంను వెనక్కి ఇవ్వాల్సిందిగా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడం, వాటిని వాపస్ చేసుకోవడానికి మండల స్థాయి సిబ్బంది నిమగ్నం అయ్యారు. సింగిడి తెలుగు వాచకంలో ముందు మాటగా నాటి పాలకుల పేర్లు నమోదు అయి ఉండటమే కారణంగా చూపుతున్నారు. వాస్తవానికి ఈ అచ్చు పుస్తకాన్ని 2022-23 విద్యా సంవత్సరం ప్రచురించారు. రెండో పేజీలో ముందుమాటగా ఉన్న సమాచారంలో....తెలంగాణ రాష్ట్రంలో వచ్చిన తొలి వాచకం ఇది, పాఠ్యపుస్తకాల రూపకల్పన కోసం ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇచ్చి ప్రోత్సహించిన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుకి, విద్యాశాఖ పూర్వపు మంత్రులు జి.జగదీశ్ రెడ్డి, కడియం శ్రీహరి, ప్రస్తుత విద్యా శాఖా మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి రంజీవ్ ఆర్.ఆచార్య, పాఠశాల విద్యాశాఖ పూర్వపు సంచాలకులు శ్రీ ఎమ్.జగదీశ్వర్, ప్రస్తుత సంచాలకులు శ్రీ టి.చిరంజీవులు, ప్రభుత్వ సలహాదారు డా.కె.వి.రమణాచారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ వాచక రూపకల్పనలో పాల్గొన్న కమిటీ సభ్యులు, సంపాదక మండలి సభ్యులు, విషయ నిపుణులు, ఉపాధ్యాయులు, చిత్రకారులకు ధన్యవాదాలు. ఈ వాచకాన్ని మరింత అందంగా ఆకర్షణీయంగా రూపొందించడానికి సాంకేతిక సహకారమందించిన, టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ బృందం, హైదరాబాద్ వారికి, శ్రీ రమేష్ ఖడే, కమ్యునికేషన్ ఆఫీసర్, సీఈటీఈ, టిస్, ముంబయికు, రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ వారిచే గుర్తించబడిన డిజైనర్లకు మా ప్రత్యేక ధన్యవాదములు. ఈ వాచకం పిల్లల్లో భాషాభిరుచి, సాహిత్యాభిలాష, భాషా సామర్థ్యాలను పెంపొందించి ఉత్తమ వైఖరులు కల్గిన వ్యక్తులుగా ఎదగడానికి తోడ్పడుతుందని ఆశిస్తున్నాం.

తేది: 05-12-2022

స్థలం : హైదరాబాద్.

అని ఉంది.

ఇందులో నాటి పాలకుల పేర్లు ఉన్నందున పంపిణీ చేసిన అన్ని పుస్తకాలను వెనక్కి తీసుకుని ప్రస్తుత పాలకుల పేర్లు ముద్రించి ఇస్తారట. దీనికి అయ్యే వ్యయం ప్రజాధనం మే కదా.... పాఠ్యాంశాల్లో తప్పులుంటే తొలగించాల్సిందే. కానీ నాడు ముద్రించిన పుస్తకాల్లో నాటి పాలకుల పేర్లు తొలగించడానికి ఇంత వ్యయం అవసరమా? అనేది పలువురు ప్రజాస్వామిక వాదులు ప్రశ్నిస్తున్నారు.

కంపెనీ క్వార్టర్‌లలో సింగరేణి కార్మికుడే నివాసం ఉండే విధంగా చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-మణుగూరు

పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మణుగూరు ఏరియాలో నిలిచిన క్వార్టర్ కౌన్సెలింగ్‌ల కోసం కార్మికులు ఎదురు చూస్తున్నారని వెంటనే క్వార్టర్ కౌన్సెలింగ్ నిర్వహించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ నాయకులు నాగెల్లి వెంకట్ తెలియ చేశారు. గురువారం ఏరియా నందు షెడ్యూల్ ప్రకారం క్వార్టర్ కౌన్సెలింగ్ నిర్వహించక పోవడం వల్ల వేలాది రూపాయలు వెచ్చించి కార్మికులు అద్దె నివాసాల్లో అంటూ ఆర్థికంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఖాళీగా ఉన్న క్వార్టర్‌లపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించవలసిన అధికారులు ఆ దిశగా దృష్టి సారించక పోవడం బాధాకరమైన అంశం అన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఖాళీగా ఉన్న క్వార్టర్‌లు శిథిలావస్థకు చేరుతున్నాయని ఆయన ఆరోపించారు. తద్వారా కంపెనీ విలువైన ఆస్తులు నాశనం అవుతున్నాయని తెలిపారు. కౌన్సెలింగ్ నందు క్వార్టర్ పొందిన కార్మికుడికి క్వార్టర్ ఫిట్ నెస్ సర్టిఫికెట్ అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలియచేశారు.

గెలిచిన సంఘానికి యాజమాన్యం గుర్తింపు పత్రం ఇవ్వాలి

- సీఐటీయూ

నవతెలంగాణ-మణుగూరు



గెలిచిన సంఘానికి యాజమాన్యం గుర్తింపు, ప్రాతినిధ్య గుర్తింపు పత్రాలను వెంటనే ఇవ్వాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వల్లూరు వెంకటరత్నం డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో టీవీ ఎం.వి.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడుతూ సింగరేణిలో ఎన్నికలు జరిగి ఆరు నెలల అయినప్పటికీ ఇప్పటివరకు యాజమాన్యం గుర్తింపు పత్రాలను జారీ చేయకపోవడం, రాజకీయ జోక్యం ఎక్కువైందని విమర్శించారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి వెంటనే గుర్తింపు పత్రాలు ఇవ్వాలని, అలాగే గెలిచిన గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘాలు యాజమాన్యంతో కుమ్మక్కై రెండు సంవత్సరాల కాల పరిమితిని నాలుగు సంవత్సరాలకి పెంచుకోవాలని చూస్తున్నాయని విమర్శించారు. లేబర్ కమిషనర్ ఎన్నికల సమయంలో గుర్తింపు ఎన్నికలు రెండు సంవత్సరాలకి అని అగ్రిమెంట్ చేసిన విషయం విదితమే అన్నారు. ఈ విషయంలో కార్మిక వర్గం, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలుకూడా యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని కోరారు. అలా కాకుండా ఏమైనా మార్పులు జరిగితే గత గుర్తింపు సంఘానికి పట్టిన గతే భవిష్యత్తులో ఈ సంఘాల కూడా పడుతుందని విమర్శించారు. ఈ సమావేశంలో మాచారపు లక్ష్మారావు, నందం ఈశ్వరరావు, వై.రామ్మూర్తి, లక్ష్మణరావు, విల్సన్ రాజు, ప్రభాకర్ రావు, బుచ్చిరెడ్డి, బొల్లం రాజు, బిక్షపతి, సుమన్, శ్రీకాంత్, కట్కోజుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
9
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | జూన్ 14, 2024 | www.navatelangana.com

గోపాల మిత్రులకు పీఆర్‌సీ బకాయిలు విడుదల పట్ల హర్షం

నవతెలంగాణ-కల్లూరు

పశుసంవర్ధక శాఖ అనుబంధంగా పశుగణాభివృద్ధి సంస్థలలో పనిచేస్తున్న గోపాల మిత్రులకు పీఆర్‌సీ బకాయిలు ప్రభుత్వం విడుదల విడుదల చేసినందుకు గోపాల్ మిత్ర సంఘ జిల్లా అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, సత్తుపల్లి డివిజన్ గోపాల మిత్ర సంఘ అధ్యక్షులు ఖమ్మంపాటి అప్పారావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పశుగాణాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రులు 1530 మందికి పెండింగ్ పీఆర్సీ బకాయిలు 7,36,18,360 కోట్ల ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విడుదల చేశారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో గోపాలమిత్ర సంఘానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని అమలు చేయటంతో పెండింగ్లో ఉన్న 21 నెలల పీఆర్సీ బకాయిలను విడుదల చేసిందన్నారు. మిగిలిన సమస్యలు సైతం త్వరలోనే పరిష్కారం అవుతాయని ఆనందం వ్యక్తం చేశారు. గోపాలమిత్రుల పెండింగ్ బకాయిల విడుదలకు కృషి చేసిన ఖమ్మం జిల్లా మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్కకి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, తుమ్మల నాగేశ్వరరావుకి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాఘవయ్యకి, గోపాలమిత్ర అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చెరుకు శ్రీనివాసరావుకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలోని కల్లూరు మండలం గోపాలమిత్ర అధ్యక్షులు ఎస్.కోటేశ్వరరావు, డి.రవికుమార్, పి.వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్, డి.కృష్ణ ప్రసాద్, ఈ హనుమంతరావు, ఏ.శివకృష్ణ, ఆర్.రమేష్, ఏ.నాగిరెడ్డి, గోపాల మిత్రులు పాల్గొన్నారు.

ఏసు కుటుంబాన్ని పరామర్శించిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని తాళ్లూరు వెంకటాపురం సీపీఐ(ఎం) గ్రామ కార్యదర్శి సోంబత్తిని కృష్ణ, తండ్రి ఏసు ఇటీవల మృతి చెందగా గురువారం ఆయన చిత్రపటానికి పూలు మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, సలం సత్యనారాయణ రెడ్డి, తల్లాడ మండల కార్యదర్శి రామలింగేశ్వర రావు, కల్లూరు మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, తన్నీరు కృష్ణ, చింతలపూడి పురుషోత్తం గ్రామ నాయకులు నివాళులర్పించారు.



ముదిగొండలో నూతన ప్రెస్ క్లబ్ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రమైన ముదిగొండలో నూతన ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కందిమళ్ల వీరస్వామి, కమిటీ సభ్యులు చేతుల మీదగా గురువారం లాంఛనీయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిగొండ ప్రధాన సెంటర్ రాజస్థాన్ హోటల్ పక్కన నూతన ప్రెస్ క్లబ్ కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ప్రెస్ క్లబ్ వేదికగా పాత్రికేయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మండలంలోని అధికారులు, నాయకులు, ఉద్యమకారులు, సంఘం నాయకులు, మండల ప్రజలు ఏ సమాచారమైన ప్రెస్ క్లబ్ కార్యాలయానికి అందించవచ్చున్నారు. ప్రెస్ మీట్ లు,ద్వారా ప్రజలు వారి సమస్యలను నిర్భయంగా స్వేచ్ఛగా చెప్పుకోవచ్చని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో మండల పాత్రికేయులు యస్‌వి రమణ (వీ6, వెలుగు), ఆవుల రామారావు (నవతెలంగాణ), పుచ్చకాయల అచ్యుత్ (ఆంధ్రజ్యోతి), వనం కృష్ణకాంత్ (నమస్తే తెలంగాణ), దిగుట్ల లక్ష్మణ్ (ఏబిఎన్), రాయబారపు నాగబాబు (ప్రజాపక్షం), గోగుల వెంకటకృష్ణ (వార్త), కందుకూరి రాకేష్ (దిశ), గొల్లపల్లి అప్పారావు (జనంసాక్షి), మేడా ఎల్లయ్య (మెట్రో)లు పాల్గొన్నారు. కాగా నూతన ప్రెస్ క్లబ్ కార్యాలయం ఏర్పాటు చేయటం పట్ల మండలంలోని అధికారులు, వివిధ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు ప్రెస్ క్లబ్ కమిటీకి అభినందనలు తెలిపారు.

కువైట్ మృతులకు నివాళి

నవతెలంగాణ-ఖమ్మం

ఎడారి దేశం కువైట్‌లో భారతీయ కార్మికులు నివాసముండే అపార్ట్మెంట్‌లో అగ్ని ప్రమాదంలో మృతి చెందిన 42 మంది భారతీయులకు పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాకం శ్యామ్ బాబు, కార్మిక నేత మంద వెంకటేశ్వర్లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లో కొవ్వొత్తులు వెలిగించి అశ్రు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కువైట్ లోని మంగాఫ్‌లో ఉన్న ఆల్ మంగాఫ్ అనే ఆరంతస్తుల భవనాన్ని ఎన్ బిటీసి కంపెనీ అద్దెకు తీసుకుంది. భవనంలో సుమారు 195 మంది కార్మికులు నివసిస్తున్నారని, వారిలో ఎక్కువ సంఖ్యలో కేరళ, తమిళనాడు, ఉత్తరాది రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారని తెలిపారు. భవనంలో నివాసముంటున్న కార్మికులంతా గాఢ నిద్రలో ఉన్న సమయంలో బుధవారం తెల్లవారుజామున భవనంలో ఒక్క సారిగా మంటలు చెలరేగడం మాటలతో పాటు పొగ దట్టంగా వ్యాపించడం వల్ల ఊపిరాడక ఎక్కువ మంది కార్మికులు మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపిందని, మృతుల్లో 42 మంది భారతీయులు ఉండటం మరింత బాధాకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు దుర్గేష్, గోపాల్, గోవర్ధన్ కుటుంబరావు, శైలంద్ర, జానకి రామయ్య, లింగయ్య రామనాథం, మూర్తి, వెంకట్ బాబు. మాధవి, కళ పాల్గొన్నారు.


గిరిజన సంఘం రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

నవతెలంగాణ-వైరాటౌన్

జూన్ 20, 21 తేదీలలో వైరా లో జరగనున్న తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం పిలుపు ఇచ్చారు. గురువారం స్థానిక బోడేపూడి భవనంలో గిరిజన సంఘం సమావేశంలో మాట్లాడుతూ నిరంతరం గిరిజన హక్కుల కోసం పోరాడుతున్న తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు జూన్ 20, 21 తేదీలలో వైరాలో జరుగుతాయని, శిక్షణా తరగతులకు ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి దాదాపు 150 మంది కార్యకర్తలు ప్రతినిధులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా, మండల నాయకులు భూక్యా కృష్ణ నాయక్, బానోత్ హరిచంద్, కృష్ణకాంత్, రాములు, రమేష్, సుధాకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత..

నవతెలంగాణ -దుమ్ముగూడెం



మండల పరిధిలోని చిన్న నల్లబెల్లి గ్రామం వద్ద దుమ్ముగూడెం పోలీసులు గురువారం పది క్వింటాల రేషన్ బియ్యం పట్టుకున్నారు. పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఒక ఆటోలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనబడడంతో వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆటోను తనిఖీ చేయగా అందులో పది క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉండడాన్ని గుర్తించి వాటిని పోలీసులు స్వాధీనపరచుకొని విచారించగా, కూనవరం మండలం కూటూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తో పాటు అదే గ్రామానికి చెందిన సున్నం విజయ్ లు తక్కువ ధరలకు ఇక్కడి రేషన్ బియ్యాన్ని సేకరించి చట్టి ప్రాంతానికి తరలిస్తున్నట్లుగా పోలీసులకు తెలిపారు. కాగా సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసిన పోలీసులు రేషన్ బియ్యంతో పాటు వాహనాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, స్నేహబంధాన్ని పెంపొందిస్తాయి

- యువజన కాంగ్రెస్ నాయకులు తెల్లం హరికృష్ణ
- విజేతగా మంగువాయిబడవ జట్టు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఏజెన్సీ ప్రాంతంలో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, వారిని క్రీడల్లో ప్రోత్సహిస్తే రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణిస్తారని యువజన కాంగ్రెస్ నాయకులు తెల్లం హరికృష్ణ అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి స్నేహ బంధానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. గురువారం మండల పరిధిలోని అంజుబాక క్రీడా మైదానంలో జరిగిన ఐదు రోజుల క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని విజేతలకు ట్రోఫీ అందజేశారు. ఫైనల్ మ్యాచ్లో మొదటి బ్యాటింగ్ చేసిన మంగువాయిబాడవ జట్టు 10 ఓవర్లు ముగిసేసరికి 88 పరుగులు సాధించింది. 89 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన రఘు లెవెన్ జట్టు 42 పరుగుల సాధించి ఓడింది. ఈ టోర్నమెంట్లో విజేతగా నిలిచిన జట్టుకు 25 వేల రూపాయల నగదు, షీల్డ్ తో పాటు రనర్స్ గా నిలిచిన రఘుకు చిన్న బండి రేవు జట్టుకు 10వేల రూపాయలు, షీల్డ్ అందించారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం మండల యువ నాయకులు తునికి కామేశ్వరరావు, నిర్వాహక కమిటీ సభ్యులు చరణ్, ముత్యాలరావు, చంద్రశేఖర్(చింటు) పాల్గొన్నారు.

రహదారి పనులు నాణ్యతతో చేపట్టాలి

- అవసరమైన ప్రాంతాల్లో ఎగ్జిట్, ఎంట్రీలు ఏర్పాటు చేయాలి
- ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

నవతెలంగాణ-ఖమ్మం

రహదారుల పనుల్లో వేగం పెంచి పనులు త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం ఖమ్మం నగరంలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ అధికారులతో ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-365బిజి), ఖమ్మం-అశ్వారావుపేట రోడ్డు పనుల పురోగతిపై సమీక్ష మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కల్లూరు నుండి మధిర రోడ్డు దగ్గర, ధంసలాపురం బోనకల్ రోడ్డు దగ్గర, వేంసూరు నుండి సత్తుపల్లి రోడ్డు దగ్గర ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్లు ఏర్పాటు చేయాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కి సూచించారు. అదే విధంగా కల్లూరు నుండి మధిర రోడ్డు దగ్గర ఇప్పటికే జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ వారు అనుమతి ఇచ్చారని, ఆ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.



సత్తుపల్లి వేంసూర్ రోడ్డు దగ్గర ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్లుకు కూడా అనుమతివ్వాలని సూచించారు. ఈ సమస్యను సైతం త్వరితగతిన పరిష్కరించేలా చూడాలన్నారు. పట్టణంలోకి ప్రవేశించేందుకు ధంసలాపురం బోనకల్ రోడ్డు దగ్గర ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్లు, సర్వీస్ రోడ్లు గురించి అధికారులకు పలు రకాల సూచనలు చేశారు. వీటన్నింటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి సైట్ పరిస్థితుల ప్రకారం సర్వే చేసి సాంకేతిక నివేదిక అందజేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు వివరణ ఇచ్చారు. ఖమ్మం-అశ్వారావుపేట రోడ్డు ఎన్‌హెచ్-365 బిబి ఏర్పడిన గుంటలను తక్షణమే పూడ్చి ఆ సమస్యలను పరిష్కరించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైతే సమస్యలు పరిష్కారానికి కొన్ని ఇబ్బందులు ఏర్పడతాయని, వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి నాణ్యత ప్రమాణాలు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈద్గాల వద్ద వసతులు కల్పించండి

- మైనారిటీ జిల్లా అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా

నవతెలంగాణ-పాల్వంచ

ఈ నెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గా, మసీదుల వద్ద తగు సౌకర్యాలు కల్పించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా గురువారం నాడు ఒక ప్రకటనలో అధికారులను కోరారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 160 మసీదులు, 20 వరకు ఈద్గాలు ఉన్నాయని, బక్రీద్ పండుగను పురస్కరించుకొని, "ఈద్ ఉల్ జుహా " నమాజ్ ను ఆచరించటానికి ఈద్గా, మసీదుల వద్ద వందలాది మంది ముస్లింలు హాజరవుతారని, శానిటైజేషన్, మంచి నీరు, టెంట్లు, షామియానాలను ఈద్గా, మసీదుల వద్ద ఏర్పాటు చేయాలని మున్సిపల్ మరియు మండల అధికారులను కోరారు.

మంచినీటి ఎద్దడిని నివారించండి

- డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల

నవతెలంగాణ-పాల్వంచ

పట్టణంలో తాగునీటి ఎద్దడిని నివారించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మెన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పాత పాల్వంచలోని కొన్ని ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైపులైన్లు వేయక నీటి సరఫరా కావడం లేదని మహిళలు కొత్వాల వద్ద చెప్పగా ఆయన పాత పాల్వంచలో పర్యటించారు. మిషన్ భగీరథ అధికారులను ఆ ప్రాంతానికి పిలిపించి మాట్లాడారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ సక్రమంగా నీటి సరఫరా చేయకపోవడం వల్ల ప్రజలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పైప్ లైన్లు అన్ని ప్రాంతాల్లో వేసి సంపూర్ణ నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులను కొత్వాల కోరారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ డీఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ సూపర్ వైజర్ వెంకటేష్, మున్సిపల్ వాటర్ సప్లై ఆపరేటర్ యూసబ్, స్థానికులు రెహ్మాన్, ఖాజా మొయినుద్దీన్, సోములపల్లి శ్రీదేవి, గడ్డికొప్పుల తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏక రూప దుస్తులు, పుస్తకాలు అందజేత

నవతెలంగాణ - ఆళ్ళపల్లి

మండల పరిధిలోని చింతోళ్లగుంపు గ్రామంలోని జీపీఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బి.ఈర్లాల్ గురువారం విద్యార్థులకు ఏక రూప దుస్తులు, పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్ళపల్లి వీవో పి.మంగ, చింతోళ్లగుంపు గ్రామ పటేల్ చింత మంగయ్య, అంగన్వాడీ కార్యకర్త చింత లత, పిల్లల తల్లిదండ్రులు చింత లక్ష్మణ్ రావు, కొమరం నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి ఖమ్మంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

- పెండింగ్ లో ఉన్న ట్రై కార్ రుణాలు వెంటనే విడుదల చేయాలి
- గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి
- తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య వీరభద్రం

నవతెలంగాణ-బోనకల్

ఖమ్మం జిల్లా గిరిజనుల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఖమ్మంలో ఐటీడీఏను ఏర్పాటు చేయాలని, పెండింగ్ లో ఉన్న ట్రై కార్ రుణాలను విడుదల చేసి లబ్దిదారులకు సహాయ పడాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలో రావినూతల తండాలో గురువారం జరిగిన గిరిజన సంఘం గ్రామ మహాసభలో భూక్యా వీరభద్రం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ మహాసభలో ఆయన మాట్లాడుతూ అనేక ప్రభుత్వాలు మారిన గిరిజన జీవన విధానంలో మార్పు రాలేదని, రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోయిందని, గిరిజనుల్లో పేదరికం, దరిద్రం



పెరగటానికి ప్రభుత్వాలే కారణమని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీల అమలుకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. గిరిజన నివాస గ్రామాలు సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అంతర్గత రోడ్లు, డ్రయినేజ్ సమస్య లేకుండా అభివృద్ధి పరచాలని డిమాండ్ చేశారు. గిరిజనలు అనేక రకాల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కానీ పాలకుల మాత్రం గిరిజన సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో గిరిజనులకు మాత్రం అన్ని రాజకీయపక్షాలు హామీల వర్షం కురిపిస్తాయన్నారు. ఎన్నికల అనంతరం గిరిజనుల గురించి ఏ పార్టీ పట్టించుకోవడం లేదన్నారు. ఈనెల 20న వైరాలో జరుగు గిరిజన సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ, సామాజిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ గిరిజన సంఘం గ్రామ నూతన కమిటీ

తెలంగాణ గిరిజన సంఘ గ్రామ నూతన కమిటీని 12 మందితో ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బానోతు నాగేశ్వరరావు, రావూరి వెంకటేశ్వర్లు, ఎన్నికైనారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, రావినుతల మాజీ సర్పంచ్ గుగులోత్ పంతు నాయక్, మండల కార్యదర్శి అజ్మీర గోపీనాయక్, గుగులోత్ నరేష్ నాయక్, ఎ.మోతిలాల్ నాయక్, తండా నాయకులు ధరావత్ కృష్ణ నాయక్, గుగులోత్ సైదులు నాయక్, ధరావత్ నరేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున అండగా ఉంటాం

- కొప్పుల కుటుంబానికి బియ్యం వితరణ

నవతెలంగాణ-పినపాక

నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొడిశాల రామనాథం అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోదెం వీరయ్య, పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఎల్చిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొప్పుల సాంబశివరావు మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి సహాయంగా దశదిన కర్మలకు 25 కేజీల బియ్యం వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక యువకులు దితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలి

నవతెలంగాణ-పాల్వంచ

కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వర్క అజిత్ డిమాండ్ చేశారు. ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యాసంస్థల్లో స్టేషనరీ అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో విద్యాశాఖ అధికారి శ్రావణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల సృజన్, వెంకటేష్, చందూలాల్, రాజు, శ్రీకాంత్, రాములి తదితరులు పాల్గొన్నారు.

లంక రమాదేవికి రేగా కాంతారావు నివాళి

నవతెలంగాణ -దుమ్ముగూడెం

మండల కేంద్రమైన దుమ్ముగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన యూత్ నాయకుడు లంక శివ మాతృమూర్తి రమాదేవి గత నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం చిన్న దశదిన కార్యక్రమానికి మాజీ ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు హాజరై రమాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన శివ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు అన్నే సత్యనారాయణ మూర్తి, పార్టీ సీనియర్ నాయకులు సాగి శ్రీనివాసరాజు, మండల అధికారప్రతినిధి జానిపాషా, నాయకులు కొత్తూరు సీతారామరావు, సోషల్ మీడియా అధ్యక్షులు దామెర్ల శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మోతుకురి శ్రీకాంత్, యూత్ కమిటీ మండల అధ్యక్ష కార్యదర్శులు అల్లాడి వెంకట్, జిలకర గంగరాజు, కొండపల్లి నరేంద్ర, రైతు నాయకులు జోగ బుజ్జి, జుంజురి జయసింహ, రాము తదితరులు పాల్గొన్నారు.

కేరళ కమ్యూనిస్టు తొలి ముఖ్యమంత్రి నంబూద్రి పాద్‌కు సీపీఐ(ఎం) నివాళి


నవతెలంగాణ-ఇల్లందు

భారతదేశంలోని కమ్యూనిస్టు తొలి ముఖ్యమంత్రిగా ఘన కీర్తి సాధించిన ఈఎంఎస్ నంబూద్రిపాద్ 119వ జయంతి సందర్భంగా ఏలూరి భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, ఆలేటి కిరణ్ కుమార్, మన్యం మోహన్ రావు, సీహెచ్ శ్రీనివాస్, సబ్బు, బక్కయ్య, పి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

75 లక్షల విలువైన గంజాయి పట్టివేత

నవతెలంగాణ- కొత్తగూడెం

కొత్తగూడెం పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ సుమారు రూ.75,00,000లు ఉంటుందని గురువారం వన్ టౌన్ పోలీసులు ప్రకటన విడుదల చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం



కొత్తగూడెం 1 టౌన్ ఎస్ఐ విజయ తన సిబ్బందితో కలిసి కొత్తగూడెం బస్టాండ్ సమీపంలోని వెహికల్ చెకింగ్ చేస్తున్నారు. ఈ సమయంలో ముగ్గురు వ్యక్తులు కారులో అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి, సోదా చేయగా మొత్తం 93 ప్యాకెట్లలో 186 కేజీల బరువు గల రూ.75 లక్షల విలువ గల నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని పట్టుకోవడం జరిగిందని తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారు. కామారెడ్డి జిల్లా, మాచారెడ్డి మండలానికి చెందిన పెనుగొండ నరసింహులు, కుంచం లక్ష్మణ్, భూక్యా లక్ష్మణ్‌లు అదుపులోకి తీసుకున్న ముగ్గురు నిందితులు ఒరిస్సా రాష్ట్రం, మల్కాన్ గిరి అటవీ ప్రాంతంలో కొనుగోలు చేసి మహారాష్ట్ర, షోలాపూర్ నందు విక్రయించుటకు నిషేధిత గంజాయిని తీసుకెళ్తుండగా పట్టుకోవడం జరిగిందని వెల్లడించారు. ఈ ముగ్గురిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామన్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో బిల్డింగ్ నిర్మాణ కాంట్రాక్టర్లు

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలకు సొంత భవనాలు నిర్మించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం అన్ని గ్రామ పంచాయతీలకు భవనాలను మంజూరు చేసింది. ఈ నిర్మాణ పనులను స్థానిక గ్రామపంచాయతీ తీర్మానంతో కాంట్రాక్టర్లను కేటాయించారు. కేటాయించబడిన కాంట్రాక్టర్లు గ్రామపంచాయతీ భవనాలను నిర్మాణం పూర్తి చేయించి స్థానిక గ్రామపంచాయతీకి అప్పగించడం చేయాలి. ఈ నిర్మాణ పనులను ఐటీడీఏ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామపంచాయతీలకు, మిగిలిన వాటిని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా నిర్మాణం చేసేటట్లుగా ప్రభుత్వం నిధులను కేటాయించింది. మొదలుపెట్టి నేటికి సంవత్సరం కావస్తోంది. గ్రామపంచాయతీ భవనం నిర్మాణం పూర్తి అయిన నేటి వరకు ఒక పైసా కూడా కాంట్రాక్టర్లకు రాకపోవడంతో వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. అధికారులను అడిగితే బడ్జెట్ లేదు అని చెబుతూ చేతులెత్తేస్తున్నారు. అప్పోసొప్పో చేసిన కాంట్రాక్టర్లు ఏమి చేయాలో దిక్కు దోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. లక్షల్లో వడ్డీకి తీసుకువచ్చి నిర్మాణం పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు రుణ దాతల నుండి విపరీతమైన ఒత్తిడి పెరగడంతో ఏమి చేయాలో పాలుపోక, వారి సొంత ఆస్తులను అమ్మి అప్పులు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడినది. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని గ్రామపంచాయతీ గుత్తేదారులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేసి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ఉన్నదని పలువురు కాంట్రాక్టర్లు వాపోతున్నారు. చిన్న చిన్న పనులు చేసుకుని జీవించే ఈ కాంట్రాక్టర్లకు ఇంత భారీ



మొత్తంలో బిల్లులు ఆగిపోవడం వల్ల వారి కుటుంబం ఆర్థికంగా చితికి పోవడం జరుగుతున్నది. తక్షణం ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టి సారించి చిన్నచిన్న పనులు చేసుకునే వీరిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది అని పలువురు కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నులిపురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం

- ఆరోగ్య, పంచాయతీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం
- ఎంపీడీవో రామకృష్ణ

నవతెలంగాణ-పినపాక

నులి పురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, జూన్ 20న జిల్లాలో ఉన్న 1నుంచి 19 సంవత్సరాల వయసు లోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తామని డాక్టర్ శృతి తెలిపారు. గురువారం పినపాక మండలం రైతు వేదికలో ఎంపీపీ గుమ్మడి గాంధీ, ఎంపీడీవో రామకృష్ణ అధ్యక్షతన ఆశాలు, అంగన్వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నులి పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో సమీక్షించారు. నులి పురుగులు చాలా ప్రమాదకరమని, వీటితో రక్తహీనతతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, వీటిని నివారిస్తే ఆరోగ్యంగా వుండవచ్చున్నారు. నులి పురుగుల నియంత్రణ కీలకమైన అంశమని, దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వారికి కేటాయించిన విధులను సమన్వయంతో కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. జూన్ 20న జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఎయిడెడ్, ప్రయివ్రేట్ పాఠశాలలో, జూనియర్ కళాశాలల్లో అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. పూర్తి స్థాయిలో పురుగుల నివారణ మాత్రలను అందుబాటులో ఉంచుకున్నామని, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు,



ప్రధానోపాధ్యాయులు, ఇతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. 20న అనారోగ్య, ఇతర కారణాల వల్ల మాత్రలు వేసుకోని విద్యార్థులకు తప్పనిసరిగా 27న అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు, సీడీపీఓ జయలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. మహిళ దుర్మరణం..

- మరో మహిళకు తీవ్ర గాయాలు

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

ట్రాక్టర్ బోల్తాపడ్డ ఘటనలో ఓ ఆదివాసీ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా.. మరో మహిళకు తీవ్ర గాయాలయిన ఘటన మండల పరిధి మొండి కట్ట శివారు ప్రాంతంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్ గఢ్ రాష్ట్రం, సుకుమా జిల్లా, కుంట మండలం కొండమరకకు చెందిన పదిమంది ఆదివాసీలు భద్రాద్రి జిల్లా ఆళ్లపల్లి మండలం ఓ శుభకార్యానికి ట్రాక్టర్ పై వెళ్లి, స్వగ్రామానికి తిరుగు ప్రయాణంలో మొండి కట్ట మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి పడిపోయింది. ట్రాక్టర్ లో ప్రయాణిస్తున్న మడివి బండి (35) అక్కడికక్కడే మృతి చెందగా.. మరో మహిళ మడివి మోయకు తీవ్ర గాయాలు అయ్యాయి. మృతదేహం తోపాటు పాటు క్షతగాత్రురాలుని పాల్వంచ ఏరియా వైద్యశాలకు తరలించారు. గాయపడ్డ మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. డ్రైవర్ మద్యం మత్తులో ట్రాక్టర్ నడపడం వల్లే ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. కొందరికి స్వల్ప గాయాలు అయినట్లు సమాచారం.



కోడుగుడ్ల పంపిణీపై..
కోమట్లగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో విచారణ



'నవతెలంగాణ' ఎఫెక్ట్

నవతెలంగాణ-గంగారం

మహబూబాబాద్ జిల్లా గంగారం మండల కేంద్రంలోని కోమట్లగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో పాడైపోయిన కోడిగుడ్లను పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు పంపిణీ చేయడంతో ఈనెల 12న 'అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిపోయిన కోడిగుడ్లు' అనే శీర్షిక 'నవతెలంగాణ'లో వార్త ప్రచురితమైంది. దానిపై ఐసీడీఎస్ అధికారులు విచారణకు ఆదేశించడంతో గురువారం సూపర్‌వైజర్ రామలక్ష్మీ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకుని సెంటర్ పరిధిలోని నలుగురు బాలింతల సమక్షంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గుడ్లను పరిశీలించి వేసవి ఎండల వేడికి గుడ్లు పాడైపోయాయన్నారు. బాలింతలకు గుడ్లు, ఇతర పోషక ఆహార పదార్థాలు పంపిణీ చేసే ముందు అంగన్‌వాడీ టీచర్లు పరిశీలించి నాణ్యమైన వాటినే పంపిణీ చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

పిడుగుపాటుకు పాడి ఆవు మృత్యువాత

నవతెలంగాణ-కేశంపేట

రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల పరిధిలోని బొదునంపల్లి గ్రామశివారులో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షంతో పాటు పిడుగు పడటంతో గ్రామానికి చెందిన ఎన్నం కృష్ణారెడ్డికి చెందిన పాడి ఆవు మృత్యువాత పడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ పొలంలో పశువులు మేపుతుండగా ఒక్కసారిగా పిడుగు పడింది. పక్కనే ఉన్న రైతు కృష్ణారెడ్డికి తృటిలో ప్రమాదం తప్పింది. కండ్ల ముందే జరిగిన సంఘటన చూసి రైతు ఆవును పట్టుకుని కన్నీరు మున్నీరయ్యాడు. బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



ప్రహరీ కూలి ముగ్గురు కూలీలు మృతి

- పునాది తీస్తుండగా ఘటన

నవతెలంగాణ-నస్పూర్



నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో ప్రహరీ గోడ కూలి ముగ్గురు భవన నిర్మాణ కార్మికులు మృతిచెందారు. ఈ విషాద ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలానికి చెందిన బాపురం శంకర్(42), ఎనంక హనుమంతు(45), గోలేం పోశం(60) భవన నిర్మాణ కూలీలుగా పనిచేస్తున్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆస్పత్రి నిర్మాణ పనుల్లో కార్మికులు నిమగ్నమవ్వగా.. పక్కన ఉన్న ప్రహరీ గోడ ఒక్కసారిగా కూలింది. దీంతో ముగ్గురు కూలీలు శిథిలాల కింద చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను వెలికి తీసి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని కమిషనర్ శ్రీనివాస్ పరిశీలించారు. సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేస్తామన్నారు. ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రి పరిసరాల్లో కార్మికుల కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

మంత్రాల నెపంతో మహిళపై గొడ్డలితో దాడి

నవతెలంగాణ-జనగామ డెస్క్



మంత్రాల నెపంతో ఓ మహిళపై గొడ్డలితో దాడి చేసి గాయపరిచిన ఘటన జనగామ జిల్లా నర్మెట మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్మెట మండల కేంద్రంలోని యాదవ కాలనీకి చెందిన నక్కల రవి తండ్రి పోచయ్య కుటుంబ సభ్యులు కొద్ది రోజులుగా అనారోగ్యం పాలవుతున్నారు. వారి పాలోళ్లయిన నక్కల సత్తమ్మ-గట్టయ్య దంపతులు మంత్రాలు చేస్తున్నారనే అనుమానంతో బుధవారం రాత్రి రవి.. సత్తెమ్మపై గొడ్డలితో దాడి చేసి గాయపరిచాడు. ప్రస్తుతం ఆమె వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. సత్తెమ్మ కుమారుడు అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

వీవీపీ నర్సింగ్ ఉద్యోగులకు
రెండు రోజుల్లో పదోన్నతుల ప్రక్రియ

- టీయుఎంహెచ్ఇయూకు కమిషనర్ హామీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) నర్సింగ్ ఉద్యోగులకు రెండు రోజుల్లో పదోన్నతుల ప్రక్రియ చేపడతామని టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ హామీ ఇచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని కోఠిలోని కార్యాలయంలో కమిషనర్ ను తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ-సీఐటీయూ అనుబంధం) నాయకులు కలిశారు. పరిషత్ లో పని చేస్తున్న నర్సింగ్ సిబ్బందికి ప్రమోషన్లు ఇవ్వాలని చాలా కాలంగా ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. 1999 బ్యాచ్ నుంచి ఇప్పటి వరకు నర్సింగ్ సిబ్బందికి పదోన్నతులు కల్పించలేదు. చాలామంది పదోన్నతికి అర్హత ఉండి అది పొందకుండానే పదవీ విరమణ చేశారని గుర్తుచేశారు. ప్రమోషన్ల సమస్యపై గతంలో ఆందోళన చేస్తే ఎన్నికల తర్వాత పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో నర్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూన్ 11న రాష్ట్రవ్యాప్తంగా ఆస్పత్రుల వద్ద ప్లకార్డ్స్ ప్రదర్శించి ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు వినతిపత్రాలు సమర్పించారు. దీనిని సహించని సర్కారు మెమోలు జారీ చేసింది. ముఖ్యంగా ఘట్ కేసర్, మల్కాజిగిరి ఆస్పత్రుల్లో పని చేసే నర్సింగ్ ఉద్యోగులకు మెమోలు ఇవ్వడంతో ఉద్యోగులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయంలో కమిషనర్ మెమోలను వెనక్కి తీసుకోవాలని నాయకులు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ, అనుమతి లేకుండా భవిష్యత్తులో ఎలాంటి కార్యక్రమాలు చేయొద్దని సూచించారు. జారీ చేసిన మెమోలను ఉపసంహరించుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో నాయకులు కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కమిషనర్ ను కలిసిన వారిలో టీయుఎంహెచ్ఇయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూపాల్, అధ్యక్షులు పసి యొద్దీన్, ప్రధాన కార్యదర్శి యాదా నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.బలరామ్, నర్సింగ్ ఫెడరేషన్ నాయకులు వి.భూలక్ష్మి, సువర్ణలత, బాలు నాయక్ తదితరులున్నారు.

ముంచెత్తిన నకిలీ పత్తి విత్తనాలు

ఇప్పటికే క్వింటాళ్ల కొద్దీ పట్టుకున్న పోలీసులు

- దొడ్డిదారిన పల్లెలకూ నకిలీ ప్యాకెట్లు
- బైక్‌లు, ఎద్దుల బండ్లపై తరలింపు
- పోలీసుల తనిఖీల్లో నిషేధిత బీటీ-3పత్తి విత్తన ప్యాకెట్లు
- మరోవైపు డిమాండ్ ఉన్న పత్తివిత్తన ప్యాకెట్ల కృత్రిమ కొరత
- వ్యాపారుల మాయాజాలంతో ధరలు పైపైకి..
- పలుచోట్ల వ్యవసాయాధికారుల నిర్లక్ష్యం.. నష్టపోతున్న రైతులు



రామగుండం కమిషనరేట్‌లో... పట్టుబడ్డ పత్తి విత్తనాలు, నిందితుడు అరెస్టు



కరీంనగర్ కమిషనరేట్‌లో పట్టుబడిన పత్తివిత్తనాలు, నిందితుల అరెస్టు

వ్యాపారులు మాయాజాలం సృష్టిస్తున్నారు. ఓ వైపు డిమాండ్ ఉన్న పత్తి విత్తన ప్యాకెట్ల కృత్రిమ కొరత ఏర్పడేలా చేస్తుండగా.. మరోవైపు నకిలీ విత్తనాలు సరిహద్దులు దాటి రాష్ట్రంలో రైతుల చెంతకు చేరుతున్నాయి.. ప్రతి ఏడాదిలాగే నకిలీ విత్తనాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అధికారులు, పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టి క్వింటాళ్ల కొద్దీ నకిలీ విత్తనాలను పట్టుకుంటున్నా.. కొత్త దారుల్లో అవి రవాణా అవుతూనే ఉన్నాయి. నిషేధిత బీటీ-3 సహా ఊరూ పేరూ లేకుండా నకిలీ ధ్రువీకరణ వివరాలతో ముద్రించిన పత్తి విత్తనాలు సరి'హద్దు'లు దాటి రాష్ట్రంలోని కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు చేరాయి. ప్రధానంగా గుజరాత్, మహారాష్ట్ర నుంచి అక్రమార్కులు ఈ నకిలీ విత్తన ప్యాకెట్లను మంచిర్యాల, అటు ఆదిలాబాద్ బార్డర్లు దాటిస్తున్నారు. అక్కడి నుంచి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. అనుమానం రాకుండా బైక్‌లపైనా, ఎడ్ల బండ్లపైనా తరలిస్తున్నారు. విశ్వసనీయ, పక్కా సమాచారంతో పోలీసులు చేసే తనిఖీల్లో పట్టుబడుతున్న పత్తివిత్తన ప్యాకెట్లే క్వింటాళ్లలో ఉంటుంటే.. వారి కండ్లుగప్పి పల్లెలకు చేరిన విత్తనాలు ఏ స్థాయిలో ఉంటాయో బేరీజు వేసుకోవచ్చు. ఇదిలా వుంటే... డిమాండ్ ఉన్న పత్తి విత్తన ప్యాకెట్ల కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు తమ మాయాజాలంతో ధరలు అమాంతం పెంచుతూ బ్లాక్‌లో విక్రయిస్తూ రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా, పలుచోట్ల వ్యవసాయాధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారు. దీంతో దళారీలు ఆడిందే ఆటగా తయారైంది. నకిలీ విత్తనాల విక్రయాలు రాష్ట్రంలో బహిరంగంగా జరుగుతున్నా పట్టుబడింది కొద్దిగా మాత్రమే. ఇంకా కోట్ల రూపాయల విత్తనాలు లక్షలాది మంది రైతులకు అంటగట్టినట్టు తెలిసింది.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో పత్తి సాగు చేసేందుకు రైతులు విత్తనాల కోసం దుకాణాలకు వెళ్తే తాము కోరుకున్న కంపెనీలవి ఎమ్మార్పీకన్నా అధిక ధర పెట్టాల్సి వస్తోంది. ఎక్కువ మంది ఒకే రకం విత్తనాలు అడుగుతుండటంతో వ్యాపారులు పత్తి విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తూ కర్షకులను ఆగం చేస్తున్నారు. నో స్టాక్ బోర్డులు పెడుతున్నారు. అవే రకం కావాలని రైతులు బతిమిలాడితే ఎక్కువ ధరకు తెప్పించగలమని నమ్మించి రెట్టింపు కన్నా అధిక ధర వసూలు చేస్తున్నారు. రూ.860కి లభించే విత్తనాల ప్యాకెట్‌ను రూ.1600కు అమ్ముతున్నారు. కొన్ని చోట్ల కొన్ని కంపెనీల విత్తనాల ధర రూ.2 వేల వరకు పలుకుతోంది.

గతేడాది రూ.14వేలు పలికిన క్వింటా పత్తి..

పదేండ్ల కిందటి సాగు కంటే ప్రస్తుతం పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందనే చెప్పొచ్చు. రాష్ట్రంలో ఈసారి 60లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా. ధర ఎక్కువ ఉండటంతో రైతులు పత్తిపైనే మక్కువ చూపారు. ప్రభుత్వం 1.20కోట్ల విత్తనాల ప్యాకెట్లను అందుబాటులో ఉంచింది. అయినా నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు గుజరాత్, మహారాష్ట్ర నుంచి దళారుల ద్వారా రైతులకు చేరడం గమనార్హం. ఉదాహరణకు.. 2014కంటే ముందు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సుమారు 4లక్షల ఎకరాల్లో సాగైన పత్తి నేడు కనీసం లక్షా 50వేల ఎకరాలు కూడా దాటడం లేదు. అందుకు కారణాల్లేకపోలేదు. సాగునీటి రంగం అభివృద్ధి చెంది ప్రస్తుతం మెట్ట ప్రాంతాల్లో కూడా నీటి లభ్యత పెరిగింది. దీంతో ఒకప్పుడు 3లక్షలు కూడా సాగవని వరి సాగు విస్తీర్ణం నేడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12లక్షల వరకు సాగవుతోంది. దీంతో ఉన్న కొద్దిపాటి విస్తీర్ణంలోనే పత్తి వేస్తున్నారు. అయితే, 2022 నుంచి పత్తి క్వింటా ధర అమాంతం పెరిగింది. గతంలో క్వింటా పత్తి రూ.4వేల నుంచి రూ.6వేలు కూడా పలికేది కాదు. 2022లో ఏకంగా రూ.18వేలకు క్వింటా పత్తిని వ్యాపారులు కొనుగోలు చేశారు. గతేడాది రూ.14వేల వరకూ పలకడంతో ఈ ఏడాది పత్తి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు విత్తనాల కృత్రిమ కొరత సృష్టించడం, అడ్డదారుల్లో నిషేధిత బీటీ-3 పత్తి విత్తన ప్యాకెట్లు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిసింది.

వరి విత్తనాలూ సక్రమమేనా?

గతంలో మానకొండూర్ సీడ్స్ కంపెనీలో నిర్వహించిన తనిఖీల్లో వరి విత్తనాల నిల్వలో 796 బ్యాగుల తేడా రాగా.. హుజూరాబాద్ మండలం సింగాపూర్ సీడ్‌ప్లాంట్‌లో 350 క్వింటాళ్లను రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో కేసులు నమోదు చేశారు. దమ్మక్కపేట సమీపంలోని సీడ్ ప్లాంట్‌లో విత్తన ధ్రువీకరణ లేకుండా గతంలో జారీ చేసిన లేబుళ్ల(ట్యాగులు) అంటించి విత్తన సంచులను మార్కెటింగ్ చేస్తున్నట్టు తేలింది. జేజీఎల్‌కు సంబంధించి జారీ చేసిన లేబుళ్లను బీపీటీ విత్తన సంచులకు వినియోగించడం అధికారుల పర్యవేక్షణ తీరును చాటుతోంది. ఈ పరిస్థితులను చూస్తుంటే వరి విత్తనాలు కూడా సక్రమమేనా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన నకిలీ విత్తనాలు, నమోదైన కేసుల వివరాలు

దుర్శేడ్ తనిఖీల్లో 60కిలోల పట్టివేత

ఈనెల 7న పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలో కరీంనగర్ టాస్క్‌ఫోర్స్, స్పెషల్‌బ్రాంచ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మంచిర్యాల జిల్లా వారం గ్రామంలో నివాసం ఉంటున్న చందు నాగేశ్వరరావు తన బైక్‌పై రూ.1.20లక్షల విలువజేసే 60కేజీల నకిలీ పత్తి విత్తనాలను తరలిస్తుండగా పట్టుకున్నారు.

ఎడ్ల బండిపై తరలిస్తూ..

ఈ నెల 5న రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లా వేమనపల్లి ఫెర్రీ పాయింట్ వద్ద ఎద్దుల బండిపై తరలిస్తున్న 2.5క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు, స్థానిక మండల వ్యవసాయాధికారితో కలిసి పట్టుకున్నారు. మహారాష్ట్ర నుంచి సిరోంచ నుంచి సుమారు రూ.6.75లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలు రాష్ట్ర సరిహద్దులు దాటాయన్న పక్కా సమాచారం మేరకు నిందితులను అరెస్టు చేశారు.

అనుమానం వచ్చి తనిఖీ చేయగా..

నమ్మదగిన సమాచారం మేరకు రామగుండం పోలీసు కమిషరేట్ పరిధిలోని సీపీ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంజయ్, ఎస్ఐ లచ్చన్న తన సిబ్బందితో మంచిర్యాల జోన్‌లోని హాజీపూర్ పరిధిలోని ముల్కల వద్ద తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో జగిత్యాల జిల్లా కోరుట్ల నుంచి మంచిర్యాల వైపుగా బైక్‌పై సంచులతో ఇద్దరు వస్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేయగా సంచుల్లో రూ.1.80లక్షల విలువజేసే 60కిలోల నకిలీ పత్తి విత్తనాలను గుర్తించారు.

మద్దతు ధరకు చట్టబద్ధత
రుణ విమోచన చట్టాలను సాధించుకోవాలి

అతుల్ కుమార్ అంజాన్ సంస్మరణ సభలో వక్తలు



నవతెలంగాణ- హిమాయత్‌నగర్

రైతుల పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర లభించే విధంగా మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు, రుణ విమోచన చట్టాలను సాధించుకోవాలి.. అప్పుడే అవిశ్రాంత రైతు ఉద్యమ నాయకులు, ఏఐకెఎస్ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్ ఆశయం నెరవేరినట్టు అని రైతు సంఘాల నాయకులు, వ్యవసాయరంగ శాస్త్రవేత్తలు అన్నారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అతుల్ కుమార్ అంజాన్ సంస్మరణ సభ నిర్వహించారు.

ఏఐకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంత్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సభకు ప్రధాన వక్తగా హాజరైన ఏఐకెఎస్ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య మాట్లాడుతూ.. అతుల్ కుమార్ మరణం భారత రైతాంగంతో పాటు ఏఐకెఎస్‌కు తీరని లోటన్నారు. ఔరంగబాద్‌లో జరిగిన ఏఐకెఎస్ జాతీయ సభల సందర్భంగా అప్పటి అధ్యక్షులు చంద్రప్పను, ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్.. దేశంలో అఖిల భారత కిసాన్ సభ (ఏఐకెఎస్)కు కోటి మంది రైతుల సభ్యత్వం, లక్ష గ్రామాల్లో శాఖల ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారని గుర్తు చేశారు. మహా నాయకులు చేసిన ఈ ఆలోచనను ఏఐకెఎస్ సభ్యులుగా కలిసి కట్టుగా కృషి చేసి సాధించుకుందామని పిలుపునిచ్చారు.

ఏఐకెఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ.. రైతుల సమస్యలను తేటతెల్లంగా పరిష్కరించడానికి, అందుకు కావాల్సిన కార్యాచరణను రూపొందించడంలో అతుల్ కుమార్‌ను మించిన నాయకుడు లేడన్నారు. రైతు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సాగిన రైతుల ఐక్య ఉద్యమంలో అతుల్ పోషించిన క్రియాశీలకపాత్ర మరువలేనిదన్నారు.

వ్యవసాయరంగ శాస్త్రవేత్త దొంతి నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. స్వామినాథన్ కమిషన్ సభ్యుల్లో ఒక్కరైన అతుల్ కుమార్ ఆ కమిటీ నివేదిక తయారీలో పోషించిన భూమిక కారణంగా రైతులకు ఎంతో మేలు చేసే అంశాలు పొందుపర్చారని చెప్పారు. దీనిని వివరించి చెప్పాల్సిన బాధ్యత ఏఐఏఎస్ నాయకులదేనన్నారు. ఎకరా వరి సాగు చేయాలంటే 2018లో రూ.34 వేలుగా ఉన్న ఖర్చు 2021 నాటికి రూ.44 వేలకు చేరిందన్నారు. అందుకు అనుగుణంగా మద్దతు ధర ఇవ్వకుండా పాలకులు సమ్మాన్ నిధి, రైతు బంధు, రైతు భరోసాల పేరుతో రైతులను మభ్యపెడుతూ అప్పుల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగ శాస్త్రవేత్త సోమమర్ల మాట్లాడుతూ.. రైతులకు గిట్టుబాటు ధర లభించినప్పుడే వారి జీవితాలు బాగుపడుతాయని, వీటిని సాధించేందుకు ఏఐకెఎస్ నాయకులు అతుల్ కుమార్ తన జీవితాంతం అవిశ్రాంతంగా ఉద్యమించారన్నారు. గతంలో కమ్యూనిస్టు పార్టీలు జరిపిన పోరాటాల కారణంగా చిన్న చిన్న రైతులకు కొంత భూమి దక్కిందని, భూ సంస్కరణలు పరిపూర్ణమైనప్పుడే భూ సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ మాట్లాడతూ.. అతుల్ కుమార్ అంజాన్ విద్యార్థి, రైతు ఉద్యమ నేతగా జీవితాంతం అనేక పోరాటాల్లో కీలక భూమిక పోషించారని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ఏఐకెఎస్ ప్రతి నాయకుడూ మరో అతుల్ కుమార్ అంజాన్ మాదిరిగా తయారు కావాలని ఆకాంక్షించారు. ఈ సభలో తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్య నారాయణ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు కొల్లూరి రాజయ్య, ప్రభులింగం, దొండపాటి రమేష్, కార్యదర్శులు గోవింద్, దేవిదాస్, వార్ల వెంకటయ్య, రామకృష్ణారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులోకి దూకి ఇద్దరు పిల్లలతో సహా
తల్లి ఆత్మహత్యాయత్నం

- ఇద్దరిని రక్షించిన పోలీసులు.. ఒకరు గల్లంతు
- సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ఘటన

నవతెలంగాణ-అమీన్‌పూర్



సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో దారుణం చోటు చేసుకుంది. గురువారం తెల్లవారుజామున ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి అమీన్‌పూర్ పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. గమనించిన పెట్రోలింగ్ పోలీసులు వెంటనే చెరువులోకి దూకి ఇద్దరిని రక్షించగా, ఒకరు గల్లంతయ్యారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. అమీన్‌పూర్ ప్రాంతానికి చెందిన విద్యాధర్ రెడ్డి, శ్వేత దంపతులు ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే భర్త విద్యాధర్ రెడ్డి వరంగల్ వెళ్లడంతో భార్య శ్వేత తన ఇద్దరు పిల్లలను తీసుకొని అమీన్‌పూర్ పెద్ద చెరువులోకి దూకింది. అయితే పెట్రోలింగ్ పోలీసులు మూడేండ్ల పాప శ్రీహ, తల్లి శ్వేతను రక్షించారు. కాగా కొడుకు శ్రీ హన్స్ చెరువులో మునిగిపోయాడు. శ్రీ హన్స్ కోసం పెట్రోలింగ్ పోలీసులు గాలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.



ఎమ్మెల్సీగా
తీన్మార్ మల్లన్న, నవీన్‌రెడ్డి ప్రమాణం

- పలువురు నేతలు, ఎమ్మెల్యేలు హాజరు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన కాంగ్రెస్ నేత తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైనా బీఆర్ఎస్ నేత నవీన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని శాసనమండలిలో మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తీన్మార్ మల్లన్న, నవీన్‌రెడ్డితో వేర్వేరుగా ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాసగౌడ్, నిరంజన్‌రెడ్డి, బసవరాజు సారయ్య, నాయకులు బండ కృష్ణమోహన్‌రెడ్డి, అంజయ్యతోపాటు పలువురు ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



బ్లాస్టింగ్స్‌తో ఇండ్లకు పగుళ్లు

- ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తాం : జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా
- ఓపెన్ కాస్ట్‌లో దెబ్బతిన్న ఇండ్ల పరిశీలన

నవతెలంగాణ-భూపాలపల్లి

భూపాలపల్లి మండలం గుర్రంపేట ఎస్సీ కాలనీ ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తామని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. గురువారం జయశంకర్-భూపాలపల్లి జిల్లాలోని గుర్రంపేట గ్రామ సమీపంలోని సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్‌లో జరుగుతున్న బ్లాస్టింగ్ వల్ల పెద్దపెద్ద రాళ్లు వచ్చి ఇండ్ల మీద పడుతున్నాయని, ఇండ్లకు పగుళు ఏర్పడుతున్నాయని, ఎప్పుడు ఏమవుతుందో తెలియక భయబ్రాంతులకు గురవుతూ జీవనం సాగించాల్సి వస్తోందంటూ గ్రామ శివారులోని ఎస్సీ కాలనీ ప్రజలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో గ్రామ సందర్శనకు వచ్చిన కలెక్టర్.. ఎస్సీ కాలనీలో బాంబు పేలుళ్లతో దెబ్బతిన్న ఇండ్లను పరిశీలించారు. బ్లాస్టింగ్ వల్ల ఇండ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయా.. లేదా.. అని సింగరేణి అధికారులను ఆయన అడగగా.. డేంజర్ మార్కుకు అవతల బ్లాస్టింగ్ చేస్తున్నామని, నెగిటివ్ ప్రభావం లేదని సింగరేణి అధికారులు వివరించారు. దానిపై కలెక్టర్ స్పందిస్తూ మనిషికి భౌతికంగా కలిగే అనుభవం వేరే ఉంటుందని, మీరు బ్లాస్టింగ్ చేయకపోతే ఇక్కడ ఎందుకు పగుళ్లు వస్తున్నాయని అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి ఓపెన్ కాస్ట్‌లో బాంబు పేలుళ్ల సమయంలో బ్లాస్టింగ్ ప్రభావం ఎంతవరకు ఉంటుంది, ఏ మేరకు నష్టం వాటిల్లుతుందో మూడు రోజులపాటు పరిశీలించి అంచనా వేయాలని.. సంబంధిత సింగరేణి అధికారులు, ఆర్డీఓ, ఎంపీడీఓ, ఎంపీఓ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం ఆయన గ్రామ ప్రజలతో మాట్లాడుతూ.. ఓపెన్ కాస్ట్ వల్ల జరుగుతున్న నష్టాన్ని అధికారులతో అంచనా వేసి సింగరేణి సంస్థ ద్వారా నష్టం వాటిల్లిన ప్రతి ఇంటికి, అలాగే పంటలకు, పశువులకు అన్నింటికీ నష్టపరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఓపెన్ కాస్ట్ పరిధిలో భూములు కోల్పోతున్న గడ్డిగాని పల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని ఇండ్లలో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో జరుగుతున్న కొలతలను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. నిర్దేశిత కొలతల ప్రకారం నష్టపరిహారం అందించి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద గ్రామాన్ని తరలించి అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ మంగిలాల్, సింగరేణి జీఎం హుస్సేన్, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

22న జీఎస్టీ కౌన్సిల్ మీటింగ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)కు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే జీఎస్టీ కౌన్సిల్ సమావేశం ఈనెల 22న నిర్వహించనున్నారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఆయా రాష్ట్రాలకు చెందిన ఆర్థిక మంత్రులు హాజరుకానున్నట్టు జీఎస్టీ కౌన్సిల్ ట్విట్టర్ (ఎక్స్)లో వెల్లడించింది. అయితే, ఈ భేటీలో ఏయే అంశాలపై చర్చించ నున్నారో మాత్రం వెల్లడించలేదు. గతేడాది అక్టోబర్ 7న చివరిసారిగా జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగిన విషయం తెలిసిందే. అందులో క్యాసినో, గుర్రపు పందేలు, ఆన్‌లైన్ గేమింగ్‌కు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ తరువాత జరగాల్సిన కౌన్సిల్ మీటింగ్‌ను, కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకూ వాయిదా వేశారు. ఇటీవల కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో కేంద్ర ఆర్థిక మంత్రిగా మరోసారి నిర్మలా సీతారామన్ బాధ్యతలు చేపట్టారు. దీంతో తదుపరి కౌన్సిల్ మీటింగ్‌ను నిర్వహించనున్నారు.

సంగీతా బావి...

చిన్నపట్టణంలో పుట్టి పెరిగినా పెద్ద కలలు కన్నారు. టెక్నికల్ రంగంలో తన కంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించు కున్నారు. ఏ సంస్థతో కలిసి పని చేసినా ప్రారంభం నుండి దాని విజయం చూసే వరకు అహర్నిశలూ శ్రమిస్తున్నారు. నోకియాలో కొత్త ఫీచర్స్ ప్రారంభించడంలో కీలక పాత్ర పోషించారు. పురుషాధిక్యత రాజ్యమేలుతున్న ఈ రంగంలో ఎన్నో విభాగాలకు నాయకత్వం వహిస్తున్నారు. ఎన్నో టీమ్‌లను విజయవంతంగా నడిపిస్తున్నారు. ఈ రంగంలో తిరిగి వర్క్‌లోకి రావాలనుకుంటున్న మహిళల కోసం ఓ ప్రత్యేక ప్రణాళికను రూపొందించిన ఆమెతో సంభాషణ....

మహిళా నాయకులను ప్రోత్సహిస్తాం



మీ బాల్యం ఎలా గడిచింది..?

మహారాష్ట్రలోని షోలాపూర్ అనే చిన్న పట్టణంలో పుట్టి పెరిగాను. చిన్నతనం నుండి పెద్ద కలలు కంటుండేదాన్ని. మా నాన్న సంప్రదాయంగా ఉన్నప్పటికీ పిల్లల విషయంలో ఉదారంగా ఉండేవారు. మా అమ్మ మాకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చేది. దాంతో రెండు భిన్నమైన ఆలోచనల మధ్య పెరిగాను. అయితే నా జీవితంలో చాలా ప్రభావం చూపిన వ్యక్తి మా అమ్మమ్మ. ఆమె నాల్గవ తరగతి వరకు చదువుకుంది. చాలా చిన్న వయసులోనే భర్తను కోల్పోయింది. ఆమె నాతో ఎప్పుడూ 'మీరు ఏం చేసినా, మీకు ఆర్థిక స్వేచ్ఛ ఉండాలి' అని చెప్పేది. మా ఇంట్లో డాక్టర్లు ఎక్కువగా ఉండేవారు. నేను దానికి భిన్నంగా ఇంజనీరింగ్ ఎంచుకున్నాను.

మీరు ఐటీ బూమ్ ప్రారంభంలో మీ కెరీర్‌ని ప్రారంభించినట్టున్నారు..?

మొదట వరంగల్‌లో ఎన్‌ఐటీలో కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో మేజర్‌గా చేరారు. టెక్ పరిశ్రమలో 24 ఏండ్ల పాటు కొనసాగాను. విప్రోలో కొద్ది కాలం పనిచేశాను. అప్పట్లో నోకియా మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తోంది. Symbian ఫోన్‌లతో, యూఎస్‌బీ, బ్లూటూత్ కోర్ స్టాక్‌తో సహా ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌లలో పని చేశాను. అలాగే ఫిన్‌లాండ్‌లో కూడా కొంత కాలం పని చేసి వచ్చాను. ఫిన్‌లాండ్‌లో యూఎస్‌బీ, బ్లూటూత్ ప్రాజెక్టుల్లో పని చేయడం వల్ల హార్డ్‌వేర్, అప్లికేషన్ లేయర్





ఫోక్స్‌తో సహా వివిధ బృందాలతో నేను సమన్వయం చేసుకున్నాను. ఒక ఇంజనీరింగ్ నేను ఉత్పత్తి నిర్వహణ పాత్రకు బాగా సరిపోతానని సంస్థ భావించింది. నాకు కొన్ని ప్రత్యేకమైన బాధ్యతలు ఇచ్చారు.

UIDAIకి ఎలా వచ్చారు..?

ఫిన్‌లాండ్‌లో పని చేస్తున్నప్పుడు బెంగళూరులో పెద్ద కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన చేశారు. అక్కడ ఉత్పత్తి నిర్వహణ బృందానికి నాయకత్వం వహించడానికి నేను భారతదేశానికి తిరిగి వచ్చాను. అదే సమయంలో UIDAI (యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) స్పేస్‌లో జరిగిన పరిణామాలను కూడా గమనిస్తుండేదాన్ని. దాంతో నా సొంత పరిశోధన చేయడం ప్రారంభించాను. దాని కోసం ఓ బ్లాక్ రాసుకునేదాన్ని. ఆ తర్వాత UIDAIలో పనిచేసేందుకు కార్పొరేట్ రంగానికి చెందిన వ్యక్తుల నందన్ నీలేకని నుండి సర్క్యులర్ వచ్చింది. వెంటనే అందులో భాగం కావాలనుకున్నాను.

UIDAIతో మీ అనుభవాన్ని వివరించగలరా?

ఇప్పుడు EkStep కోసం చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, ఆధార్ చీఫ్ ఆర్కిటెక్ట్ ప్రమోద్ నేను చాలా నేర్చుకున్నాను. UIDAIలో నోకియా పాత్ర పోషిస్తుందని నేను గ్రహించాను. కాబట్టి మేము మొబైల్ పరికరంతో మొదటి ఇంటిగ్రేటెడ్ ఫింగర్‌ప్రింట్ సెన్సార్‌ను ప్రారంభించాం. చాలా చిన్న వయసులోనే ఫిన్‌లాండ్‌లోని జట్టుకు నాయకత్వం వహించాను. అయితే ఆ ప్రాజెక్ట్ నిలిపివేయవలసి వచ్చింది. నేను దానిపై సుమారు రెండేండ్లు పనిచేశాను.

స్టార్టప్‌లతో మీ పని గురించి చెప్పండి?

భారతదేశంలో స్టార్టప్ వ్యాపారాన్ని ఇంక్యుబేట్ చేయడం కోసం ప్లేబుక్‌ను రూపొందించడంలో పనిచేసిన బృందంలో నేను భాగమయ్యాను. అది ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్‌కు మోడల్‌గా మారింది. కాబట్టి మేము మా ప్లేబుక్‌ని మిగిలిన మైక్రోసాఫ్ట్‌తో పంచుకున్నాము. గత మూడేండ్లుగా ఇది కొనసాగుతోంది.



మీ జీవితంలో విప్రో నుండి మైక్రోసాఫ్ట్ వరకు నిర్వహించిన క్షణాలు ఎలా అనిపించాయి?

నేను 0-టు-1 వ్యక్తిని. మొదలుపెట్టిన నాటి నుండి విజయం పొందే వరకు ప్రాజెక్ట్‌లపై పని చేస్తున్నాను. మైక్రోసాఫ్ట్‌లో నా అద్భుతమైన ప్రయాణం పదేండ్ల నుండి సాగుతోంది. ప్రధాన వాణిజ్య అంశాలపై దృష్టి సారించి భారతదేశం కోసం ISV-GTM ప్రోగ్రామ్‌ని స్థాపించాను. ఇంజనీరింగ్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, ప్రచారం, మార్కెటింగ్, కేటగిరీ మేనేజ్‌మెంట్ ఇలా ఒక దాని తర్వాత ఒక దానికి బాధ్యతలు చూసుకున్నాను.

ఎవరికైనా ఎంఎన్‌సీలో స్టార్టప్‌ని స్థాపించడం చాలా సవాలుతో కూడుకున్న పని. సత్య(నాదెళ్ల)తో సహా భారతదేశం, ఆసియా, అలాగే ప్రపంచ స్థాయిలలోని నాయకత్వం మా చొరవకు మద్దతు ఇచ్చింది. ఫ్లేబుక్ రచనలను ప్రయోగాలు చేసి నిరూపించమని వారు మమ్మల్ని ప్రోత్సహించారు.

మీ ప్రస్తుత బాధ్యతలు ఏమిటి?

ప్రస్తుతం నేను మొత్తం డిజిటల్ స్థానిక వ్యాపార యూనిట్‌ను పర్యవేక్షిస్తున్నాను. ఇంతకు ముందు ప్రారంభ దశ స్టార్టప్‌లపై దృష్టి సారించి స్టార్టప్ వ్యాపారాన్ని నిర్వహించాను. ఇప్పుడు ప్రారంభ దశ వెంచర్ల నుండి ఐపీఓలను లక్ష్యంగా చేసుకునే వారి వరకు విస్తరించి ఉన్నాయి. స్థూలంగా మా వద్ద మూడు ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ప్రారంభ దశ, పెరుగుదల, యునికార్న్ వెంచర్లు. వీటిలో భారతదేశంలో 100 కంటే ఎక్కువ యునికార్న్‌లు ఉన్నాయి. భారతదేశం, దక్షిణాసియా కోసం ఈ మొత్తం వ్యాపార యూనిట్ P&Lకి జవాబుదారీగా ఉన్నాను.

టెక్నికల్ రంగంలోకి వస్తున్నప్పటికీ చాలా మంది మహిళలు నాయకత్వ స్థాయికి రావడంలేదు దీనికి కారణం?

మహిళ కెరీర్ సైకిల్ పరిశీలిస్తే పదోన్నతి పొందడం, మరిన్ని బాధ్యతలు తీసుకోవడం వంటి సరైన స్థాయికి వచ్చే సరికి వివాహం చేసుకుని పిల్లలను కలిగి ఉంటారు. దాంతో అనివార్యంగా కొంత విరామం అవసరమవుతుంది. అయితే నేడు మైక్రోసాఫ్ట్ ఇండియా లీడర్‌షిప్ టీమ్ మిక్స్‌ని చూస్తే పురుషులతో పోలిస్తే మహిళలే ఎక్కువ మంది ఉన్నారు.

మీరు ఈ కార్యక్రమాల గురించి వివరించగలరా?

మాతృత్వం లేదా వివిధ కారణాల వల్ల విరామం తీసుకున్న మహిళా నాయకులను మేము ప్రోత్సహిస్తాం. కెరీర్ పరంగా వారు ఏమి ఆలోచిస్తున్నారో అర్థం చేసుకోవడానికి మేము వారిని కలుస్తాం. మైక్రోసాఫ్ట్ పూర్వ విద్యార్థులు, విరామం తీసుకున్న మహిళలు, ప్రాథమికంగా కార్పొరేట్ జీవితాల్లోకి తిరిగి రావాలనుకునే ఇతర మహిళా నాయకులతో చాలా లోతుగా నిమగ్నమయ్యే ప్రోగ్రామ్ ప్లాన్ చేశాం.

ఎవరికి అవసరం?

ముఖ్యంగా మహిళల విషయంలో క్యాల్షియం పాత్ర చాలా ప్రధానమైంది. 25 నుంచి 50 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళలకు రోజుకు 1,000 ఎంజీ కాల్షియం అవసరం. 50 ఏండ్లు పైబడిన మహిళలయితే.. రోజుకు 1,000-1,200 ఎంజీ వరకు క్యాల్షియం తీసుకోవాల్సి ఉంటుంది. 25 నుంచి 70 ఏండ్లున్న పురుషులకు రోజుకు 1,000 ఎంజీ కాల్షియం కావాల్సి ఉంటుంది.



ఆదే 70 ఏండ్లు పైబడిన వాళ్ళకైతే రోజుకు 1,000-1,200 ఎంజీ కాల్షియం అవసరం. క్యాల్షియం ట్యాబ్లెట్స్ పరగడుపున అస్సలు వేసుకోకూడదు. కచ్చితంగా భోజనం తర్వాతనే తీసుకోవాలి. అయితే క్యాల్షియం ట్యాబ్లెట్స్‌లో రెండురకాలుంటాయి.

వీటిలో క్యాల్షియం మాత్రమే ఉండే ట్యాబ్లెట్స్. ఒకరకం అయితే , క్యాల్షియం తోపాటు విటమిన్ డి ఉండే టాబ్లెట్స్ మరోరకం. ప్రతి మనిషికి ప్రతిరోజూ రెండువేల ఇంటర్నేషనల్ యూనిట్ల విటమిన్ డి అవసరమవుతుంది.

క్యాల్షియం ట్యాబ్లెట్ మాత్రమే వాడుతున్నప్పుడు డి విటమిన్ లోపం ఉంటే ఆ ట్యాబ్లెట్ పనిచేయదు. కాబట్టి విటమిన్ డి పరీక్ష చేయించుకొని నార్మల్ ఉంటే క్యాల్షియం ట్యాబ్లెట్ ఒక్కటే వాడొచ్చు.

ఎముకలు బలహీనంగా ఉండేవాళ్ళు మాత్రమే క్యాల్షియం ట్యాబ్లెట్స్ వాడాల్సి ఉంటుంది.

మోనోపాజ్ వయసులో ఉన్న మహిళలకు మాత్రమే క్యాల్షియం ట్యాబ్లెట్స్ వాడాల్సి ఉంటుంది. ఇతరులు కొన్ని సందర్భాల్లో మాత్రమే వాడాల్సి వస్తుందని నిపుణులు చెబుతున్నారు.

జులై రెండో వారంలో రాష్ట్ర బడ్జెట్

(మొదటిపేజి తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో శ్వేతపత్రాన్ని ప్రకటించింది. ఈ అప్పుకు నెలకు రూ.1,700 కోట్ల నుంచి రూ.1,800 కోట్ల వరకూ వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది. వెరసి ఖజానాపై విపరీతమైన భారం పడుతోంది. ఇదిగాక ఆగస్టు 15 నాటికి రైతులకు రుణమాఫీ చేసి తీరాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. 'స్థానిక సంస్థల ఎన్నికల' నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ దాన్ని ఆపకూడదని ఆయన భావిస్తున్నారు. ఇందుకోసం రూ.35 వేల కోట్లు కావాలని అధికారులు సీఎంకు తెలిపారు. ఇలాంటి ప్రతిష్టాత్మక పథకాలకు పూర్తి స్థాయి బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సి ఉంటుంది. ఆసరా పింఛన్లు రూ.4 వేలకు పెంపు, రైతు భరోసా తదితరాలను అమలు చేయటంలో జాప్యం చోటు చేసుకోవటంతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ఒకింత గుర్రుగా ఉన్నారు. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఎనిమిది సీట్లు గెలవటానికి ఈ అంశాలు కొంతలో కొంత ఉపయోగపడ్డాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వీలైనంత త్వరగా రైతు భరోసా, రైతు రుణ మాఫీ హామీలను అమలు చేయటం ద్వారా 'స్థానిక సమరం'లో మరింతగా సత్తా చాటాలని సీఎం రేవంత్... తన సన్నిహితులతో చెప్పినట్టు సమాచారం. ఈ క్రమంలోనే ఈనెల 18న నిర్వహించబోయే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పూర్తి స్థాయి బడ్జెట్‌తోపాటు రైతు రుణమాఫీపై చర్చించి పలు కీలక నిర్ణయాలను వెలువరించనున్నారని ఓ ఉన్నతాధికారి వివరించారు. బడ్జెట్ కసరత్తులు అనుకున్నంత వేగంగా పూర్తయితే జులై రెండో వారంలో, లేదంటే ఆ నెల మూడో వారంలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే అవకాశముందని ఆయన అభిప్రాయపడ్డారు.

రాష్ట్రంలో మహిళాశక్తి క్యాంటీన్లు

(మొదటిపేజి తరువాయి)

సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న సీఎం ఆదేశాల మేరకు అన్ని ప్రధాన కార్యాలయాలు, కలెక్టరేట్లు, పర్యాటక ప్రాంతాలు, దేవాలయాలు, బస్టాండ్‌లు, పారిశ్రామిక ప్రాంతాల్లో మహిళా సంఘాల నిర్వహణలో ప్రత్యేకంగా క్యాంటీన్‌లను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఇప్పటికే, "అన్న" క్యాంటీన్ల పేరుతో కేరళలో, దీదీ కా రసోయ్ అనే పేరుతో బెంగాల్‌లో నడుస్తున్న క్యాంటీన్‌ల పని తీరుపై అధ్యయనం చేసినట్టు వివరించారు. రానున్న రెండేండ్లలో కనీసం 150 క్యాంటీన్లను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. ఈ క్యాంటీన్‌ల నిర్వహణను గ్రామైఖ్య సంఘాలకు అప్పగించనున్నట్టు తెలిపారు. క్యాంటీన్ నిర్వహణపై ఆ సంఘాలకు ప్రత్యేక శిక్షణ కూడా ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. క్యాంటీన్‌ల పనితీరు, నిర్వహణ, వీటి ఏర్పాటుకు ఎంత విస్తీర్ణంలో స్థలం అవసరం, తదితర అంశాలపై రోడ్ మ్యాప్ రూపొందించాల్సింగా గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్‌ను సీఎస్ ఆదేశించారు. ఈ సమావేశానికి రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, ఆరోగ్యశాఖ కమిషనర్ కర్ణన్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, టూరిజంశాఖ డైరెక్టర్ నిఖిల, టూరిజం కార్పొరేషన్ ఎండీ రమేష్ నాయుడు, తదితరులు హాజరయ్యారు.

317జీవోపై ఎస్సీ ఎస్టీ గురుకులాల ఉపాధ్యాయ సంఘాలతో సీతామహాలక్ష్మి భేటీ


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

317జీవో అమలు, ప్రమోషన్లు, బదిలీలు, నూతనంగా అపాయింట్‌మెంట్ ఆర్డర్‌లు తదితర అంశాలపై ఎస్సీ, ఎస్టీ గురుకులాల కార్యదర్శి సీతామహాలక్ష్మి ఉపాధ్యాయ సంఘాలతో భేటీ అయిందని ఉపాధ్యాయుల అభిప్రాయాలను తెలుసుకున్నది. త్వరలో తమ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఉపాధ్యాయులకు హామీ ఇచ్చినట్టు టిగార్వా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి నారాయణ, మధుసూదన్ తెలిపారు. జులై ఒకటి వరకు సమస్యలన్నీ పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

(మొదటిపేజి తరువాయి)

సమస్యను పరిష్కరించాలి. గత మూడేండ్లుగా రాష్ట్రంలో వ్యవసాయ ప్రణాళికలు ప్రకటించలేదు. ఫలితంగా రైతులు ఏ పంటలు వేయాలో స్పష్టత లేక తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా తక్షణమే వ్యవసాయ ప్రణాళిక ప్రకటించాలి. రాష్ట్రమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటన ప్రకారం ఈ ఖరీఫ్‌లో 70 లక్షల ఎకరాల్లో పత్తి, 60 లక్షల ఎకరాల్లో వరి పండించబోతున్నారు. అంటే పప్పులు, నూనెలు, ముతకధాన్యాలకు కేవలం 10 లక్షల ఎకరాలే మిగులుతాయి. ఇవి అనేక సమస్యలకు దారితీస్తాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం తక్షణం వ్యవసాయ ప్రణాళిక ప్రకటించి, రైతులకు తగిన సూచనలివ్వాలి. గత రెండేండ్లుగా రాష్ట్రంలో పంటల బీమా సౌకర్యం లేదు. ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించేవిధంగా పంటల బీమాను అమలు చేయాలి. సన్నధాన్యానికే కాకుండా దొడ్డు ధాన్యానికి కూడా బోనస్ ఇవ్వాలి. ఇతర పంటలకు కూడా బోనస్ వర్తింపచేయాలి.'అని సీపీఐ(ఎం) కోరింది. 'ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.రెండు లక్షల వరకు రుణాన్ని ఏకకాలంలో మాఫీ చేయాలి. రుణమాఫీ వెంటనే అమలుచేయగలిగితే వానాకాలం సాగు పెట్టుబడికి రైతులకు ఉపయోగం జరుగుతుంది. లేకుంటే రైతులు ప్రయివేట్ వడ్డీ వ్యాపారుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోవాల్సి వస్తుంది.



ఆగస్టులోనే రుణమాఫీ చేయాలనుకుంటే ఇప్పుడున్న అప్పులతో నిమిత్తం లేకుండా రైతులకు కొత్తగా రుణాలివ్వాలి. లీడ్ బ్యాంక్ ఇందుకనుగుణంగా రుణ ప్రణాళిక ప్రకటించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి.'అని సీపీఐ(ఎం) సూచించింది.

'రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. గత బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులు, గ్రాట్యూటీ, ప్రభుత్వ జీవిత బీమా, జీపీఎఫ్, సరెండర్ లీవ్స్, కమ్యూటేషన్ వంటి బిల్లులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామపంచాయతీ కార్మికులకు ఆరు నుంచి తొమ్మిది నెలల వేతనం, మున్సిపల్ కార్మికులకు మూడు నెలలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఐదు నెలల బకాయిలు, వైద్యరంగంలో 104 ఉద్యోగులకు ఎనిమిది నెలల బకాయిలున్నాయి.'అని సీపీఐ(ఎం) పేర్కొంది.

'షెడ్యూల్డ్ ఎంప్లాయిస్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల వేతనాల సమస్య తీవ్రంగా ఉంది. కావున ప్రభుత్వం తక్షణమే వేతనాలు చెల్లించి, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలలి. కనీసవేతనాల డ్రాఫ్ట్ జారీలో జరిగిన లోపాలను సరిదిద్ది, పెరుగుతున్న ధరలకనుగుణంగా జీతాలను రాష్ట్ర ప్రభుత్వం సవరించాలి. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై న్యాయవిచారణ జరిపించాలి'అని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది.

అఫిడవిట్లను పరిశీలించాకే విచారణ

(మొదటిపేజి తరువాయి)

తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు భవన్(బీఆర్‌కే)లో మీడియాతో స్వల్ప వ్యవధిలో ఆయన చిట్‌చాట్ చేశారు. గురువారం హైడ్రాలజీ శాఖ అధికారులను విచారించినట్టు తెలిపారు. బ్యారేజీలో ఎక్కువగా నీటిని నిల్వ చేసినందు వల్లే సమస్య వచ్చిందని నిపుణులు చెప్పినట్టు వివరించారు. విజిలెన్స్ విభాగం నివేదికను సైతం కోరినట్టు చెప్పారు. సాంకేతిక అంశాల అనంతరమే ఆర్థిక అంశాలపై దృష్టిసారిస్తామన్నారు. అంచనాలు, రుణాలు, వడ్డీ రేట్లు తదితర విషయాలను అధ్యయనం చేస్తామన్నారు. ఇదిలావుండగా వ్యక్తులతోపాటు ఇతర రూపాల్లో కూడా జస్టిస్ ఘోష్ కమిషన్ సమాచారం సేకరిస్తున్నట్టు తెలిసింది. అలాగే ఆకస్మిక పర్యటనలు చేసేందుకు సైతం సిద్ధమవుతున్నదని సమాచారం.

గ్రేస్ మార్కులు తొలగిస్తాం

న్యూఢిల్లీ : నీట్ పరీక్ష సందర్భంగా సమయం కోల్పోయారనే కారణంతో 1563మంది విద్యార్థులకు కలిపిన గ్రేస్ మార్కులను ఉపసంహరించుకుంటామని కేంద్రప్రభుత్వం గురువారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. వారిలో పరీక్ష తిరిగి రాసేందుకు సిద్ధమైన విద్యార్థులకు జూన్ 23న పరీక్ష నిర్వహించే అవకాశం వుందని తెలిపింది. ఈ విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలపకుండా వారికి వచ్చిన ఒరిజినల్ స్కోర్‌ను తెలియజేస్తామని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన వెకేషన్ బెంచ్‌కు కేంద్రం తెలియజేసింది. పరీక్ష రాయడానికి అవసరమైన 3.2 గంటల సమయాన్ని వారికి అనుమతించలేదనే కారణంతో నార్మలైజేషన్ ఫార్ములా ప్రాతిపదికన 1563మంది అభ్యర్థులకు గ్రేస్ మార్కులు కలపడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై కోర్టు విచారణ జరుపుతోంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఏర్పాటు చేసిన కమిటీ సిఫారసు మేరకు ఈ గ్రేస్ మార్కులు కలిపారు. ఈ చర్యపై పెద్దఎత్తున విద్యార్థులు ఆందోళనలు చేశారు. దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తం కావడంతో ఎన్‌టిఎ మరో కమిటీని నియమించింది. ఈ కమిటీ ఈ నెల 10, 12 తేదీల్లో చర్చలు జరిపింది. కేంద్రం తరపున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది కనూ అగర్వాల్ మాట్లాడుతూ, గ్రేస్ మార్కులు కలపడం వల్లనే ఈ ఆందోళనకర పరిస్థితి ఎదురైందని కమిటీ అభిప్రాయపడినట్లు చెప్పారు. అసలు ప్రయత్నం చేయని ప్రశ్నలకే ఈ గ్రేస్ మార్కులు పరిమితం చేశారు. మే 5న జరిగిన పరీక్షలో పొందిన గ్రేస్ మార్కులు కలపకపోయినప్పటికీ, తిరిగి పరీక్ష రాయడానికి ఇష్టపడని బాధిత విద్యార్థుల వాస్తవ మార్కులను వెంటనే ప్రకటించాలని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. 1563 మంది అభ్యర్థుల్లో తిరిగి పరీక్ష రాసే అభ్యర్థులకు కొత్తగా వచ్చిన మార్కులనే పరిగణనలోకి తీసుకుంటామని, ముందు పరీక్ష నాటి మార్కులను రద్దు చేస్తారని కోర్టు తెలిపింది. తిరిగి పరీక్ష ఎప్పుడు నిర్వహించేది తేదీ కూడా ఈ రోజే చెబుతామని ఎన్‌టీఏ తరపు న్యాయవాది నరేష్ కౌశిక్ అంతకుముందు తెలిపారు.

జూన్ 23న పరీక్ష నిర్వహించి, 30న ఫలితాలు ప్రకటిస్తామని ఆ తరువాత ఎన్‌టీఏ ప్రకటించింది. జులై 6 నుంచి జరగాల్సిన కౌన్సెలింగ్ సెషన్‌కు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఎన్‌టీఏ తెలిపింది. గ్రేస్ మార్కులపై దాఖలైన పిటిషన్లను బెంచ్ విచారించింది. ప్రశ్నాపత్రం లీక్‌ల ఆరోపణలపై స్పందనను రెండు వారాల్లోగా దాఖలు చేయాలని కోర్టు ఎన్‌టిఎను ఆదేశించింది. పది మంది అభ్యర్థులు దాఖలు చేసిన మరో పిటిషన్‌ను విచారించిన కోర్టు, విచారణను జులై 8కి వాయిదా వేసింది.

ఎన్డీఏలో యూసీసీ మంట

(మొదటిపేజి తరువాయి)

ఆయన చెప్పారు. యూసీసీ అమలును బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టో పార్టీ ఎజెండాగా చేర్చిన విషయం తెలిసిందే.

యూసీసీపై 2017 నుండి తమ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని బీజేపీకి జేడీయూ గుర్తు చేస్తోంది. ఆ సంవత్సరం యూసీసీపై బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ లా కమిషన్‌కు తమ అభిప్రాయాన్ని లిఖితపూర్వకంగా తెలియజేశారు. 'యూసీసీని తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అయితే అలాంటి అంశాలపై విస్తృత ఏకాభిప్రాయం ద్వారానే నిర్ణయాలు తీసుకోవాలి తప్పించి ఏకపక్షంగా రుద్దకూడదు' అని లా కమిషన్‌కు సమర్పించిన లేఖలో నితీష్ తెలిపారు. వేర్వేరు మతాలు, విభిన్న జాతుల కోసం చట్టాలతో, పాలనాపరమైన సూత్రాలతో సున్నితమైన సమతూకం పాటిస్తున్న దేశం మనదని నితీష్ వివరించారు. యూసీసీని రుద్దేందుకు చేసే ఏ ప్రయత్నమైనా సామాజిక ఘర్షణకు దారితీస్తుందని, మత స్వేచ్ఛకు సంబంధించి రాజ్యాంగం కల్పించిన గ్యారంటీపై నమ్మకాన్ని వమ్ము చేస్తుందని ఆయన తెలిపారు. లా కమిషన్ పంపిన ప్రశ్నావళిపై నితీష్ కుమార్ ఆ సమయంలో అభ్యంతరం వ్యక్తం చేశారు. నిర్దిష్ట పద్ధతిలో స్పందించేలా సమాధానాలు ఇచ్చే వారిపై ఒత్తిడి చేసే విధంగా ఆ ప్రశ్నావళిని రూపొందించారని ఆయన విమర్శించారు.

మెగా డీఎస్సీపై తొలిసంతకం

(మొదటిపేజి తరువాయి)

అజయ్‌జైన్, శ్రీలక్ష్మి, పీఎస్‌ఆర్ ఆంజనేయులు, సునీల్‌కుమార్, కేవీవీ సత్యనారాయణ తదితరులు చంద్రబాబు రాగానే సచివాలయం మొదటి బ్లాక్ వద్దకు పరుగులు పెట్టారు. వీరిని కలిసేందుకు సీఎం కార్యాలయం అనుమతించకపోవడంతో వెనుతిరిగారు.

బాబుకు రాజధాని రైతుల స్వాగతం

ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబుకు స్వాగతం చెప్పడానికి రాజధాని రైతులు భారీగా తరలివచ్చారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి వెలగపూడి సచివాలయానికి బయల్దేరిన చంద్రబాబుకు సీడ్ యాక్సెస్ రోడ్‌లో దారి పొడవునా పూలు చల్లుతూ స్వాగతించారు. అమరావతికి మళ్లీ మంచి రోజులు వచ్చాయని హర్షం వ్యక్తం చేశారు. క్రేన్ సాయంతో భారీ గజమాల వేసి తమ అభిమానం చాటుకున్నారు. దారి పొడవునా రైతులకు అభివాదం చేస్తూ సీఎం ముందుకు సాగారు.

'మానవాళి'పై ఇజ్రాయిల్ దాడి @250 రోజులు

(మొదటిపేజి తరువాయి)

జర్నలిస్టులు ఉన్నారు.. గాజాకు వెళ్లే అన్ని రహదారులను దిగ్బంధించడంతో పాటు ఆహారంతో సహా సామాగ్రి పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఇప్పటివరకు 33 మంది ఆకలితో మరణించారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారిక నివేదిక వెల్లడించింది. మృతుల్లో 70 శాతం మంది మహిళలు, చిన్నారులే. ఇప్పటి వరకు ఇజ్రాయిల్ 79,000 టన్నుల పేలుడు పదార్థాలను గాజాపై వేసింది. ప్రధాన ఆసుపత్రులు, ప్రార్థనా స్థలాలు ధ్వంసమయ్యాయి. 206 రక్షిత భవనాలు కూడా నేలమట్టమయ్యాయి. 17,000 మంది పిల్లలు తమ తల్లిదండ్రులను కోల్పోయారు. గాజాపై ఇజ్రాయిల్ దాడి చేసిన మొదటి నెలల్లో లైంగిక హింస కూడా జరిగిందని యుఎన్(ఐక్యరాజ్యసమితి) నిపుణులు తెలిపారు. ఇజ్రాయిల్ చేసిన ఈ దాడిని మానవాళికి వ్యతిరేకంగా చేసిన నేరంగా యుఎన్ నివేదిక పేర్కొంది. ఇజ్రాయిల్ చేస్తున్న ఆరోపణలను ఖండించింది. దాడి ప్రారంభమైన అక్టోబర్ 7, 2023 నుండి సంవత్సరం చివరి వరకు జరిగిన సంఘటనలను బృందం పరిశీలించింది. గాజాలో కాల్పులను వెంటనే నిలిపివేయాలన్న ఐక్యరాజ్యసమితి తీర్మానానికి సంబంధించి హమాస్ ప్రతిపాదనను బ్లింకెన్ పరిశీలిస్తుందని అమెరికా విదేశాంగ మంత్రి ఆంథోనీ బ్లింకెన్ తెలిపారు. కొన్ని ప్రతిపాదనలు ఆచరణ సాధ్యం కానివని, పూర్తి కాల్పుల విరమణ, గాజా నుంచి ఇజ్రాయిల్ సైన్యాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవడం వంటి ప్రతిపాదనలను హమాస్ ముందుంచినట్లు సమాచారం. హమాస్ మరియు పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ మధ్యవర్తిత్వ చర్చలకు నాయకత్వం వహిస్తున్న ఖతార్ మరియు ఈజిప్ట్ ద్వారా మార్పులను ప్రతిపాదించాయి.

ఆటలు
నవతెలంగాణ
ఖమ్మం
శుక్రవారం
14 జూన్
2024
12

కార్పొరేట్ విద్యాసంస్థల పుస్తకాల దందా

విద్యార్థులకు అధిక ధరలకు విక్రయిస్తున్న ప్రయివేటు స్కూళ్లు

- సొంత పాఠ్య పుస్తకాలే వాడుతున్న యాజమాన్యాలు
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు
- జీవో నెంబర్ 1ని అమలు చేయని విద్యాశాఖ
- ఎస్‌సీఈఆర్టీ సిలబస్‌ను పట్టించుకోని వైనం
- సేల్ బుక్ ప్రింటర్ల పాఠ్యపుస్తకాలను కొనకుండా ఇష్టారాజ్యం
- పట్టించుకోని రాష్ట్ర సర్కార్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం రాష్ట్ర విద్యా, పరిశోధన శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్టీ) రూపొందించిన సిలబస్‌తో కూడిన పాఠ్యపుస్తకాలనే కొని వాడాలని జీవో నెంబర్ ఒకటి చెప్తున్నది. కానీ ప్రభుత్వ ఆదేశాలను కార్పొరేట్ యాజమాన్యాలు యధేచ్ఛగా బేఖాతర్ చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలను అమలు చేయని ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలంటూ జీవో నెంబర్ ఒకటి చెప్తున్నది. సొంతంగా సిలబస్‌ను తయారు చేసుకుని ముద్రించిన పుస్తకాలనే ఆయా పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విక్రయిస్తున్నాయి. అధిక ధరలకు అమ్ముతుండడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులపై మోయలేని భారం పడుతున్నది. బహిరంగ మార్కెట్‌లో రూ.600 నుంచి రూ.వెయ్యి వరకు పాఠ్యపుస్తకాల ధరలున్నాయి.కానీ ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో రూ.నాలుగు వేల నుంచి రూ.15 వేల వరకు అమ్ముతున్నాయి. ఈ ధరలను ఎవరు నిర్ణయాస్తారో తెలియదు.ఒక్కో యాజమాన్యంలో ఒక్కో తరగతి పుస్తకాల ధరలు ఒక్కో రకంగా ఉంటాయి. తక్కువ ధరకు దొరకాల్సిన పాఠ్యపుస్తకాలు ఎక్కువ ధరకు విక్రయిస్తుండడంతో తల్లిదండ్రులు నష్టపోతున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎస్‌సీఈఆర్టీ ముద్రించిన పుస్తకాలను కొనుగోలు చేయడం లేదు.నిబంధనలను యధేచ్ఛగా తుంగలో తొక్కుతున్నా ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. జీవో నెంబర్ ఒకటి ప్రకారం ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను వినియోగించకపోతే గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలంటూ ఆయా యాజమాన్యాలకు నోటీసులు జారీ చేయడం లేదు. దీంతో ప్రయివేటు,కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరి స్తున్నాయి. పాఠ్యపుస్తకాలతోపాటు నోట్ పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫారాలు, షూ, బెల్టు, టై, బ్యాగులు వంటి వాటిని తమ వద్దే కొనాలంటూ తల్లిదండ్రులకు హుకుం జారీ చేస్తున్నాయి. చదువు పేరుతో అన్ని రకాలుగా దోపిడీకి పాల్పడుతున్నాయి.

హైదరాబాద్ డీఈవో ఆదేశాలతో కొంత ఊరట

ప్రయివేటు,కార్పొరేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫారాలు, షూ, బెల్టు వంటి వాటిని విక్రయించడంపై నిషేధం విధిస్తూ హైదరాబాద్ డీఈవో ఆర్ రోహిణి సర్క్యులర్ జారీ చేశారు.రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా ఎస్‌సీఈఆర్టీ రూపొందించిన సిలబస్ పుస్తకాలనే చదవాలని ఆదేశించారు.లాభాపేక్ష లేకుండా ప్రయివేటు స్కూళ్లలో పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు విక్రయించాలని సూచించారు. ఈ ఆదేశాల వల్ల విద్యార్థులు,తల్లిదండ్రులకు కొంత ఊరట లభించింది.ఇష్టారాజ్యంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అమ్ముతున్న కొన్ని ప్రయివేటు యాజమాన్యాలు విక్రయించకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అమ్మాల్సి వచ్చింది. అయితే అన్ని ప్రయివేటు పాఠశాలలు ఈ ఆదేశాలను పాటించడం లేదు.పాఠ్యపుస్తకాలు,నోట్ పుస్తకాలు, యూనిఫారాలు,స్టేషనరీ వంటి వాటిని వ్యాపారం చేస్తున్నాయి.దీన్ని ప్రభుత్వం అరికట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలను సందర్శించి ఆకస్మిక తనిఖీలు చేసి ఎక్కువ ధరలకు విక్రయించే వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పుస్తకాలు అమ్ముడుపోక ప్రయివేటు ప్రింటర్ల ఆందోళన

రాష్ట్రంలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు 1.21 కోట్ల పాఠ్యపుస్తకాల (సేల్)ను ముద్రించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం ఎంపిక చేసిన ప్రయివేటు ప్రింటర్లు, పబ్లిషర్లు తరగతుల వారీగా ఆ పుస్తకాలను ముద్రించాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ఐదు శాతం రాయల్టీ ప్రకారం సుమారు రూ.6.70 కోట్లు చెల్లించాయి. డీఈవోలు ఎంపిక చేసిన దుకాణాల్లోనే ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు, విద్యార్థులు పాఠ్యపుస్తకాలను కొనాలి. 1.21 కోట్ల పాఠ్యపుస్తకాల్లో ఇప్పటి వరకు కనీసం 25 శాతం కొనుగోలు కాలేదని తెలుస్తున్నది. పుస్తకాలు కొనుగోలు కాకపోవడంతో ప్రయివేటు ప్రింటర్లు, పబ్లిషర్లు ఆందోళనలో ఉన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లపై నియంత్రణను పెంచి ప్రభుత్వ పాఠ్యపుస్తకాలనే వినియోగించాలంటూ ఆదేశాలను జారీ అది సక్రమంగా అమలయ్యేలా చూడ్డంలో విద్యాశాఖ విఫలమవుతున్నది. రాయల్టీని కట్టించుకుని అధికారులు వదిలేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం ఆమోదించిన సిలబస్ పుస్తకాలనే వినియోగించేలా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రింటర్లు, పబ్లిషర్లు డిమాండ్ చేస్తున్నారు.

ఏసీబీకి చిక్కిన సీసీఎస్ సీఐ

- కేసును క్లోజ్ చేసేందుకు రూ.15లక్షలు డిమాండ్
- రెండో విడత రూ.3లక్షలు తీసుకుంటూ..

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఓ కేసు విషయంలో లంచం తీసుకుంటూ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఏసీబీకి చిక్కాడు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ బోయిన్‌పల్లికి చెందిన శ్రీమణి రంగస్వామిపై సీసీఎస్‌లో ఓ కేసు నమోదైంది. ఆ కేసును విచారిస్తున్న డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ ఎకనామిక్ అఫెన్స్ వింగ్ టీం 7లో పని చేస్తున్న ఇన్‌స్పెక్టర్ చామాకురి సుధాకర్.. కేసును అతనికి అనుకూలంగా క్లోజ్ చేసేందుకు రూ.15 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. తొలి విడతగా రూ.5 లక్షలు తీసుకున్నాడు. ఒప్పందం ప్రకారం గురువారం రెండో విడతగా రూ.3 లక్షలు సీసీఎస్ ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్లేస్‌లో సీఐ కారులో పెడుతున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే ఏసీబీ అధికారులను చూసిన సుధాకర్ తప్పించుకోవడానికి ప్రయత్నించగా అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.3 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్‌పై కేసు నమోదు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు.

రూథర్‌ఫోర్డ్ అర్ధ సెంచరీ



న్యూజిలాండ్‌పై గెలుపుతో సూపర్-8కు వెస్టిండీస్

ట్రినిడాడ్: టి20 ప్రపంచకప్ సూపర్-8కు ఆతిథ్య వెస్టిండీస్ జట్టు దూసుకెళ్లింది. గ్రూప్-సిలో న్యూజిలాండ్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు 13 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో వెస్టిండీస్ సూపర్-8లోకి ప్రవేశించగా.. కివీస్ రెండు మ్యాచుల్లో ఓటమితో సూపర్-8కు చేరడం క్లిష్టం చేసుకుంది. తొలుత విండీస్ బ్యాటర్ రూథర్‌ఫోర్డ్.. అజేయ అర్ధ సెంచరీకి తోడు పూరన్(17), హొసైన్(15) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో విండీస్ జట్టు తొలిగా బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. రూథర్‌ఫోర్డ్ అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. 39బంతుల్లో 68 పరుగులు చేసి విండీస్ నుంచి గట్టెక్కించాడు. అతని ఇన్నింగ్స్‌లో ఆరు సిక్సర్లు , రెండు ఫోర్లు ఉన్నాయి. ఓ దశలో విండీస్ 12.3 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 76 పరుగులు మాత్రమే చేసింది. ఆ దశ రూథర్‌ఫోర్డ్ సాహసోపేత ఇన్నింగ్స్ ఆడాడు. విండీస్ జట్టు 112పరుగులకే 9వికెట్ల కష్టాల్లో పడ్డా.. చివరి వికెట్‌కు రూథర్‌ఫర్డ్... పేసర్ మోంటీ(0) సహకారంతో జట్టు స్కోర్‌ను 149పరుగులకు చేర్చాడు. చివరి 12బంతుల్లో 37పరుగులు చేసి జట్టు విండీస్ జట్టు భారీస్కోర్‌కు దోహదపడ్డాడు. అనంతరం 150 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 136 పరుగులే చేసింది. వెస్టిండీస్ బౌలర్లలో అల్జరీ జోసెఫ్‌కు నాలుగు, మోంటీకి మూడు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రూథర్‌ఫోర్డ్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు...

వెస్టిండీస్ ఇన్నింగ్స్: కింగ్ (సి)కాన్వే (బి)నీషమ్ 9, ఛార్లెస్ (బి)బౌల్ట్ 0, పూరన్ (సి)కాన్వే (బి)సౌథీ 17, రోస్టన్ ఛేస్ (సి)రచిన్ రవీంద్ర (బి)ఫెర్గుసన్ 0, రువాన్ పావెల్ (సి)కాన్వే (బి)సౌథీ 1, రూథర్‌ఫోర్డ్ (నాటౌట్) 68, ఆకెల్ హొసైన్ (సి)నీషమ్ (బి)సాంట్నర్ 15, రస్సెల్ (సి)ఫెర్గుసన్ (బి)బౌల్ట్ 14, షెఫర్డ్ (ఎల్‌బి)ఫెర్గుసన్ 13, జోసెఫ్ (బి)బౌల్ట్ 6, మోంటీ (నాటౌట్) 0, అదనం 6. (20ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 149పరుగులు.

వికెట్ల పతనం: 1/1, 2/20, 3/21, 4/22, 5/30, 6/58, 7/76, 8/103, 9/112

బౌలింగ్: బౌల్ట్ 4-1-16-3, సౌథీ 4-0-21-2, ఫెర్గుసన్ 4-0-27-2, నీషమ్ 4-0-27-1, ఫిలిప్స్ 1-0-9-0, సాంట్నర్ 2-0-27-1, మిఛెల్ 1-0-19-0

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి)రోస్టన్ ఛేస్ (బి)ఆకెల్ హొసైన్ 5, ఫిన్ అలెన్ (సి)రస్సెల్ (బి)జోసెఫ్ 26, రచిన్ రవీంద్ర (సి)రస్సెల్ (బి)మోటీ 10, విలియమ్సన్ (సి)పూరన్ (బి)మోంటీ 1, మిఛెల్ (బి)మోటీ 12, ఫిలిప్స్ (సి)రువన్ పావెల్ (బి)జోసెఫ్ 40, నీషమ్ (సి)కింగ్ (బి)జోసెఫ్ 10, సాంట్నర్ (నాటౌట్) 21, సౌథీ (సి అండ్ బి)జోసెఫ్ 0, బౌల్ట్ (సి)రోస్టన్ ఛేస్ (బి)రస్సెల్ 7, ఫెర్గుసన్ (నాటౌట్) 0, అదనం 4, (20ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 136పరుగులు.

వికెట్ల పతనం: 1/20, 2/34, 3/39, 4/64, 5/63, 6/85, 7/108, 8/108, 9/117

బౌలింగ్: ఆకెల్ హొసైన్ 4-0-21-1, షెఫర్డ్ 3-0-36-0, రస్సెల్ 4-0-30-1, జోసెఫ్ 4-0-19-4, మోంటీ 4-0-25-3, ఛేస్ 1-0-4-0

అమెరికా క్రికెట్ స్టేడియం తొలగింపు



న్యూయార్క్: అమెరికాలోని నసావు కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియాన్ని తొలగించారు. ఈ టోర్నీ కోసం న్యూయార్క్‌లో నసావు కౌంటీ క్రికెట్ గ్రౌండ్‌ను ఆగమేఘాల మీద నిర్మించిన సంగతి తెలిసిందే. ఈ స్టేడియంలో జరగాల్సిన మ్యాచ్‌లన్నీ ముగియడంతో ఈ మైదానాన్ని తీసేశారు. ఆ స్టేడియాన్ని క్లీన్ చేసేందుకు కసరత్తులు సిద్ధం అయ్యాయి. బుధవారం అమెరికాతో భారత్ ఆడిన మ్యాచే ఆ వేదికలో చివరిది. ఈ పాక్షిక స్టేడియాన్ని క్రమంగా తొలగించనున్నారు. కేవలం వంద రోజుల వ్యవధిలోనే నసావు స్టేడియాన్ని నిర్మించారు. అయితే ఈ పిచ్‌పై ఆడిన అన్ని జట్లు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. అనూహ్యమైన బౌన్స్ ఉన్న ఈ స్టేడియంలో బౌలర్లే పైచేయి సాధించారు. బ్యాటర్లకు పరుగులు తీయడం కష్టం అయ్యింది. మైదానంలో ఉన్న పచ్చికను అడిలైడ్‌ను తీసుకువచ్చి ఇక్కడ పరిచారు. లాంగ్ ఐలాండ్‌లో ఉన్న ఈసన్‌ఓవర్ పార్కులో ఈ స్టేడియాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. పది రకాల డ్రాప్ ఇన్ పిచ్‌లతో ఇక్కడ మైదానాన్ని నింపేశారు. దీంట్లో నాలుగు గ్రౌండ్లు ప్రధానమైనవి కాగా, ఆరు శిక్షణ కోసం వాడారు. బుధవారం మ్యాచ్ తర్వాత క్రమ పద్ధతిలో నసావు స్టేడియాన్ని తొలగించనున్నారు. మైదానం నుంచి తీసిన పచ్చిక లాస్ వెగాస్‌కు తరలించనున్నారు. ఆరు వారాల వ్యవధిలో నసావు స్టేడియాన్ని పూర్తిగా నిర్మూలిస్తారు. ఈ స్టేడియం సామర్థ్యం 34 వేలు. జూన్ 9వ తేదీన భారత్, పాక్ మధ్య జరిగిన మ్యాచ్‌కు ఈ స్టేడియం పూర్తిగా నిండిపోయింది.

బాలికల చెస్ ఛాంప్ దివ్య



గాంధీనగర్(గుజరాత్): ప్రపంచ జూనియర్ బాలికల చెస్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను భారత్‌కు చెందిన దివ్య దేశ్‌ముఖ్ చేజిక్కించుకుంది. గురువారం జరిగిన చివరి రౌండ్ పోటీలో దివ్య బల్గేరియాకు చెందిన క్రస్టేవాపై సంచలన విజయం సాధించింది. నాగ్‌పూర్‌కు చెందిన 18ఏళ్ల దివ్య.. ఈ టోర్నీలో టాప్‌సీడ్‌గా బరిలోకి దిగింది. మొత్తం 11 రౌండ్‌లకు జరిగిన ఈ పోటీలో దివ్య 9విజయాలు 2డ్రాలతో 10పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. మిర్బియన్(9.5), అల్లహ్వదియేవా(8.5) ఆ తర్వాత స్థానాల్లో నిలిచారు. ఆర్మేనియాకు చెందిన గరిబ్యాన్(8.5పాయింట్లు), అమెరికాకు చెందిన యెమిన్ ఒహన్యాన్ కూడా 8.5పాయింట్లతో గరిబ్యాన్‌తో సమంగా నిలిచినా.. టై బ్రేక్‌లో విజయం సాధించడంతో గరిబ్యాన్ ఆ తర్వాతి స్థానంతో సరిపుచ్చుకుంది.

మత్స్యకారుల జీవితాల్లోని సంఘర్షణతో రేవు



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'రేవు'. ఈ చిత్రాన్ని సంహిత్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై డా. మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

సినిమా ప్రొడక్షన్ పర్యవేక్షకులుగా ఫిలిం జర్నలిస్ట్ ప్రభు, ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా ఫిలిం జర్నలిస్ట్ పర్వతనేని రాంబాబు వ్యవహరిస్తున్నారు. హరినాథ్ పులి దర్శకుడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

గురువారం ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకలో సినిమా పర్యవేక్షకులు, ఫిలిం జర్నలిస్ట్ ప్రభు మాట్లాడుతూ, 'సముద్రతీర ప్రాంతంలో చేపలు పట్టడమే జీవనాధారంగా బతికే మత్స్యకారుల జీవితాల్లోని సంఘర్షణ చూపించే చిత్రమిది. చాలా సహజంగా సినిమా సాగుతుంది. మూవీలో ఎమోషన్ ఆకట్టుకుంటుంది. ఆర్టిస్టుల నేచురల్ పర్ఫార్మెన్స్ చేశారు. దర్శకుడు హరినాథ్ పులి చిన్న ఎంతో క్లారిటీగా ఆకట్టుకునేలా సినిమాను రూపొందించాడు. ఈ సినిమా చూసి ప్రొడ్యూసర్ మురళీ గింజుపల్లి చాలా హ్యాపీగా ఫీలయ్యారు. మేమంతా ఈ సినిమా చూసి ఎలాంటి అనుభూతికి లోనయ్యామో...అదే అనుభూతిని రేపు మీరంతా థియేటర్‌లో చూస్తూ పొందుతారు. సినిమా రిలీజ్‌కు రెడీగా ఉంది' అని తెలిపారు.

'మంచి కంటెంట్ ఉన్న చిత్రమిది. డాక్టర్ మురళీ గింజుపల్లి నాకు నుంచి మంచి మిత్రులు. మేము చెప్పిన వెంటనే సినిమాను ప్రొడ్యూస్ చేస్తామంటూ ముందుకొచ్చారు. సంహిత్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో మరిన్ని మూవీస్ ప్రొడ్యూస్ చేయాలని, ఆయనతో మా ట్రావెల్ కొనసాగాలని కోరుకుంటున్నాం' అని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు చెప్పారు. నిర్మాత డా.మురళీ గింజుపల్లి మాట్లాడుతూ, 'నేను యూఎస్‌లో ఉంటాను. సినిమాలంటే ప్యాషన్. మా సంస్థ ద్వారా మొదట ఒక మంచి సినిమాతో అడుగుపెట్టాలని కోరుకున్నాను. ఈ సినిమా కాపీ చూశాక నేను చాలా ఎగ్జైట్ అయ్యాను. మంచి మూవీ. ఈ సినిమా గురించి చెప్పగానే నా స్నేహితుడు నవీన్ పారుపల్లి కూడా మూవీలో భాగమవుతానంటూ ముందుకొచ్చారు' అని అన్నారు.

నవచిత్రం

సెప్టెంబర్ 27న దేవర రిలీజ్



ఎన్టీఆర్

ఎన్టీఆర్ టైటిల్ పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'దేవర'. కొరటాల శివ డైరెక్షన్‌లో ఈ మూవీ అత్యద్భుతంగా, శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోంది. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో మరో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ కీలక పాత్రను పోషిస్తున్నారు. గురువారం చిత్ర యూనిట్ ఈ మూవీ కొత్త రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేసింది. ప్రేక్షకులకు ఈ హై యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించటానికి దీన్ని రెండు భాగాలుగా రూపొందిస్తున్నారు.

అందులో తొలి భాగం 'దేవర: పార్ట్ 1' సెప్టెంబర్ 27న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఎంటైర్ ఇండియాలోని సినీ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ పాన్ ఇండియా భారీ చిత్రాన్ని విడుదల చేయటానికి ఇదే కరెక్ట్ డేట్ అని మేకర్స్ భావిస్తున్నారు. తాజా రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్‌తో ఈ చిత్రంపై అంచనాలు మరింతగా పెరిగాయి. ఎన్టీఆర్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజన్స్, కొరటాల శివ టేకింగ్‌ను ఎప్పుడెప్పుడు సిల్వర్ స్క్రీన్‌పై చూద్దామా అని ఎన్టీఆర్ అభిమానులు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, షైన్ టామ్ చాకో, నరైన్ కీలక పాత్రలను పోషించారు. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్, ఆర్.రత్నవేలు సినిమాటోగ్రఫీ, సాబు శిరిల్ ప్రొడక్షన్ డిజైనింగ్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

ఫ్రెష్ లుక్‌తో హరోం హర



సుధీర్ బాబు

హీరో సుధీర్ బాబు నటించిన తాజా చిత్రం 'హరోం హర'. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ జి నాయుడు నిర్మించిన ఈ ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌కి 'సెహరి' ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించారు.

ఈ సినిమా నేడు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరో సుధీర్ బాబు మీడియాతో మాట్లాడుతూ, 'చాలా అథంటిక్‌గా చేసిన కమర్షియల్ సినిమా. ఆడియన్స్‌కి ఓ కొత్త వరల్డ్ చూసిన ఫీల్ వస్తుంది. ట్రైలర్ చూసి మహేష్‌బాబు కూడా ఇదే అన్నారు. వరల్డ్ బిల్డింగ్, బ్యాక్‌ డ్రాప్ ఫ్రెష్‌గా ఉన్న సినిమాలని ప్రేక్షకులు ఇష్టపడుతున్నారని చెప్పారు. మహేష్ చాలా ఎగ్జైట్‌గా ఉన్నారు. యాక్షన్ సీన్స్ చాలా బావున్నాయని మెచ్చుకున్నారు. నేను చేసిన గన్ స్మిత్ క్యారెక్టర్ చాలా కొత్తగా ఉంటుంది. నాపాత్ర అందరికీ గుర్తుండిపోతుంది. ఇలాంటి బ్యాక్‌డ్రాప్‌తో తెలుగులో ఏ సినిమా రాలేదని నా ఫీలింగ్.

ఇందులో క్యారెక్టర్‌కి డైలాగ్ మ్యానరిజం ఉంటుంది. 'ఇంక సెప్పేదేమ్ లేదు.. 'సేసేదే' అనే డైలాగ్ సినిమాలో చాలా చోట్ల వస్తుంది' అని అన్నారు.

రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్



హెబ్బా పటేల్, చైతన్య రావ్

చైతన్య రావ్, హెబ్బా పటేల్ జంటగా నటిస్తున్న సినిమా 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. ఈ చిత్రాన్ని న్యూ రీల్ ఇండియా బ్యానర్ పై కేకేఆర్, బాలరాజ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాని ప్రయోగాత్మకంగా ఫ్యూచరిస్టిక్ రొమాంటిక్ కామెడీగా దర్శకుడు బాల రాజశేఖరుని రూపొందించారు.

ఈ సినిమా ఈ నెల 21న వరల్డ్ వైడ్ థియేటర్లలో రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో గురువారం ప్రసాద్ ల్యాబ్స్‌లో చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని ఘనంగా నిర్వహించారు.

హీరోయిన్ హెబ్బా పటేల్ మాట్లాడుతూ, 'ఈ సినిమాతో ఎగ్జైటింగ్, ఇంట్రెస్టింగ్ జర్నీ చేశాం. మీరంతా థియేటర్స్‌లో చూసి ఆదరిస్తారని కోరుకుంటున్నా' అని అన్నారు.

'ఈ సినిమాని యూత్, ఫ్యామిలీ ఆడియెన్స్ అందరికీ నచ్చేలా రూపొందించాం. 30 వెడ్స్ 21 చైతన్య రావ్‌ను, కుమారి 21 ఎఫ్ హెబ్బా పటేల్‌ను జంటగా ఈ మూవీలో చూపించడమే ప్రత్యేకత. చైతన్య రావ్‌కు, హెబ్బా పటేల్‌కు డిఫరెంట్ ఇమేజ్‌లు ఉన్నాయి. వారి జంట ఈ మూవీలో ప్రేక్షకులకు కొత్త ఫీల్ కలిగిస్తుంది. వంద కోట్ల సినిమా అయినా పది కోట్ల రూపాయల సినిమా అయినా కంటెంట్ బాగుంటేనే ప్రేక్షకులు చూస్తారు. అలాంటి మంచి కంటెంట్ మా మూవీలో ఉంది. కల్యాణి మాలిక్ పాటలు బ్యూటిఫుల్‌గా కంపోజ్ చేశారు. మంచి రొమాంటిక్ కామెడీ మూవీగా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అని దర్శకుడు బాల రాజశేఖరుని చెప్పారు.

హీరో చైతన్య రావ్ మాట్లాడుతూ, 'ప్రతి నటుడికి అన్ని రకాల ఎమోషన్స్ ఉన్న క్యారెక్టర్ చేయాలనే కోరిక ఉంటుంది. నాకు అలాంటి అవకాశం ఈ సినిమా ద్వారా దక్కింది. దర్శకుడు బాలాలో హాలీవుడ్ ఫిల్మ్ మేకింగ్ స్టైల్ ఉంటుంది. ఈ సినిమాలోనూ అది కనిపిస్తుంది. లవర్స్, పెళ్లి చేసుకోబోయే వాళ్లు, పెళ్లి చేసుకున్న కొత్త జంట, పెళ్లై ఇరవై ఏళ్లయిన జంటలు ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఈ సినిమా ఉంటుంది. వాళ్లందరికీ రిలేట్ అయ్యే అంశాలుంటాయి' అని చెప్పారు.

నీ దారే.. నీ కథ



అంజన బాలాజీ, ప్రియతమ్ మంతిని

వంశీ జొన్నలగడ్డ దర్శకత్వంలో సంగీత ఆధారిత కథతో రూపొందిన చిత్రం 'నీ దారే నీ కథ'. ఆకర్షణీయమైన సినిమాటిక్ అనుభవాన్ని ఈ సినిమా అందించనుంది. అభిరుచి, స్నేహం, మన కలలను సాధించాలనే సంకల్పం, తండ్రీ కొడుకుల మధ్య ఉన్న బంధం వంటి అంశాలతో ప్రేక్షకులు భావోద్వేగాల రోలర్‌కోస్టర్‌లా ఫీల్ అవుతారు.

నేడు(శుక్రవారం) ఈ సినిమా రిలీజ్ కాన్ను నేపథ్యంలో మేకర్స్ ప్రీమియర్ షోని ప్రదర్శించారు. ఈ షోకి సర్వత్రా ప్రశంసలు దక్కాయి.

ఈ సందర్భంగా దర్శకుడు, నిర్మాత వంశీ జొన్నలగడ్డ మాట్లాడుతూ, 'ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేసినప్పటి నుంచి మమ్మల్ని సపోర్ట్ చేసి ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. టీజర్, ట్రైలర్ చూసిన ప్రతి ఒక్కరు ఈ సినిమా గురించి చాలా పాజిటివ్‌గా మాట్లాడారు. ఇప్పుడు ప్రీమియర్‌లో ఈ సినిమా చూసినవారు బాగుందని ప్రశంసిస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ప్రేక్షకులు కూడా ఈ సినిమాని చూసి ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అని చెప్పారు.

సినిమా కాదు.. జీవితం



అజయ్ ఘోష్, చాందినీ చౌదరి

అజయ్ ఘోష్, చాందినీ చౌదరి ప్రముఖ పాత్రల్లో నటించిన చిత్రం 'మ్యూజిక్ షాప్ మూర్తి'. ఫ్లై హై సినిమాస్ బ్యానర్ పై హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మించారు. శివ పాలడుగు ఈ సినిమాకి కథ, కథనాన్ని అందించి దర్శకత్వం వహించారు. ఈ సినిమా నేడు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.

అజయ్ ఘోష్ మాట్లాడుతూ, 'మా చిత్రాన్ని చూసి రిలీజ్ చేసేందుకు ధీరజ్ ముందుకు వచ్చారు. టాలెంట్‌ను గుర్తించి, భుజం తట్టే వాళ్లు నడిపించే వాళ్లు లేకపోతే ముందుకు వెళ్లలేం. ప్రతీ ఒక్కరూ ఈ సినిమాతో కనెక్ట్ అవుతారు. ఏం అవ్వాలనుకున్నామో.. ఏం అయ్యామో.. ఏమై మిగిలిపోయామో.. ఈ సినిమా చూసిన తరువాత తెలుస్తుంది. ఈ మూవీ చూసి ఆనందపడతారు. కుమిలిపోతారు. దయానంద్, చాందినీ, ఆమని ఇలా ప్రతీ ఒక్కరూ అద్భుతంగా నటించారు. ఇది సినిమా కాదు.. జీవితం. ఈ సినిమా చూసిన తరువాత ఎవరైనా ఏదైనా సాధిస్తారు. ప్రతీ కుటుంబం చూడాల్సిన సినిమా. అన్ని వర్గాల వారికి ఈ చిత్రం నచ్చుతుంది' అని తెలిపారు.

'కల కనడానికి ఓ వయసంటూ ఉండదు. ఓ లక్ష్యం, కల కనడానికి వయసుతో సంబంధం లేదని చెప్పడమే మా సినిమా ఉద్దేశ్యం' అని చాందినీ చౌదరి చెప్పారు. దర్శకుడు శివ పాలడుగు మాట్లాడుతూ, 'మా చిత్రం అందరికీ వంద శాతం నచ్చుతుంది. స్ఫూర్తిదాయకంగా, ఎమోషనల్‌గా ఉండే చిత్రమిది' అని అన్నారు.

'అజయ్ ఘోష్ ఎంతటి నటులో ఈ చిత్రం చూస్తే అందరికీ తెలుస్తుంది' అని నిర్మాత హర్ష గారపాటి తెలిపారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886